గురువారం 18-5-2023

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 56

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'



మా పాట అడవి దాటింది

ధ్వని పుట్టింది... రాగం ఆవిర్భవించింది. మాట పుట్టింది... పాట రూపుదిద్దుకుంది. ఆది సంస్కృతి... ఆదిరాగాన్ని ఆవిష్కరించింది. ఆ రాగాల పరిరక్షణకు అంకితమైన గాయని లక్ష్మీబాయ్.

-IIలో

ధ్వని పుట్టింది... రాగం ఆవిర్భవించింది.
మాట పుట్టింది... పాట రూపుదిద్దుకుంది.
ఆది సంస్కృతి... ఆదిరాగాన్ని ఆవిష్కరించింది.
ఆ రాగాల పరిరక్షణకు అంకితమైన గాయని
లక్ష్మీబాయ్.



మా పాట అడవి దాటింది
ఆదివాసీ గాయని లక్ష్మీబాయ్

హైదరాబాద్‌లో గవర్నర్ బంగళా. ఈ ఏడాది మార్చిలో మహిళాదినోత్సం వేడుకలకు సిద్ధమైంది. తమ తమ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన మహిళలు పురస్కారాలందుకుంటున్నారు. వారిలో ఓ మహిళ పెందూరు లక్ష్మీబాయ్. ఆదిలాబాద్ నుంచి వచ్చిన ఆదివాసీ గాయని ఆమె. గవర్నర్ చేతుల మీదుగా సన్మానం చేయించుకున్న సంతోషం ఆమె ముఖంలో ప్రతిఫలిస్తోంది. ఈ గౌరవాన్ని అందుకున్న లక్ష్మీబాయ్ తన జీవితాన్ని ఆదివాసీ సంస్కృతి పరిరక్షణకే అంకితం చేసింది. ఆమె సాక్షితో పంచుకున్న వివరాలివి.

''మాది ఆదిలాబాద్ జిల్లా గుడి హత్నూర్ మండలం, తోషం గ్రామం. మా తెగ పేరు తోటీ. సిటీల వాళ్లు టాటూ అని ఇప్పుడు ఫ్యాషన్‌గా వేసుకుంటున్నారు చూశారా... అదే... పచ్చబొట్టు. ఆ పచ్చబొట్టు వేయడం మా వృత్తి. అడవుల్లో మూలికలు, వేళ్లను సేకరించి పసరు తయారు చేసుకుంటాం. మా సంస్కృతి, జీవనం గోండ్ రాజులతోపాటుగా ఉండేది. గోండ్ రాజుల దగ్గర కళాకారులం. కిక్రీ అనే వాయిద్యంతో పాటల రూపంలో మహాభారతం, రామాయణం, రాజుల కథలను చెబుతాం. రేలా పాటలైతే వందల్లో ఉంటాయి. అవన్నీ మాకు నోటికి వస్తాయి. పుస్తకం చూడాల్సిన అవసరం లేదు. మా పేర్లు కూడా రామాయణ, మహాభారతాలు, గొప్ప రాజుల చరిత్ర కథల్లో ఉండే పేర్లే ఉంటాయి.

■ పాటని వదలం

అన్నం దొరకకున్నా సరే పాటను మాత్రం వదలం. మా పుట్టిల్లు మంచిర్యాల జిల్లా, జన్నారం మండలం, పుట్టిగూడ. మా చిన్నప్పుడు తినడానికి కూడా ఇప్పుడున్నంత వెసులుబాటు ఉండేది కాదు. గోండ్ రాజుల ఇంట్లో పండగ, శుభం... అశుభం... ఏదో ఒక సందర్భంలో వాళ్లు జొన్నలు పెడితే అదే సంతోషం. మిగిలిన రోజుల్లో అడవి తల్లే ఆధారం. అలాంటి గడ్డు రోజుల్లో కూడా మేము మా సంస్కృతిని వదల్లేదు. కిక్రీ వాయిద్యాలను మూలన పెట్టలేదు. సంస్కృతిని, కళను అంతరించి పోనివ్వకూడదని మాకు మేము ఒట్టు పెట్టుకుంటాం. మా వంశాల్లో తరతరాల సంపద మా నోటిపాట, మాట. చిన్నప్పటి నుంచి ఎన్నో ఏళ్లపాటు నేర్చుకుంటూ, మర్చిపోకుండా సాధన చేస్తూనే ఉంటాం. అప్పట్లో మా పాట అడవిలోనే ఉండేది. ఇప్పుడు సర్కారు శ్రద్ధ పెట్టడంతో మా కళ అందరికీ తెలుస్తోంది. ఆకాశవాణిలోనూ మా పాటలు వచ్చాయి.



గవర్నర్ తమిళిసై నుంచి పురస్కారం అందుకుంటున్న లక్ష్మీ బాయ్

■ పురస్కారం మా కళకే!

నా భర్త తుకారామ్ కిక్రీ వాద్యకారుడు. నేను రేల పాటలు పాడుతాను. ఆయన, నేను పాటలు పాడుతూ ఊళ్లు తిరిగాం. ఢిల్లీలో 2006లో రిపబ్లిక్ దినోత్సవాలకు వెళ్లి మా కళలను ప్రదర్శించాం. రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ గారి చేతుల మీదుగా సన్మానం అందుకున్నాం. ఈ ఏడు హైదరాబాద్‌లో గవర్నర్ చేతుల మీద సన్మానం, మధ్యలో ఆదిలాబాద్ జిల్లాలో అనేక కార్యక్రమాల్లో మా పాటలు, దండలు, శాలువాలతో గౌరవించారు. అంతపెద్ద వాళ్లు మాకు దణ్ణం పెడుతుంటారు. ఆ దణ్ణం మాక్కాదు, మా ఆకలి తీరుస్తూ, మమ్మల్ని కడుపులో పెట్టుకుని కాపాడే మా అడవి తల్లికి. అక్షరం రాని మా నాలుక మీద పెద్ద పెద్ద గ్రంథాలను పలికిస్తున్న మా కులదైవానికే. మేము ఏటా జనవరిలో ఒకసారి, ఈ నెలలో (మే నెల) ఒకసారి మా ఉత్సవాలు చేసుకుంటాం. మా పాటలన్నీ మా నాలుకల మీద నాట్యం చేస్తున్నాయి.

■ నగరానికి చేరిన 'ఆది' పాట

ఐఏఎస్ ఆఫీసర్ దివ్య దేవరాజన్ ఈ కళను మా దగ్గరే ఆగిపోనివ్వకుండా అందరికీ తెలియచేయాలని సంక్షేమ హాస్టల్‌లో చదువుకుంటున్న ఆడపిల్లలకు నేర్పించమన్నారు. ఆమె మాట మీద రెండు నెలలు అక్కడే ఉండి నేర్పించాను. నాకు రాయడం రాదు, వందల పాటలు పాడతాను. మా చిన్నప్పుడు బడుల్లేవు. ఇప్పుడు మా ఆదివాసీలు పిల్లలందరినీ చదివించారు. మేము మా నలుగురు పిల్లలనూ చదివించాం. రాయడం వచ్చినోళ్లు ఈ పాటలను రాస్తే ఎప్పటికీ ఉంటాయి. ఇప్పటోళ్లు మేము పాడుతుంటే పాటలు రికార్డ్ చేసి యూ ట్యూబులో పెడుతున్నారు. మా పాట నగరాలకు చేరుతోంది. నగరాల వాళ్లు ఈ పాటలను టీవీల్లో పాడుతున్నారు. వాటిని చూసినప్పుడు మాకు ఖుషీగా ఉంటుంది. నా కంఠంలో ప్రాణం ఉన్నంత కాలం పాట ఆపను. నా భర్తతో కలిసి ఎన్నెన్ని పాటలు పాడానో... ఇప్పుడు నాతో ఉన్నది ఆయనతో పాడిన పాటలే'' అని తాను ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు అంకితమైన వైనాన్ని వివరించారు పెందూరు లక్ష్మీబాయ్.

– వాకా మంజులారెడ్డి

ఇంటర్నేషనల్ కాల్స్ వస్తున్నాయా?!

సైబర్ టాక్



ఇటీవల ఇండోనేషియా (+62), వియత్నాం (+84), మలేషియా (+60), కెన్యా (+254), ఇథియోపియా (+251).. మొదలైన దేశాల నుంచి వచ్చే ఇంటర్నేషనల్ ఫోన్‌కాల్స్‌ను తమకు తెలియకుండా అప్రయత్నంగా.. అనుకోకుండా రిసీవ్ చేసుకుంటూ ఆర్థిక మోసాల బారిన పడుతున్నారు చాలా మంది. ఈ సైబర్‌నేరగాళ్ల నుంచి జాగ్రత్తపడటమే కాదు మన తోటి వారికీ అవగాహన కలిగించడం అవసరం.

•••

ఆఫీసుకువెళ్లే హడావిడిలో ఫోన్ మోగితే లిఫ్ట్ చేసింది గీత. ఒక లార్జ్ గ్రూప్ ద్వారా ఆన్‌లైన్ ఆదాయ వనరులను పరిచయం చేయబోతున్నామని, అందుకు సంబంధించిన వివరాలను ఫోన్‌కి పంపుతున్నామని చెప్పారు కాలర్. అందుకు ఎన్ని లెవల్స్ ఉంటాయో, ఎలా పాల్గొనవచ్చో కూడా చెప్పిన విధానం గీతకు బాగా నచ్చింది. ముందు ఫ్రీ టాస్క్‌లో పాల్గొని, అంతా నచ్చితే కొనసాగించమని, అందుకు సంబంధించిన వివరాల మెసేజ్‌ను పంపుతామని, చెక్ చేసుకోమని, గ్యారంటీ ప్రాఫిట్ అని చెప్పడంతో గీతకు ఆనందమేసింది. ఆఫీసుకు వెళ్లాక ఫోన్‌కి వచ్చిన వాట్సప్ మెసేజ్ చూసింది. గ్రూప్‌లో జాయినవమని వచ్చిన మెసేజ్ అది. ఆ గ్రూప్‌లో జాయిన్ అయింది. చాలా మంది ఉన్న ఆ గ్రూప్‌లో పెద్ద పెద్ద వాళ్లు ఉన్నారని అర్థమైంది. ఆ గ్రూప్‌లో చూపించిన విధంగా తన అకౌంట్‌కి లాగిన్ అయి, ఫ్రీ టాస్క్‌లో చేరితే వెంటనే తన అకౌంట్‌లోకి రూ.500 వచ్చాయి. ఆనందపడుతూ వాళ్లు చెప్పిన టాస్క్‌ని పూర్తి చేస్తే, మరో రూ.1000 జమ అయ్యాయి. వాటిని విత్ డ్రా చేసుకున్నాక, పెయిడ్ టాస్క్‌కు వెళ్లి లక్ష రూపాయలు పోగొట్టుకున్నాక కానీ, అర్థం కాలేదు గీతకు తను మోసపోయానని. విదేశీ మోసగాళ్లు వర్క్ ఫ్రమ్ హోమ్ పేరిట కూడా ఇలాంటి మోసాలకు పాల్పడుతుంటారు.

ఫేక్ లైక్స్..

డీపీ లు మొత్తం ఇండియన్ అమ్మాయిల ఫొటోలు ఉంటాయి. కానీ, ఫేక్ ప్రొఫైల్స్ ఉంటాయి. మనవాళ్లే కదా అని జాయిన్ అవుతాం. వాయిస్ కూడా మన ఇండియన్ స్టైల్ లోనే ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్ లైక్స్, యూ ట్యూబ్ వ్యూస్...పెంచడం కోసం ఒక టాస్క్ ఉంటుంది. ముందు ఫ్రీ టాస్క్‌ల పేరుతో ఆకట్టుకుంటారు. మనకు ఎప్పుడైతే డబ్బులు వస్తాయో అప్పుడు ఆ గేమ్ పట్ల ఆసక్తి పెరుగుతుంది. నిజమైన ప్లేయర్లతో పాటు స్కామర్లు కూడా ఉంటారు. రూ. 500 వచ్చాయని, రూ.1000 వచ్చాయని స్క్రీన్ షాట్స్ షేర్ చేస్తుంటారు. కొంత టైమ్ అయ్యాక ఫ్రీ టాస్క్ పూర్తయిందని, పెయిడ్ టాస్క్ ఉందని చెబుతారు. వీటిలో మళ్లీ రకరకాల గ్రూప్స్‌లో మనల్ని యాడ్ చేస్తారు. రూ.1000 పెడితే 1300 ఇస్తాడు. వెంటనే 300 రావడంతో ఆశ పెరుగుతుంది. 5000 పెడితే మరో 2000 అదనంగా వస్తాయని చూపుతారు. ప్రతీ టాస్క్ పై ఒత్తిడితో కూడా ప్రైజర్ ఉంటుంది.రూ. 7000 మన అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేసేలోపు టైమ్ లాప్స్ అయిపోయిందని చెబుతారు.

దీనిని డ్రా చేయాలంటే రూ. 10000 పెట్టమంటారు. ఇవన్నీ మల్టిపుల్ అకౌంట్స్ , ఇండియన్ అడ్రస్ ఉన్న ప్రైవేట్ బ్యాంకుల ఖాతాలు చూపుతారు. మనం నిజమే కదా అని నమ్మి వాళ్ల ట్రాప్‌లో పడతాం. అప్పుడు మెల్ల మెల్లగా రూ.50 నుంచి మొదలు పెట్టి పది లక్షల వరకు రూట్ మార్చుతుంటారు. ఇరవై రోజుల క్రితం 20 లక్షలు వరకు జరిగిన మోసం నిన్న 60 లక్షల రూపాయలతో సైబర్ క్రైమ్‌లో కేస్ నమోదైంది.

స్పామ్ కాల్స్‌కి ఆన్సర్ చేయద్దు

- తెలియని ఇంటర్నేషనల్ ఫోన్ కాల్స్‌ని నమ్మొద్దు. ఈ కాల్స్ వచ్చినప్పుడు అపనమ్మకంగానే కాదు అప్రమత్తంగానూ ఉండడటం అవసరం.
- కాలర్ ఐడెంటిటినీ వెరిఫై చేసుకోవాలి.
- ఆధార్‌కార్డ్, పాన్‌కార్డ్, బ్యాంక్ అకౌంట్ వంటి వ్యక్తిగత వివరాలను కాలర్స్‌కి ఇవ్వద్దు.
- స్పామ్ కాల్స్‌ని రిసీవ్ చేసుకోవద్దు. అలాంటి వాటిని ట్రూ కాలర్‌లో చెక్ చేసుకోండి.
- వాట్సప్, టెలిగ్రామ్, ట్రూ కాలర్‌లో అనుమానించదగిన ఫోన్‌కాల్స్ వచ్చినప్పుడు ఆ యాప్స్‌కి రిపోర్ట్ చేయడం మర్చిపోవద్దు. ఒక సింగిల్ స్టెప్ ద్వారా యూజర్ రిపోర్ట్ చేయచ్చు.
- ఏ కాలర్ కూడా మనల్ని డబ్బు కట్టమని అడగరు.



ప్రతీకాత్మక చిత్రం

మోసపోతే..

- 1930కి కాల్ చేయాలి.
- హెల్ప్‌లైన్ వాళ్లు మోసపోయిన ఆధారాల డాక్యుమెంట్స్ ఇవ్వమంటారు.
- మోసగాళ్లు మల్టిపుల్ అకౌంట్స్‌ను ఉపయోగిస్తుంటారు. మన ద్వారా వాటికి డబ్బు ట్రాన్స్‌ఫర్ చేయిస్తారు. వాటి ఆధారంగా ఆయా రోజుల్లో మన ఖాతాలో నుంచి ఎవరెవరికి డబ్బులు వెళ్లాయో, మన ఖాతాకు ఎవరి ద్వారా డబ్బు వచ్చిందో చూసి ఆ అకౌంట్స్ అన్నింటినీ ఫ్రీజ్ చేస్తారు. అప్పుడు కేస్ ఫైల్ చేసి, ఇన్వెస్టిగేషన్ చేస్తారు. పూర్తి ఇన్వెస్టిగేషన్ చేసి, మన డబ్బులు మనకు వచ్చేలా చేస్తారు.

ఇలాంటప్పుడు గ్రూప్‌లో నుంచి ఎగ్జిట్ అవడం లేదా హ్యాంగప్ చేయాలి.

- ఏం చేస్తారో చూద్దాం అనుకొని గ్రూప్‌లో కొందరు ఎగ్జిట్ అవక అలాగే ఉండిపోతారు. అలాంటివాళ్లే ఎక్కువ ఇన్వెస్ట్ చేసి మోసపోతారు. గ్రూప్‌లో అలాగే ఉండి మిగతా మెంబర్లు 'మాకు డబ్బులు వచ్చాయి' అని షేర్ చేసే, స్క్రీన్ షాట్‌లకు పడిపోవద్దు.



ఇన్‌పుట్స్: **అనీల్ రాచమల్ల,**
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్

రూట్స్

హలో... నేను ఆర్‌జే కేరాబాయిని



పొలం పనుల్లో కేరాబాయి

కరువు ప్రభావంతో మహారాష్ట్రలోని మహాస్వాద్ గ్రామంలో ప్రజలు వలస బాట పట్టారు. అయితే కేరాబాయి మాత్రం ఊరు విడవలేదు. తన దగ్గర ఉన్న బంగారాన్ని కుదవబెట్టి కుటుంబాన్ని, పశువులను రక్షించుకుంది. అయితే ఆమె దగ్గర ఉన్న అసలుసిసలు బంగారం జానపదం.

72 సంవత్సరాల కేరాబాయి ఫేమస్ రేడియో జాకీగా పేరు తెచ్చుకుంది. ఆమె జీవితంపై 'వాటర్ ఫర్ గోల్డ్'అనే డాక్యుమెంటరీ వచ్చింది.

కేరాబాయికి పాటతో విడదీయలేని బంధం. తల్లి పాడే పాట వింటూనే నిద్రపోయేది. తల్లి పాట వింటూనే మేల్కొనేది. పొలం పనుల్లో పాటను తన వెంట తెచ్చుకునేది. చిన్న వయసులోనే తన కంటే వయసు చాలా ఎక్కువగా ఉన్న వ్యక్తితో వివాహం అయింది. భర్త తనను తరచుగా హింసించేవాడు. కడుపు నిండా అన్నం తినని రోజులు ఎన్నో ఉన్నాయి.

భర్త పెట్టే హింసను తట్టుకోలేక ఏడ్చినప్పుడు... తన కన్నీటిని తుడిచింది పాట.

ఆకలితో నిద్రలేని రాత్రులు గడుపుతున్నప్పుడు... తనకు ఓదార్పు ఇచ్చింది పాట.

ఒకరోజు...

మన్‌దేశీ అనే కమ్యూనిటీ రేడియో కార్యక్రమం విన్నది కేరాబాయి. ఆ సమయంలో తనకు కూడా పాడాలనిపించింది. ఆ రేడియో స్టేషన్ కార్యాలయాన్ని వెదుక్కుంటూ వెళ్లింది. సిబ్బందికి తన పాటలు వినిపించింది. వారికి ఆ పాటలు తెగ నచ్చేశాయి. అలా రేడియోలో పాడే అవకాశం వచ్చింది.

వారానికి నాలుగు రోజులు పాడిన సందర్భాలతో పాటు రోజూ పాడిన సందర్భాలు



ఎన్నో ఉన్నాయి. ఒకప్పుడు తన ఇంటికి, పొలానికే పరిమితమైన ఆమె పాట 'మన్ దేశీ' రేడియో వల్ల ఊరూరూ చేరింది. కేరాబాయికి ఎంతో మంది అభిమానులు ఏర్పడ్డారు.

మొదట్లో భజనలు, జానపదాలకే పరిమితమైన కేరాబాయి ఆ తరువాత పర్యావరణం నుంచి సామాజిక స్పృహ వరకు ఎన్నో విషయాలపై దృష్టి పెట్టింది. ఆమె పాటలు నిరాశతో దిక్కుతోచని

వాటర్ ఫర్ గోల్డ్

యూఎస్ ఇంటర్నేషనల్ బ్రాడ్‌కాస్టర్ వాయిస్ ఆఫ్ అమెరికా (వివోఎస్) తన వీక్లీ డాక్యుమెంటరీ సిరీస్ '52 డాక్యుమెంటరీ' కోసం కేరాబాయి జీవితాన్ని కళ్లకు కట్టే 'వాటర్ ఫర్ గోల్డ్' అనే డాక్యుమెంటరీని తీసుకువచ్చింది. ఈ డాక్యుమెంటరీలో: ఇంటిపనులు చేస్తున్న, పొలం పనులు చేస్తున్న ఎర్రటి ఎండలో పశుగ్రాసం మోసుకువెళుతున్న, అందంగా నుదుటికి తిలకం దిద్దుకుంటున్న కేరాబాయి కనిపిస్తుంది. సీన్ కట్ చేస్తే... అందమైన రేడియో స్టేషన్‌లో మైక్ ముందు కనిపిస్తుంది. 'నమస్కారం, నేను ఆర్‌జే కేరాబాయిని మాట్లాడుతున్నాను. నేనొక రైతుని. మీ కోసం ఒక పాట పాడుతాను' అని గొంతు సవరిస్తుంది.

'మేఘాల్లారా రేపు మా ఊరికి రావడం మరవద్దు. మీతో పాటు వానమ్మను తీసుకురావడం అసలే మరవద్దు' అంటూ ఊరూరూ ప్రతిధ్వనించేలా, పరవశించేలా పాట అందుకుంటుంది కేరాబాయి.

రైతులకు ధైర్యాన్ని ఇచ్చాయి. రేడియో జాకీగా కేరాబాయి పొందిన గుర్తింపు అమితాబ్ బచ్చన్ పాపులర్ టెలివిజన్ ప్రోగ్రాం 'కౌన్ బనేగా కరోడ్‌పతి' వరకు తీసుకువెళ్లింది. ఆమె గురించి పరిచయ వాక్యాలు ఇలా ఉంటాయి...

'మామూలుగా రేడియో జాకీ అనగానే స్టైలీష్‌గా... ఇంగ్లీష్ ధారళంగా మాట్లాడే రూపం కనుల ముందు ప్రత్యక్షమౌతుంది. కేరాబాయి వారికి భిన్నంగా కనిపించవచ్చు. ఆమె అందరిలాగా బడిలో చదువుకోకపోవచ్చుగానీ ఈ ప్రపంచమే ఆమె పెద్ద బడి. ప్రకృతి నుంచి అనుభవాల నుంచి ఎన్నో పాఠాలు నేర్చుకుంది. పేదరికం నేపథ్యం నుంచి వచ్చిన కేరాబాయి ఆత్మవిశ్వాసం అనే అపురూపశక్తితో ముందుకు వెళ్లి విజయాన్ని సాధించింది'

వందల మంది ప్రేక్షకుల మధ్య పాడుతున్నప్పుడు, మీడియా ఇంటర్వ్యూలలో తల్లికి తోడుగా ఉంటాడు సంతోష్ సర్గర్. 'ఆమె కొడుకుగా పుట్టినందుకు గర్విస్తున్నాను. అమ్మ పాట వింటూనే పెరిగాను. ఆమెకు పాటలే ప్రపంచం. పాటలే బలం. పాటలే పండగ' అంటున్నాడు గ్రామసేవక్‌గా పనిచేసే సంతోష్.

పాటలు పాడడమే కాదు అశువుగా కవిత్వం కూడా చెబుతుంది కేరాబాయి.

మచ్చుకు ఒకటి...

'నా దగ్గర సంపద లేదని ఎవరన్నారు?
నేను మహా సంపన్నురాలిని.
మా ఇంట్లోకి రోజూ సూర్యకాంతి వస్తుంది.
ఇంతకు మించిన సంపద ఉంటుందా?
రాత్రులలో మా ఇంటి పెరట్లో ఎటూచూసినా వెన్నెల కాంతి పొంగి పొర్లుతుంది.
ఇంతకుమించిన సంపద ఉంటుందా!'

కేరాబాయి హృదయం కథానిలయం కూడా. అక్కడ ఎన్నో నిజజీవిత కథలు ఉంటాయి. సందర్భాన్ని బట్టి వాటి గురించి ఆసక్తిగా చెబుతుంది.

'నేను పాడిన పాటలను పుస్తకంగా... సీడీలుగా తీసుకురావాలని ఉంది. దీంతోపాటు ఈతరానికి ఆనాటి విలువైన పాటలు నేర్పిస్తాను' అంటుంది 72 సంవత్సరాల కేరాబాయి.

కరెంట్ టాపిక్

కుటుంబాన్ని కాపాడుకోలేమా?

అపనమ్మకం, ఆర్థిక కష్టాలు.. వ్యసనాలు, పొసగని అంచనాలు కమ్యూనికేషన్ గ్యాప్, అవాంఛిత సంబంధాలు... భార్యాభర్తల మధ్య తగాదాలకు కారణాలై పెను పరిణామాలకు దారి తీస్తున్నాయి. భార్య మీద కోపం, భర్త మీద అసహనం పిల్లల మీద, పరస్పరం పగ తీర్చుకునేలా చేస్తున్నాయి. క్షణికోద్రేకం జీవితాలను నాశనం చేస్తున్నది. కుటుంబాన్ని కాపాడుకోలేమా? కనీసం తక్కువ నష్టంతో సమస్యలను సరిచేసుకోలేమా? ఇవాళ నివురుగప్పిన నిప్పులా ఉన్న అన్ని కుటుంబాలు వేసుకోవాల్సిన ప్రశ్నలు ఇవి.



సులభంగా బతకడం అత్యంత జటిలం అవుతున్న కాలం ఇది. భార్య, భర్త, ఇద్దరు పిల్లలు కలిసి బతకడం ఎందుకు జటిలం అవుతుంది? భార్య గృహిణిగా లేదా ఉద్యోగిగా ఉండొచ్చు. భర్త ఏదో ఒక సంపాదనపరుడై ఉండొచ్చు. పిల్లలు చదువుకుంటూ ఉండొచ్చు. ఇల్లు గడవడానికి, పిల్లల్ని చదివించడానికి, అవసరాలకు తగిన సంపాదన ఉంటే సులభంగా, సంతోషంగా జీవించడం సాధ్యం అవుతుందా? ఎందుకు అశాంతి వస్తున్నది. భార్య లేదా భర్త ఎందుకు తీవ్రమైన నిర్ణయాలను తీసుకుంటున్నారు? ఎందుకు క్షణికోద్రేకంలో పిచ్చి పనులు చేస్తున్నారు. ఎందుకు ఏదైనా తీవ్ర చర్య చూపితే తప్ప భార్యకో, భర్తకో బుద్ధిరాదని అనుకుంటున్నారు. వారి మనసుల్లో ఇంత కల్లోలం రేగుతుంటే రక్త సంబంధీకులు, స్నేహితులు, ఇరుగు పొరుగు అను సమాజం ఏం చేస్తోంది? ఇదంతా ఏమిటి? ఇంత రుగ్మతలోకి కుటుంబాలు వెళుతుంటే సమాజం కూడా రుగ్మతలోకి వెళుతున్నట్టేనని ఎందుకు అందరం జాగృతం కావడం లేదు. ఇవి ప్రతి ఒక్కరూ వేసుకోవాల్సిన ప్రశ్న.

సహనా వవతు

మన సంస్కృతిలో 'సహనా వవతు' అనే భావన అవసరం పెద్దలు ఎప్పుడో చెప్పారు. 'కలిసి ముందుకు సాగడం' దీని అర్థం. పెళ్లి చేసుకోవాలనుకుంటున్న వధువు లేదా వరుడు రేపు ఏర్పరచుకోబోయే కుటుంబానికి సంబంధించి ముఖ్యంగా వంటబట్టించుకోవాల్సిన సూత్రం ఈ సహనా వవతు. ఇంతవరకూ నేను ఒక్కడిని ఇకపై కలిసి జీవించాలి అని అర్థం చేసుకుంటే, కలిసి జీవించడం అంటేనే సర్దుబాటు అనుకుంటే చాలా సమస్యలు రావు. భార్య/భర్త పూర్తిగా నచ్చేలా లేకపోయినా, పిల్లల ప్రవర్తన పూర్తిగా లోబడి ఉండకపోయినా, ఇంట్లో రకరకాల అభిప్రాయ భేదాలు వస్తూ ఉన్నా అవన్నీ సర్దుబాటు చేసుకునేలా కుటుంబ సభ్యుల మధ్య అవగాహన ఉండాలి. తెగేదాకా లాగని మనస్తత్వం పాదు చేసుకోవాలి. లేకపోతే అశాంతి... ఆందోళన.

ఏడు కారణాలు

భార్యాభర్తల మధ్య గొడవలకు, ఘర్షణకు, వాగ్వివాదాలకు ప్రధానంగా 7 కారణాలు కనిపిస్తాయి.

1 మానసిక దూరం: భార్యాభర్తల మధ్య మానసిక దూరం పెరిగిపోతే ఒక చూరు కింద వారు ఎన్నేళ్లు జీవించినా వారు సన్నిహితులు కారు. నిజమైన సంతోషం పొందలేరు. తమ మధ్య మానసిక దూరం పెరిగిందని భార్యాభర్తలకు తెలిసినా దానిని నివారించడానికి ప్రయత్నించరు. ఫలితం.. ఏదో ఒక పెను ఘటన.

2 పెంపకం కొట్లాట: పిల్లల విషయంలో నిరంతర తగువు. ఒకరు వెనకేసుకు రావడం ఒకరు కఠినం గా ఉండటం... చదువు, స్కూళ్ల విషయం లో రభస... తిండి గురించి మరో తగవు... మార్కులు, హోమ్ వర్క్‌లు... కొద్దిసేపు కూచుని ఓర్పుగా మాట్లాడుకుంటే ఎవరైనా ఎక్స్‌పర్ట్ సలహాకు తల వొగ్గితే ఈ సమస్య ఉండదు. కాని వినరు.

3 కమ్యూనికేషన్ లోపం: ఏదీ చెప్పరు. చెప్పుకోరు. చెప్పాలని గుర్తించరు. అతని ఖర్చు ఆమెకు తెలియదు. ఆమె కొనుక్కోవాలనుకుంటున్న వస్తువు ను అతను కొనివ్వడు. బంధువులు, స్నేహితులు వారి రాకపోకల గురించి, వాళ్ల ఇళ్లకు వెళ్లడం గురించి మాట్లాడుకోరు. వీలు కాదు, వీలవుతుంది, వెళ్లాలి, వెళ్లక్కర్లేదు.. ఇవి ఉమ్మడి అంగీకారంతో జరగాల్సిన నిర్ణయాలు. అలా లేనప్పుడే ఆగ్రహం, పంతం.

4 ఫుల్‌స్టాప్ లేని వాదనలు: ఒకరు వాదిస్తుంటే మరొకరు తగ్గడం జరిగితే ప్రమాదం ఉండదని ఇరువురికీ తెలుసు. కాని వాదనలు పెంచుకుంటూ పోతారు. పాత గొడవలు తవ్వుతారు. పై చేయి సాధించడానికి చెత్త మాటలు, అబద్ధాలు, అభాండాలు వేసి గాయపరుస్తారు. ఒకరినొకరు అవమానించుకుంటారు.

5 ఆర్థిక సమస్యలు: పెళ్లి సమయంలోనే ఇరువురి ఆర్థిక స్థితి తెలుసుకాబట్టి ఆ గ్రాఫ్ చేరుకునే బిందువును అంచనా కట్టుకుని జీవితాన్ని మొదలెట్టాలి. మనం సామాన్య ఉద్యోగులం అయినా పెద్ద ఉద్యోగాలు చేసే జంటతో పోల్చుకుంటే ఆ ఇమిటేషన్‌తో అప్పుసప్పులు చేస్తే ఇ.ఎం.ఐలలో ఇరుక్కుపోతే ఆర్థిక సమస్య లు వస్తాయి. డబ్బు విషయంలో ప్రతి పైసా ఇద్దరి అవగాహనలోనే వచ్చినా, ఖర్చు అయినా మంచి ఫలితాలు ఉంటాయి. భార్యాభర్తల్లో ఎవరికి ఆర్థిక క్రమశిక్షణ లేకపోయినా సమస్యలు పెరుగుతాయి. ఇది మరీ రిపేరు చేసుకోలేని సమస్య మాత్రం కాదు.

6 ఆరోగ్య సమస్యలు: బిజీ లైఫ్ వల్ల ఆరోగ్య సమస్యలు సర్వసాధారణం అయ్యాయి. భర్త ఆరోగ్యం గురించి భార్య శ్రద్ధ పెట్టకపోయినా, భార్య ఆరోగ్యాన్ని భర్త పట్టించుకోకపోయినా లోలోపల ఆ కోపం ఉంటుంది. ఒకవేళ ఇరువురిలో ఒకరికి అనారోగ్యం వస్తే దాని మిషగా హర్ట్ చేసుకోవడం సూటిపోటి మాటలనడం ఇంకా ప్రమాదం. అనారోగ్యకాలంలో భార్యాభర్తల మధ్య బంధం చాలా గట్టిగా ఉండాలి. అప్పుడే ఆరోగ్యవంతులు అవుతారు. కుటుంబ ఆరోగ్యం కూడా కాపాడబడుతుంది.

7 అవాంఛిత స్నేహాలు: చేతిలో ఫోను... ఎవరెవరితోనో స్నేహాలు... భార్యకు తెలియకుండా భర్త, భర్తకు తెలియకుండా భార్య చేసే స్నేహాలు (లైంగికమే కానక్కర్లేదు) కాపురానికి ప్రమాదంగా మారుతాయి. అవి మానేయమని భర్త/భార్య కోరితే మానేయడమే మంచిది. కుటుంబం కంటే ఆ స్నేహం ముఖ్యం కాదు.

ఇవాళ న్యూస్‌పేపర్లలో వస్తున్న చాలా వార్తలు కుటుంబ జీవనంలో చోటు చేసుకుంటున్న పెను విషాదాలను చూపుతున్నాయి. కుటుంబం అందమైనది. అందరికీ అవసరమైనది. చాలా జాగ్రత్తగా కుటుంబాన్ని నిర్వహించాలి. ఆ సంగతి అందరూ అర్థం చేసుకోవాలి.


'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 | వెల: ₹ 5.50 | సంపుటి: 16 | సంచిక: 56

గురువారం 18-5-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఢిల్లీ గెలిచెన్...

15 పరుగుల తేడాతో ఓడిపోయిన పంజాబ్ కింగ్స్ జట్టు. -10లో



అట్టహాసంగా 'కాన్స్'

తొలిరోజు రెడ్ కార్పెట్‌పై మెరిసిన ఇండియన్ తారలు -10లో



27 సార్లు ఎవరెస్ట్ ఎక్కాడు

27వసారి ఎవరెస్ట్‌ను అధిరోహించిన 53 ఏళ్ల కమీ రీటా తన గత రికార్డును తానే చెరిపేసి కొత్త రికార్డు సృష్టించారు.


వివరాలు 6లో ▸



చైనా నౌక మునక

39 మందితో చేపల వేటకు బయలుదేరిన చైనా నౌక హిందూ మహాసముద్రంలో మునిగి పోయిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

వివరాలు 6లో ▸



బైడెన్ గైర్హాజరుతో 'క్వాడ్' రద్దు

తాను సదస్సుకు రాలేనని బైడెన్ తేల్చి చెప్పడంతో 24న ఆస్ట్రేలియాలో జరగాల్సిన క్వాడ్ చతుర్భుజ కూటమి సదస్సు రద్దయింది.

వివరాలు 6లో ▸



అత్యంత సంపన్నులు తగ్గారు

భారత్‌లో 30 మిలియన్ డాలర్ల పైన నెట్‌వర్త్ ఉన్న వ్యక్తుల సంఖ్య గత ఏడాది 7.5శాతం తగ్గినట్లు నైట్ ఫ్రాంక్ నివేదిక పేర్కొంది.

వివరాలు 11లో ▸


బుధవారం న్యూయార్క్‌లో అలెగ్జాండ్రా కార్టర్‌తో భేటీ అయిన కేటీఆర్

హైదరాబాద్‌కు వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ

- ఐడీసీ ఏర్పాటుకు ముందుకొచ్చిన ప్రఖ్యాత సంస్థ
- 1,200 మంది నిపుణులకు లభించనున్న ఉద్యోగావకాశాలు
- సంస్థ సీనియర్ ఉపాధ్యక్షురాలితో న్యూయార్క్‌లో కేటీఆర్ చర్చలు

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ ప్రఖ్యాత మీడియా, ఎంటర్‌టైన్మెంట్ సంస్థ వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ హైదరాబాద్ నగరంలో తన కార్యకలాపాలను ప్రారంభించబోతోంది. నగరంలో ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ సెంటర్(ఐడీసీ)ని ఏర్పాటు చేయనుంది. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు బుధవారం న్యూయార్క్‌లో వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ సంస్థను సందర్శించి సంస్థ ఫైనాన్స్ విభాగం సీనియర్ ఉపాధ్యక్షురాలు అలెగ్జాండ్రా కార్టర్‌తో సమావేశమయ్యారు. మీడియా, ఎంటర్‌టైన్మెంట్ రంగాభివృద్ధి, ఆవిష్కరణల విషయంలో ఇరువర్గాలు ఒకే విధమైన ఆశయాలను కలిగి ఉన్నట్టు ఈ చర్చల సందర్భంగా అభిప్రాయానికి వచ్చారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో ఈ రంగాల

మిగతా 2వ పేజీలో ▶

ఇది పేదల విజయం

అమరావతిలో ఇళ్ల స్థలాలిచ్చేందుకు అభ్యంతరం లేదు

సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

- ఫలించని టీడీపీ కుట్రలు, కుతంత్రాలు.. పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీలో జోక్యానికి తిరస్కరణ
- పట్టాలు ఇవ్వకుండా ప్రభుత్వాన్ని నిరోధించేందుకు విముఖత.. అక్కడ ఇళ్ల పట్టాలిచ్చేందుకు ఏపీ ప్రభుత్వానికి హక్కు ఉందని స్పష్టీకరణ



పేదలు మరింత నిరుపేదలుగా మారాలి.. పెత్తందార్లకు జీ హుజూర్ అంటూ బతకాలి.. పేదల పిల్లలు పెద్ద పెద్ద చదువులు చదవరాదు.. ఇంగ్లిష్ చదువులు అసలే చదవకూడదు.. కనీసం వారికి నిలువ నీడ కూడా లేకుండా ఉంటేనే తమ ఆటలు సాగుతాయన్నది చంద్రబాబు అండ్ కో మానసిక పరిస్థితి. అమరావతి ప్రాంతంలో వారికి ప్రభుత్వం సెంటు భూమి ఇస్తామంటే ఇదే పచ్చ గ్యాంగ్, ఎల్లో మీడియాతో కలిసి గగ్గోలు పెట్టింది. బాబు 3డి గ్రాఫిక్స్ రాజధానిలోని సింగపూర్, మలేసియా, జపాన్‌లు మురికి కూపాలై పోతాయని ఆందోళనలు, చర్చోపచర్చలతో ప్రజల్లో విష బీజాలు నింపడానికి విఫలయత్నం చేసింది. నిస్సిగ్గుగా కోర్టులకూ ఎక్కింది. 'రాజధాని అయినంత మాత్రాన అక్కడ పేదలు ఉండకూడదంటే ఎలా?' అని హైకోర్టు తలంటినప్పటికీ ఈ పచ్చ గ్యాంగ్‌కు బుద్ధి రాలేదు. రైతుల పేరుతో సుప్రీంకోర్టులోనూ వంకర బుద్ధి చూపించబోయింది. 'పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం ఏ విధంగా అన్యాయం? రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పు పట్టలేం' అని ఇప్పుడు సుప్రీం కూడా గడ్డి పెట్టింది. అయినా వీళ్లలో మార్పు వస్తుందని ఆశించలేం. ఈ పెత్తందార్ల యుద్ధాన్ని ఎదిరిస్తూ.. వారి కుట్రలను తిప్పికొడుతూ సీఎం వైఎస్ జగన్ గట్టిగా నిలవడం వల్లే పేదలకు న్యాయం జరిగింది. ఇది పేదల కోసం నిలబడ్డ ప్రభుత్వ ఘన విజయం. -3లో

న్యూస్‌రీల్

మీ అక్కగా.. అండగా ఉంటా



'రాజ్‌భవన్ ద్వారాలు ప్రతి ఒక్కరి కోసం తెరిచే ఉంటాయి, ఎప్పుడైనా హైదరాబాద్ వస్తే రాజ్‌భవన్‌ను సందర్శించండి. అక్కడ ఈ అక్క మీకు అండగా ఉంటుంది' అని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. భద్రాచలం, ఖమ్మం రూరల్ మండలంలో ఆదివాసీలు, విద్యార్థులతో సమావేశమయ్యారు.

- వివరాలు 12లో▶

మొగిలయ్య దంపతులకు 'దళితబంధు' కారు



రాష్ట్రంలోని దళితుల కోసం కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన దళితబంధు పథకం కింద బలగం ఫేమ్ మొగిలయ్య, కొమురమ్మ దంపతులకు పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కారు అందచేశారు.

- వివరాలు 2లో▶

ఎరువుల ప్రణాళిక ఖరారు...



రాబోయే వానాకాలం సీజన్‌లో 24.60 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను అందుబాటులో ఉంచాలని వ్యవసాయశాఖ ప్రణాళిక ఖరారు చేసింది. రాష్ట్రం పంపిన ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం తెలిపిందని వ్యవసాయ వర్గాలు వెల్లడించాయి.

- వివరాలు 5లో▶

105 సీట్లు మనవే!



నేను చెప్పినట్టు పనిచేస్తే మళ్లీ అధికారంలోకి..

ఏమరుపాటుతో ఉంటే మునుగుతాం: సీఎం కేసీఆర్

- సిట్టింగ్‌లందరికీ టికెట్ ఇవ్వాలన్నదే నా అభిమతం
- మీరు జాగ్రత్తగా ఉండక నష్టం చేసుకుంటే నేనేం చేయలేను
- అందరినీ కలుపుకొని పోవాలి.. చిల్లర మల్లర రాజకీయాలు వద్దు
- ప్రభుత్వం చేసిన పనులను చెప్పుకోలేక ఎమ్మెల్యేలు విఫలం
- మనం చేసిన మేలును ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- బోగస్ గుజరాత్ మోడల్‌తో దేశాన్ని మోదీ మోసం చేశారని ఆరోపణ
- తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు మూడు వారాలపాటు దద్దరిల్లాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్: "రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వస్తున్నామనడంలో ఎవరికీ అనుమానాలు అవసరం లేదు. సర్వేలన్నీ మనకే అనుకూలంగా ఉన్నాయి. కచ్చితంగా 95 నుంచి 105 స్థానాలు గెలవబోతున్నాం. నేను చెప్పినట్టు ఎమ్మెల్యేలు అందరూ పనిచేస్తే.. కచ్చితంగా ప్రతీ ఒక్కరికి 50 వేల కన్నా అధిక మెజారిటీ వస్తుంది.." అని పార్టీ నేతలకు బీఆర్ఎస్ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు చెప్పారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు

మిగతా 2వ పేజీలో ▶

పదేళ్లలోనే.. వందేళ్ల అభివృద్ధి

జూన్ 2 నుంచి 21 వరకు రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు పండుగ వాతావరణంలో జరగాలి. ఈ దశాబ్ది కాలంలో శతాబ్ది కాలంలో చేయాల్సిన అభివృద్ధి పనులను పూర్తి చేశాం. బతుకమ్మ పండుగను తలపించే రీతిలో ఈ ఉత్సవాలను దేదీప్యమానంగా నిర్వహించడంతోపాటు అన్ని అంశాలను ప్రజలకు వివరించాలి. మిషన్ కాకతీయ విజయాన్ని చాటేలా కట్ట మైసమ్మ పండుగలు చేయాలి. రైతు వేదికలను విద్యుత్ దీపాలతో అలంకరించాలి. ఆసరా పింఛన్ల లబ్ధిదారులతో నియోజకవర్గ కేంద్రాల్లో సమావేశాలు ఏర్పాటు చేయాలి. సంప్రదాయ కళాకారులతో ఊరేగింపులు, కవి సమ్మేళనాలు నిర్వహించాలి. వీటికి ఎమ్మెల్యేలు నాయకత్వం వహించాలి. ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, గోరటి వెంకన్నను ఆహ్వానించాలి. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు మూడు వారాలపాటు దద్దరిల్లాలి.

- సీఎం కేసీఆర్


బుధవారం హైదరాబాద్‌లో ఎండ నుంచి చిన్నారిని రక్షించేందుకు ఓ తల్లి తాపత్రయం

ఐదేళ్లూ అగ్గే!

పారిస్ ఒప్పందానికి తూట్లు పడేలా 1.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు దాటే చాన్స్

గ్రీన్‌హౌస్ వాయువులు, ఎల్‌నినో ప్రభావమేనన్న డబ్ల్యూఎంవో

వచ్చే అయిదేళ్ల పాటు ప్రపంచ దేశాల్లో ఎండలు దంచికొడతాయని ఐక్యరాజ్య సమితికి చెందిన ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో) హెచ్చరించింది. పరిమితికి మించి గ్రీన్‌హౌస్ వాయువులు విడుదల, ఎల్‌నినో ప్రభావంతో అయిదేళ్ల పాటు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలున్నాయని తెలిపింది. 2015లో జరిగిన పారిస్ ఒప్పందంలో ప్రపంచ ఉష్ణోగ్రతల పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్‌కు మించకుండా చూడాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, దానిని అధిగమించేలా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా వేసింది.

- వివరాలు 6లో

రూ.21 వేల కోట్లతో సీతారామ-సీతమ్మసాగర్!

- సీడబ్ల్యూసీకి రెండో సవరణ డీపీఆర్ సమర్పణ
- ఉమ్మడి ప్రాజెక్టు విస్తరణలో భాగంగా రూ.2,200 కోట్లతో ఇల్లందు కాల్వ
- కొత్తగా 1.13 లక్షల ఎకరాల ఆయకట్టుకు ప్రతిపాదనలు
- 7.84 లక్షల ఎకరాలకు పెరిగిన ఆయకట్టు

- వివరాలు 12లో▶



ఒకటి.. రెండు.. మూడు!

అరెస్టు

- టీఎస్‌పీఎస్సీ పరీక్షల్లో 'పేపర్లు కొన్న వారికే' స్టేట్ ర్యాంకులు
- డీఏఓ అభ్యర్థుల విశ్లేషణలో గుర్తించిన సిట్ అధికారులు.. మరో నలుగురిని అరెస్టు చేసిన పోలీసులు

సాక్షి, హైదరాబాద్



తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నిర్వహించిన డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ (డీఏఓ) పరీక్షల్లో అత్యధిక మార్కులు పొంది, రాష్ట్ర స్థాయిలో తొలి మూడు ర్యాంకులు సాధించింది 'లీకు వీరులుగా' తేలింది. ఈ పరీక్షల్లో కేసులో కీలక నిందితుడిగా ఉన్న రాజేశ్వర్‌కు మొదటి ర్యాంకు, అతడి భార్య శాంతికి రెండో ర్యాంకు, మరో నిందితురాలు లవద్యావత్ రేణుక స్నేహితుడు రాహుల్ కుమార్‌కు మూడో ర్యాంకు వచ్చాయి. ఈ ముగ్గురూ లీకైన మాస్టర్ ప్రశ్నపత్రం ఆధారంగానే పరీక్షలు రాసినట్లు అధికారులు తేల్చారు. ఇప్పటికే అరెస్టయిన

మిగతా 3వ పేజీలో ▶

కొనసాగుతున్న 'కర్ణాటకం'

పట్టు వీడని సిద్ధూ, డీకే.. తలపట్టుకుంటున్న అధిష్టానం



కర్ణాటక ముఖ్యమంత్రి ఎంపిక వ్యవహారం కాంగ్రెస్ అధిష్టానానికి చుక్కలు చూపుతోంది. మాజీ సీఎం సిద్ధరామయ్య, పీసీసీ చీఫ్ డీకే శివకుమార్ ఎవరి పట్టు మీద వారే ఉండటంతో పీటముడి మరింత బిగుసుకుంటోంది. ఈ విషయమై హస్తినలో సోమ, మంగళవారాల్లో అధిష్టానం చర్చోపచర్చలు జరిపినా ఫలితం లేకపోయింది. నిర్ణయానికి మరో రెండు మూడు రోజులు పట్టవచ్చని కాంగ్రెస్ కర్ణాటక వ్యవహారాల ఇన్‌చార్జి రణ్‌దీప్ సుర్జేవాలా మీడియాకు చెప్పారు.

6లో

తెల్లారిన బతుకులు

- ఏపీలో ఆటోను లారీ ఢీకొని ఆరుగురు కూలీల దుర్మరణం
- 8 మందికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం
- పల్నాడు జిల్లాలో పొందుగల వద్ద రహదారి రక్తసిక్తం
- మృతులంతా తెలంగాణకు చెందిన వారే

కూటికోసం కూలికెళ్తున్న వారి బతుకులు తెల్లవారుజామునే తెల్లారిపోయాయి. సరదాగా మాట్లాడుకుంటూ వ్యవసాయ పనులకు ఆటోలో వెళుతున్న వారి మీదకు మృత్యువు లారీ రూపంలో దూసుకొచ్చింది. ఎవరికీ ఏమీ అర్థంకాలేదు. అర్థమయ్యేసరికే శరీరాల్లోకి దూసుకెళ్లిన ఇనుప చువ్వలు.. చెల్లాచెదురుగా మృతదేహాలు. రహదారి రక్తసిక్తమైంది.

- వివరాలు 5లో▶


ఎందుకైనా మంచిది.. సీఎం అభ్యర్థిని ఇప్పుడే ఎన్నుకుందాం సార్!

మంచు కొండల్లో.. మహాన్నదానం..

కేదార్‌నాథ్ యాత్రికులకోసం ప్రత్యేక లంగర్ ఏర్పాటు చేసిన సిద్దిపేట వాసులు

- రోజుకు 4 వేల మందికి అన్నదానం
- ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రికి భోజనం
- జూన్ 6వ తేదీవరకు కొనసాగనున్న కార్యక్రమం

సాక్షి, సిద్దిపేట: ప్రసిద్ధ తీర్థయాత్రల్లో అత్యంత సాహస యాత్ర... కేదార్‌నాథ్ యాత్ర. మంచుకొండల్లో ఓ వైపు నది...మరో వైపు లోయ. అడుగు తీసి అడుగు వేయాలంటేనే ఇబ్బందికర పరిస్థితి. ఆ సన్నటి మార్గంలో 16 కిలోమీటర్లు వెళ్లి భక్తులు కేదారేశ్వరుడిని దర్శించుకుంటారు. తీవ్రమైన చలిలో సాగే ఈ యాత్రలో భక్తులకు ఆహారం దొరకడం అంత సులభం కాదు. అయితే దక్షిణాది రాష్ట్రాలకు చెందిన భక్తులు ఆహారం దొరకక ఇబ్బందులు పడటాన్ని గమనించారు సిద్దిపేట జిల్లాకు చెందిన కొందరు వ్యక్తులు. కేదార్‌నాథ్ అన్నదాన సేవా సమితి పేరుతో భక్తులకు మంచుకొండల్లో ఘుమఘుమలాడే తెలుగువారి భోజనం, టిఫిన్ అందిస్తున్నారు.

2019లో ప్రారంభమైన అన్నదానం..

2015 సంవత్సరంలో సిద్దిపేటకు చెందిన భక్తులు కేదార్‌నాథ్ యాత్రకు వెళ్లారు. అక్కడ తెలుగు భోజనం లభించక వారు చాలా ఇబ్బంది పడ్డారు. యాత్ర చేయాలంటే శక్తి అవసరం. అయితే డబ్బులు పెట్టినా సరైన ఆహారం లభించని పరిస్థితి. దీంతో వారు పడ్డ ఇబ్బందులు మిగతా భక్తులు పడకూడదన్న ఉద్దేశంతో సిద్దిపేటకు చెందిన చీకోటి మధుసూదన్ మిత్ర బృందం కలిసి ఒక నిర్ణయానికి వచ్చి గొప్పకార్యానికి నడుం బిగించారు. 31 మంది సభ్యులతో కేదార్‌నాథ్ సేవా సమితిని ఏర్పాటు చేసి 2019లో దక్షిణ భారతదేశంలోనే తొలి తెలుగు లంగర్ (ఉచిత అన్నదాన శిబిరం)ను ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని సోన్‌ప్రయాగ్ షెటర్‌పూల్ (ఇనుప వంతెన పక్కన) గౌరి గుండ్ జీపు స్టాండ్ దగ్గర ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సేవా సమితిలో 77 మంది సభ్యులు ఉన్నారు.

కోటి విలువచేసే నిత్యావసర సరుకులతో...

కేదార్‌నాథ్ సేవా సమితి సభ్యులు, స్థానిక దాతలు, రాష్ట్ర ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు సహకారంతో మూడోసారి అన్నదానం కోసం ఏప్రిల్ 16వ తేదీన సుమారుగా రూ. కోటి విలువ చేసే నిత్యావసర సరుకులతో సిద్దిపేట నుంచి బయలుదేరారు. 15 మంది వంట మనుషులు, ఇతర ప్రాంతానికి చెందిన 60 మంది కూలీలతో కేదార్‌నాథ్‌కు చేరుకున్నారు. ఏప్రిల్ 23 నుంచి అన్నదానం ప్రారంభించారు. జూన్ 6వ తేదీవరకు

మిగతా 3వ పేజీలో ▶




చీకోటి మధుసూదన్, అధ్యక్షుడు, కేదార్‌నాథ్ సేవా సమితి

దైవ సంకల్పంతోనే అన్నదానం

దైవ సంకల్పంతోనే కేదార్‌నాథ్‌లో ఉచితంగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నాం. యాత్రకు వచ్చే భక్తులు భోజనం విషయంలో ఎలాంటి ఇబ్బందులు పడొద్దన్న ఉద్దేశంతో లంగర్ ఏర్పాటు చేశాం. దక్షిణ భారతదేశానికి చెందిన తొలి లంగర్ సిద్దిపేటకు చెందినదే. మంత్రి హరీశ్‌రావు సహకారంతో, కమిటీ సభ్యుల సహకారంతో భక్తులకు పుష్టికరమైన భోజనం అందిస్తున్నాం.

క్లుప్తంగా...

దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు సీఎస్ నేతృత్వంలో కమిటీ

సాక్షి, హైదరాబాద్: వచ్చే నెల 2 నుంచి 21 రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నేతృత్వంలో ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీలో ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ప్రణాళిక, పురపాలక శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి, జీఏడీ, ఆర్థిక శాఖల కార్యదర్శులు, సమాచార, పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్, ఐఏఎస్ అధికారి ముషరఫ్ అలీ ఫారూఖీ, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఉన్నారు.

బీఆర్ఎస్ అవినీతిపై 21 చార్జిషీట్లు వేస్తాం



సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ సర్కార్ తొమ్మిదేళ్ల పాలన పూర్తి చేసుకుంటున్న సందర్భంగా 21 రోజుల పాటు బీఆర్ఎస్ అవినీతిపై చార్జిషీట్లు విడుదల చేస్తామని బీజేపీ ఉపాధ్యక్షుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ప్రకటించారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించే నైతిక హక్కు బీఆర్ఎస్ ప్రభుత్వానికి లేదన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు పోయి.. లిక్కర్ అమ్మకాలు, అప్పులు, లీకుల్లో తెలంగాణను మొదటి స్థానంలో నిలిపారని మండిపడ్డారు.

సికింద్రాబాద్-తిరుపతి మధ్య 16 కోచ్‌ల వందే భారత్

సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్-తిరుపతి మధ్య వందేభారత్ కోచ్‌ల సంఖ్యను 8 నుంచి 16కు పెంచిన తర్వాత సేవలు మొదలయ్యాయి. బుధవారం తొలి ట్రిప్పు ప్రారంభమైంది. ఎనిమిది కోచ్‌లతో ఉన్నప్పుడు కిటకిటలాడినట్టుగానే, కోచ్‌ల సంఖ్యను రెట్టింపు చేసిన తర్వాత కూడా అదే రద్దీ కొనసాగింది. తొలి సర్వీసు 109 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో నడవటం విశేషం. 530గా ఉన్న సీట్ల సంఖ్య 1128కు పెరిగింది. ఎగ్జిక్యూటివ్ క్లాస్‌లో 104, ఎకానమీ క్లాస్‌లో 1024 సీట్లు ఉన్నాయి. మరోవైపు మంగళవారం వరకు రైలు ప్రయాణ సమయం 8.30 గంటలు కాగా, బుధవారం నుంచి 8.15 గంటలకు మార్చారు. దీంతో గతంలో కంటే పావుగంట తక్కువ సమయంలోనే గమ్యం చేరుతుంది.

ప్రభుత్వ, అసైన్డ్ భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలి

వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల డిమాండ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని ప్రభుత్వ, అసైన్డ్ భూములపై శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. కేసీఆర్‌కు అధికారమిస్తే రాష్ట్రాన్ని అమ్మకానికి పెడుతున్నారని ఆరోపించారు. గతంలో బలవంతంగా భూములు గుంజుకుంటే.. ఇప్పుడు జీవోలతో భూముల మ్మేసి సొమ్ము చేసుకుంటున్నారని అన్నారు. రైతులకు ఇచ్చిన అసైన్డ్ భూములను, పరిశ్రమలకు ఇచ్చిన భూములను సైతం వదలడం లేదని, భవిష్యత్ అవసరాలకు భూములే లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. కాగా, బీఆర్ఎస్‌ను బందిపోట్ల రాష్ట్ర సమితిగా అభివర్ణిస్తూ షర్మిల చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో జూబ్లీహిల్స్ వెంకటగిరికి చెందిన నరేందర్ యాదవ్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు షర్మిలపై ఐపీసీ సెక్షన్ 505(2), 504 కింద కేసు నమోదు చేశారు.

ఆంధ్ర నేతకు ప్రభుత్వ భూములు: ప్రవీణ్



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ నిబంధనలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ బీఆర్ఎస్ నేతకు మియాపూర్ ప్రభుత్వ భూములను అమ్ముకున్నారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. 111 జీవోను ఎత్తివేసి హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న వేల ఎకరాల భూములను బినామీ సంస్థలకు అప్పజెప్పారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురుకుల జేఎల్ ఉద్యోగ నియామకాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి బుధవారం చివరి తేదీ అని.. చాలామంది అభ్యర్థులు దరఖాస్తు రుసుము చెల్లించినా.. సాంకేతిక కారణాల వల్ల సైట్ ఓపెన్ కాకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు.

విచారణకు ప్రశాంత్

హిమాయత్‌నగర్ (హైదరాబాద్): టీపీసీసీ మాజీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డిపై జరుగుతున్న దుష్ప్రచారం కేసులో యూత్ కాంగ్రెస్ నేత, వార్ రూమ్ ఇన్‌చార్జి ప్రశాంత్ బుధవారం సిటీ సైబర్‌క్రైం పోలీసుల ఎదుట హాజరయ్యారు. ఇప్పటికే దీనిపై ముగ్గురికి నోటీసులు ఇవ్వగా.. విచారణ కోసం ప్రశాంత్ సైబర్‌క్రైం ఏసీపీ ప్రసాద్ ఎదుట హాజరయ్యారు. కాంగ్రెస్‌లోనే ఉంటూ ఉత్తమ్ పై దుష్ప్రచారం చేయాల్సిన అవసరమేంటి అని పోలీసులు ప్రశ్నించినట్లు తెలిసింది. ఈనెల 22న ప్రశాంత్‌తో పాటు అతని వద్ద పనిచేసే మరో ముగ్గురిని కూడా విచారణకు రావాల్సిందిగా నోటీసులు ఇచ్చినట్లు ఏసీపీ తెలిపారు.

అదో పట్టణం.. అందమైన ఇళ్లు, భూగర్భ గృహాలతో కళకళలాడింది.

అదో వ్యాపార కేంద్రం.. అత్తరు తయారు చేసి ప్రపంచవ్యాప్తంగా సరఫరా చేసేది.. అందుకు ప్రత్యేకంగా కయోలిన్ క్లేతో అత్తరు బుడ్లను తయారు చేసేవారు.. ఈ వ్యాపారంలో ప్రముఖ పాత్ర రోమన్ వ్యాపారులదే.

అదో బౌద్ధ కేంద్రం.. స్తూపం, చైత్యం, ఆధ్యాత్మిక మందిరాలు ఎన్నో రూపుదిద్దుకున్నాయి.

ఇదంతా ఎక్కడో కాదు, సంగారెడ్డి పట్టణానికి చేరువగా ఉన్న కొండాపూర్ కేంద్రంగా సాగింది. కానీ అది ఇప్పుడు కాదు, క్రీ.పూ. 2వ శతాబ్దం-క్రీ.శ.2వ శతాబ్దం మధ్య కాలం నాటి సంగతి.

సాక్షి, హైదరాబాద్

➤ శాతవాహనులు పాలించిన ప్రాంతంలో ఇప్పటివరకు జరిపిన తవ్వకాల్లో లభించిన నాణేల్లో సగానికంటే ఎక్కువ లభించింది ఈ కొండాపూర్ ప్రాంతంలోనే. రోమన్ చక్రవర్తి అగస్టస్ హయాంలో చెలామణిలో ఉన్న బంగారు నాణేలూ ఇక్కడ లభించాయి. గౌతమీ పుత్ర శాతకర్ణి.. పులుమావి శాతకర్ణి, యజ్ఞశ్రీ శాతకర్ణి లాంటి వారు అక్కడికి వచ్చి ఉంటారన్నది చరిత్రపరిశోధకుల మాట. ఇప్పుడు పోర్సెలిన్ అనగానే చైనా తయారీ బొమ్మలు గుర్తుకొస్తాయి. కానీ రెండు వేల ఏళ్ల క్రితమే ఇక్కడ ఆ మట్టితో బొమ్మలు రూపొందించారు.



కొండా'పూర్' మ్యూజియం

మరమ్మతు పేరుతో మూడేళ్లుగా మూసిన ఏఎస్ఐ..	అబ్బురపరిచే నాటి ఆధారాలకు నిలయం	దేశంలో అరుదైన కొండాపూర్ మ్యూజియం	నేడు అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం

➤ ఇంత ఘనమైన చరిత్ర ఉన్న కొండాపూర్ ప్రాంతంలో 19వ శతాబ్దం నుంచి జరిపిన తవ్వకాల్లో వెలుగుచూసిన ఎన్నో గొప్ప ఆధారాలను ప్రదర్శనకు ఉంచిన ఓ మ్యూజియం ఉంది. అయితే, అది మూడేళ్లుగా మూతపడి ఉంది. రాష్ట్రంలో కేంద్ర పురావస్తు సర్వేక్షణ సంస్థ (ఏఎస్ఐ) అధీనంలో ఉన్న ఏకైక మ్యూజియం ఇదే కావటం గమనార్హం.





గేటుకు తాళం.. ఇంకెంత కాలం..

▲ కొండాపూర్ మ్యూజియం

ప్రచారం లేకపోవడంతో...

➤ మ్యూజియం భవనం నిర్వహణ బాగానే ఉన్నా, కట్టడ పటుత్వం దెబ్బతినటంతో రూ.2.5 కోట్ల వ్యయంతో కొత్త భవనాన్ని నిర్మించాలని నిర్ణయించారు. కానీ దానికి అనుమతి రాకపోవటంతో, ఉన్నదాన్నే బాగుచేసి, కొత్త గ్యాలరీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కానీ ఇంతలో కోవిడ్ మహమ్మారి విస్తరించటంతో 2020లో దాన్ని మూసేశారు. ఆ తర్వాత మరమ్మతులు మొదలుపెట్టినా ఇప్పటికీ పూర్తి కాలేదు. ఫలితంగా మ్యూజియం మూసే ఉంది. దీంతో విలువైన, సున్నితమైన వస్తువులను చూసే వీలు లేకుండాపోయింది. అంత గొప్ప మ్యూజియం ఉందన్న ప్రచారం లేకపోవటంతో ప్రజలకు దాని గురించే తెలియకుండా పోయింది.

విదేశాల్లో ఉంటే కిటకిటలాడేదేమో..

ముందస్తుగా ఫోన్ చేసి చెప్పి ఇటీవలే ఆ మ్యూజియాన్ని సందర్శించి అబ్బురపడ్డాను. 2 వేల ఏళ్ల క్రితమే మన చరిత్ర ఇంత గొప్పదా అనిపించే స్థాయి ఆధారాలు అక్కడ ఉన్నాయి. కానీ, వాటిని చూసేందుకు జనమే రారని తెలిసి ఎంతో బాధపడ్డాను. ఇంత గొప్ప ఆధారాలతో విదేశాల్లో మ్యూజియం ఉంటే జనంతో కిటకిటలాడేది.

– చిన వీరభద్రుడు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి

త్వరలో పునరుద్ధరిస్తాం

కొండాపూర్ మ్యూజియం మన అద్భుత చరిత్రకు నిదర్శనం. దాని విషయంలో నిర్లక్ష్యం చేయం. కొత్త భవనం అనుకున్నా, ఉన్నదాన్నే బాగుచేద్దామని నిర్ణయించి పనులు జరుపుతున్నాం. త్వరలో మ్యూజియాన్ని పునరుద్ధరిస్తాం.

– మహేశ్వరి, ఏఎస్ఐ రీజినల్ డైరెక్టర్

గవర్నర్ కోటా ఎమ్మెల్సీ చాన్స్ ఎవరికి?

- 27న పదవీ విరమణ చేయనున్న ఎమ్మెల్సీలు రాజేశ్వర్‌రావు, ఫారూఖ్
- పరిశీలనలో ఘంటా చక్రపాణి, పలువురు ప్రముఖుల పేర్లు



ఘంటా చక్రపాణి

సాక్షి, హైదరాబాద్: శాసన మండలిలో రెండు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అవుతుండటంతో.. కొత్తగా ఎవరికి చాన్స్ వస్తుందనే దానిపై బీఆర్ఎస్‌లో చర్చ మొదలైంది. ఈ కోటాలో ఎమ్మెల్సీలుగా ఉన్న డి.రాజేశ్వర్‌రావు, ఫారూఖ్ హుస్సేన్‌ల ఆరేళ్ల పదవీకాలం ఈ నెల 27న పూర్తవుతోంది. ఈ రెండు స్థానాలకు అభ్యర్థుల పేర్లను గురువారం జరిగే కేబినెట్ భేటీలో ఖరారు చేసే అవకాశముంది. పదవీకాలం పూర్తవుతున్న డి.రాజేశ్వర్‌రావు, ఫారూఖ్ హుస్సేన్ ఇద్దరూ మైనారిటీ వర్గాలకు చెందినవారే కావడంతో మరోమారు పదవులను ఆశిస్తున్నారు. క్రిస్టియన్ కోటాలో రాజేశ్వర్, ముస్లిం కోటాలో ఫారూఖ్ హుస్సేన్ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే రాజేశ్వర్‌రావు కాంగ్రెస్ హయాంలో రెండుసార్లు, బీఆర్ఎస్ హయాంలో ఒకసారి.. ఫారూఖ్ కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల నుంచి ఒక్కోసారి గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా పనిచేశారు. వారికి మళ్లీ అవకాశమిస్తారా? అన్న దానిపై చర్చ జరుగుతోంది.

ప్రభుత్వం రెండేళ్ల క్రితం గవర్నర్ కోటాలో పాడి కౌశిక్‌రెడ్డిని ఎమ్మెల్సీగా నామినేట్ చేసినా.. ఆయనపై క్రిమినల్ కేసులు ఉన్నాయనే కారణంతో గవర్నర్ తమిళిసై ఆమోదించకుండా పక్కనపెట్టారు. దీనితో ప్రభుత్వం ఆ స్థానంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి పేరును ప్రతిపాదించగా గవర్నర్ ఓకే చేశారు. ఈ నేపథ్యంలో క్లీన్ ఇమేజీ ఉన్నవారిని ఎమ్మెల్సీలుగా నామినేట్ చేయాలని కేసీఆర్ భావిస్తున్నట్టు తెలిసింది. ఇందులో టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి పేరు ప్రధానంగా పరిశీలనలో ఉన్నట్టు సమాచారం. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర, టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా సేవలతోపాటు అంబేడ్కర్ భారీ విగ్రహం ఏర్పాటులో చేసిన కృషిని దృష్టిలో పెట్టుకుని చక్రపాణి వైపు మొగ్గు చూపుతున్నట్టు తెలిసింది. ఇక గౌడ వర్గానికి మండలిలో ప్రాతినిధ్యం లేనందున ఆ వర్గానికి చెందిన ప్రముఖుల పేర్లను.. త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మైనారిటీ వర్గానికి చెందిన నేతల పేర్లనూ కేసీఆర్ పరిశీలిస్తున్నట్టు సమాచారం.

త్వరలో రాష్ట్రానికి అమిత్‌షా, నడ్డా



సాక్షి, హైదరాబాద్: ఈనెల 30 నుంచి నెలరోజుల పాటు నిర్వహించనున్న 'మహాజన్ సంపర్క్ అభియాన్'లో తెలంగాణలో నిర్వహించే రెండు బహిరంగ సభలకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఉత్తర, దక్షిణ తెలంగాణలలో ఒక్కొక్క బహిరంగ సభ నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. ఈనెల 23న దేశవ్యాప్తంగా పది లక్షల మందిపోలింగ్ బూత్ స్థాయి కార్యకర్తలతో ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రసంగించనున్నారు. మోదీ ప్రభుత్వం 9 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా 396 బహిరంగ సభల్లో భాగంగా వీటిని నిర్వహిస్తున్నట్టు బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ జన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా వివిధ రంగాల్లో ప్రముఖులైన లక్ష మందితో ఇంటరాక్టివ్ సెషన్‌లు నిర్వహిస్తామన్నారు. ఇందుకోసం ప్రతి లోక్‌సభ నియోజకవర్గం నుంచి 250 మందిని ఎంపిక చేస్తున్నట్టు తెలియజేశారు.



బుధవారం తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో సబిత, పువ్వాడ అజయ్, నిరంజన్‌రెడ్డి, మహమూద్ అలీ, నామా, శ్రీనివాస్ రెడ్డి, దేశపతి శ్రీనివాస్, కేకే, శ్రీనివాస్ గౌడ్, ఇంద్రకరణ్‌రెడ్డి, హరీశ్‌రావు, తలసాని

105 సీట్లు మనవే!

▶ మొదటి పేజీ తరువాయి

అనుకూలంగా ఉన్నా.. ఎమ్మెల్యేలు ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు చెప్పుకోలేక పోవడం మైనస్‌గా మారిందన్నారు. వందకు వంద శాతం సిట్టింగ్‌లకు మళ్లీ టికెట్లు ఇవ్వాలన్నదే తన అభిమతమని.. జాగ్రత్తలు చెప్పినా సర్దుకుపోకుండా నష్టం చేసుకుంటే తాను మాత్రం ఏం చేయగలనని వ్యాఖ్యానించారు. ఏమరుపాటుగా ఉంటే అందరమూ మునుగుతామని, పార్టీ మునిగితే అందరూ నష్టపోతారని స్పష్టం చేశారు. పార్టీ రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో బుధవారం బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జిల్లా పరిషత్, ప్రభుత్వ కార్పొరేషన్ల చైర్మన్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్న ఈ భేటీలో సీఎం కేసీఆర్ చేసిన ప్రసంగం ఆయన మాటల్లోనే..

''ఎమ్మెల్యేల పనితీరును చాలా నిశితంగా గమనిస్తున్నా. వారు ప్రభుత్వం చేసిన పనులు చెప్పుకోలేక విఫలమవుతున్నారు. ఎమ్మెల్యేలు పిల్లల కోడిలా ఉంటూ అందరినీ కాపాడుకోవాలి. అంశాల వారీగా పనిచేయాలి. క్షేత్రస్థాయిలో మన శక్తిని ఏకీకృతం చేసుకునేలా ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కీలక నేతలందరినీ కలుపుకొని ఐక్యతను చాటాలని పదే పదే చెప్తున్నాం. చిల్లర మల్లర విషయాల మీద రాజకీయాలు చేయకూడదు. కుత్సిత మనసుతో రాజకీయాలు ఫలితాన్ని ఇవ్వవు. కేవలం పార్టీ ఇచ్చే కార్యక్రమాలకు పరిమితం కాకుండా ఎమ్మెల్యేలు సొంత కార్యక్రమాలకు కూడా ప్రణాళికలు వేసుకోవాలి. కులం, మతం ఎజెండాగా ఏ పార్టీ కూడా విజయం సాధించదు. అన్ని వర్గాలను సమాన దృష్టితో చూస్తున్నాం. అదే మన విజయ రహస్యం.

చేసింది చెప్పుకుందాం..

బోగస్ గుజరాత్ మోడల్‌తో మోదీ దేశాన్ని మోసం చేశారు. కానీ మనం పదేళ్లలో అద్భుత ప్రగతిని సాధించాం. అందువల్లే దేశం తెలంగాణ మోడల్‌ను కోరుకుంటోంది. మన మోడల్ వల్లే మహారాష్ట్రలోనూ ప్రజలు మనకు బ్రహ్మరథం పడుతున్నారు. ఇటీవల అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను కేంద్రం పట్టించుకోకపోయినా మనం ఆదుకునేందుకు ముందుకు వచ్చాం. ఎకరానికి రూ. 10 వేలు ఇస్తామంటూ దేశంలో ఏ ప్రభుత్వం చేయనిది ఆచరణలో చూపిస్తున్నాం. దీనిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. కల్తీ విత్తనాలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందనే విషయాన్ని చాలా స్పష్టంగా తెలియజేయాలి. వడగళ్లు, అకాల వర్షాలతో జరిగే నష్టాన్ని తగ్గించేందుకు మార్చి 31లోగా వరికోతలు పూర్తయ్యేలా రైతులను చైతన్యపరచాలి.

ఊరూరా ఉత్సవాలు

తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకుని వజ్రపు తునకలా మార్చుకుని అద్భుతంగా ముందుకు సాగుతున్న నేపథ్యంలో.. జూన్ 2 నుంచి 21 రోజుల పాటు దశాబ్ది ఉత్సవాలను ప్రభుత్వ పరంగా ఘనంగా నిర్వహిస్తున్నాం. ఈ ఉత్సవాల షెడ్యూల్‌ను గురువారం జరిగే రాష్ట్ర కేబినెట్ భేటీ అనంతరం ప్రకటిస్తాం. షెడ్యూల్‌ను అనుసరించి ఒక్కో రోజు ఒక్కో ప్రభుత్వ విభాగంలో.. మన ప్రభుత్వం సాధించిన ఘనతను ప్రజలకు వివరించేలా బ్యానర్లు, పోస్టర్లు కట్టి కార్యక్రమాలు నిర్వహించాలి. పార్టీ శ్రేణులు, ప్రజలను భాగస్వాములను చేయాలి. విజయగాథలకు సంబంధించిన డాక్యుమెంటరీలు, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయాలి. మన ప్రాంత వైతాళికులను గుర్తించి గౌరవించాలి. భాగ్యరెడ్డివర్మ, బద్దం ఎల్లారెడ్డి, భీంరెడ్డి నర్సింహారెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి, కమలాదేవి, సురవరం ప్రతాపరెడ్డి ఇలా ఎక్కడికక్కడ వైతాళికులను గుర్తించి వారిని కీర్తించాలి..'' అని కేసీఆర్ సూచించారు. ఈ సమావేశంలో పార్టీ సెక్రెటరీ జనరల్ కె.కేశవరావు స్వాగతోపన్యాసం చేయగా.. మారిన తెలంగాణ ముఖచిత్రాన్ని ఎమ్మెల్సీ గోరటి వెంకన్న వివరించారు. తెలంగాణ వైభవాన్ని చాటేందుకు దశాబ్ది ఉత్సవాలను సువర్ణావకాశంగా తీసుకోవాలని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ సూచించారు.

నియోజకవర్గంపై అవగాహన లేకుంటే ఎట్లా?

తెలంగాణ భవన్‌లో సమావేశం సందర్భంగా.. జనగాం నియోజకవర్గంలో రైతు వేదికల సంఖ్య గురించి ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిని, తుంగతుర్తిలో గురుకుల కాలేజీల సంఖ్య గురించి ఎమ్మెల్యే గ్యాదరి కిషోర్‌ను కేసీఆర్ ప్రశ్నించారు. వారు సమాధానం చెప్పడానికి తడబడగా.. ''ఎమ్మెల్యేలకు నియోజకవర్గంపై సమగ్ర అవగాహన ఉండాలి. లేకుంటా ఎట్లా? మనం ప్రజలకు ఏం చేస్తున్నామో చెప్పాలి. లేదంటే బయటి వారు చెప్పే అబద్ధాలను ప్రజలు నిజాలుగా నమ్మే అవకాశం ఉంది..'' అని కేసీఆర్ హెచ్చరించారు.

నేడు రాష్ట్ర కేబినెట్ భేటీ

సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ అధ్యక్షతన గురువారం మధ్యాహ్నం 3 గంటలకు కేబినెట్ సమావేశం జరగనుంది. కొత్త సచివాలయంలో ఇదే తొలి మంత్రివర్గ సమావేశం కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో.. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుతీరును సమీక్షించి పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్టు సమాచారం. కొత్త పథకాలు, పెండింగ్ హామీలపైనా చర్చించనున్నట్టు తెలిసింది.

కేసీఆర్ ప్రభుత్వంపై తిరగబడాలి

- పేదల భూములను ధారాదత్తం చేసే సీఈఓ కేటీఆర్
- పీపుల్స్‌మార్చ్ పాదయాత్రలో భట్టి



అమ్మాపూర్‌లో క్రికెట్ ఆడుతున్న భట్టి విక్రమార్క

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: అసైన్డ్ భూములను లాక్కొంటున్న కేసీఆర్ ప్రభుత్వంపై తిరగబడి.. చాకలి ఐలమ్మ స్ఫూర్తితో భూములను కాపాడుకోవాలని కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర 62వ రోజు బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలంలో కొనసాగింది. గురుకుంట సమీపంలో విలేకరుల సమావేశంతో పాటు నవాబుపేటలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద మినీ కార్నర్ మీటింగ్‌లోనూ భట్టి మాట్లాడారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రంలో ఎలాంటి ఆస్తులు సృష్టించకుండా, ఏ ఒక్క బహుళార్థక సాధక ప్రాజెక్ట్ కట్టకుండా రూ.5లక్షల కోట్లు అప్పులు చేశారని, చివరకు బ్యాంకుల నుంచి అప్పులు పుట్టలేని స్థితికి రాష్ట్రాన్ని తీసుకొచ్చారని మండిపడ్డారు. నాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూములకూ ఎసరు పెట్టారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ అవసరాలు, నిబంధనల మేరకు తీసుకోవాల్సిన భూములను బలవంతంగా లాక్కొని, లేఅవుట్‌లు చేసి వాణిజ్య, వ్యాపారాలకు విక్రయిస్తున్నారని ధ్వజమెత్తారు. దాదాపు 30 వేల ఎకరాలను అమెజాన్ వంటి బహుళజాతి సంస్థలకు ధారాదత్తం చేస్తూ మంత్రి కేటీఆర్ సీఈఓలా పనిచేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పంచిన భూములను కాపాడుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఐడీపీఎల్ వంటి ప్రభుత్వరంగ సంస్థల భూములను వెనక్కి తీసుకుని అమ్మేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

తెలంగాణ మోడల్ అంటే ఇదేనా..

లిక్కర్ అమ్మకాలు విపరీతంగా పెంచి ఊరూరా బెల్టు షాపులు పెట్టి ప్రజలకు తాపిస్తున్నారని భట్టి విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో రూ.11వేల కోట్లున్న మద్యం అమ్మకాలు.. స్వరాష్ట్రంలో రూ.36 వేల కోట్లకు చేరాయన్నారు. తెలంగాణ మోడల్ అంటే ఇదేనా అని భట్టి ప్రశ్నించారు. భట్టి వెంట టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు జీఎంఆర్ ఉన్నారు.

రాజాసింగ్‌పై సస్పెన్షన్ త్వరలో ఎత్తివేత!

- అధిష్టానానికి విజ్ఞప్తి చేశాం.. సానుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నాం
- ఐదు నెలల్లో ప్రజలే కేసీఆర్ ప్రభుత్వాన్ని నిషేధించబోతున్నారు
- 'ఖేలో భారత్.. జీతో భాగ్యనగర్' క్రీడా పోటీల్లో బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: వివాదాస్పద వాఖ్యలు చేసిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై విధించిన సస్పెన్షన్ త్వరలోనే ఎత్తివేయనున్నట్లు భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ ప్రకటించారు. ఆ మేరకు పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశామని, సానుకూల స్పందన వస్తుందని ఆశిస్తున్నామని తెలిపారు. నిజాంకాలేజీ మైదానంలో 'ఖేలో భారత్.. జీతో భాగ్యనగర్'పేరుతో నిర్వహించిన క్రీడా పోటీల ఫైనల్స్‌ను తిలకించడానికి వచ్చిన ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. 'ప్రజా సమస్యలపై ప్రశ్నించే మీడియాను ప్రభుత్వం నిషేధిస్తోంది. మరో ఐదు నెలలు ఆగితే.. కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రజలే నిషేధించబోతున్నారు. ప్రజలు అల్లాడుతుంటే.. ప్రజాధనంతో సొంత పార్టీ డబ్బా కొట్టుకుంటున్నారు. బీజేపీ ఎదుగుతుంటే ఓర్వలేక తమ పార్టీ వార్తలు రాయొద్దంటూ ప్యాకేజీలు ఇస్తున్నారు. కేసీఆర్‌కు దమ్ముంటే.. తన పాలనలో అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి'అని సంజయ్ డిమాండ్ చేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ 'ఖేలో భారత్.. జీతో భాగ్యనగర్'పేరుతో హైదరాబాద్‌లో క్రీడా పోటీలు నిర్వహిస్తుండటం హర్షణీయమన్నారు. యువతకు క్రీడా స్ఫూర్తి చాలా అవసరమని, సమష్టిగా పని చేస్తే ఏ రంగంలోనైనా రాణించవచ్చనడానికి క్రీడలే ఉదాహరణ అని సంజయ్ తెలిపారు. పంటనష్టపోయి రైతులు ఏడుస్తుంటే.. ఉద్యోగాల్లేక నిరుద్యోగులు అల్లాడుతుంటే.. చూస్తూ అవసరం లేకపోయినా కేసీఆర్ కొత్త సచివాలయం కట్టుకున్నారని ఎద్దేవా చేశారు. ఓ వర్గం మీడియా తనపైనా అసత్య ప్రచారం చేస్తోందని సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

మొగిలయ్య దంపతులకు దళితబంధు కారు


- రాష్ట్ర ప్రభుత్వం తరపున దంపతులకు కారు అందజేసిన మంత్రి ఎర్రబెల్లి
- దళితులకు అండగా కేసీఆర్ సర్కార్



మొగిలయ్య దంపతులకు కారు తాళం ఇస్తున్న మంత్రి ఎర్రబెల్లి, వినోద్, పెద్ది సుదర్శన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని దళితుల ఉద్ధరణకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దళితబంధు పథకం కింద బలగం ఫేమ్ మొగిలయ్య, కొమురమ్మ దంపతులకు పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కారు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, పెద్ది సుదర్శన్ రెడ్డి, సుంకె రవిశంకర్, జోగినపల్లి శ్రీనివాసరావు, బేడ బుడగ జంగాల జేఏసీ చైర్మన్ టి.జగదీశ్వర్, వైస్ చైర్మన్ చింతల యాదగిరిల సమక్షంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి మాట్లాడారు. మూడేళ్లలో దళితులందరికీ దళితబంధు ద్వారా ఆర్థికసాయం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అందుకే దేశంలో ఎక్కడా లేని విధంగా దళితబంధు పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. వారికి సీఎం కేసీఆర్ సర్కారు ఎల్లవేళలా అండగా నిలుస్తుందని చెప్పారు. అందరి క్షేమం కోసం ఆలోచిస్తూ, పరిపాలన సాగిస్తున్న కేసీఆర్‌కు దళితులంతా ఆయనకు అండగా నిలవాలని కోరారు. బలగం సినిమాలో అద్భుతంగా పాట పాడి అందరినీ ఆకట్టుకున్న మొగిలయ్య, కొమురమ్మలకు కేసీఆర్ అండగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా మొగిలయ్య, కొమురమ్మ దంపతులు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కేసీఆర్.. రాష్ట్రాన్ని డ్రగ్స్ అడ్డాగా మార్చారు



పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ఆల్విన్‌కాలనీ: మంచి విద్య, వైద్యం ఉన్న రాష్ట్రాన్ని డ్రగ్స్‌కు అడ్డాగా సీఎం కేసీఆర్ మార్చారని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. మల్లారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డిలాంటి వారి కోసం ప్రైవేట్ విద్యా సంస్థలకు అనుమతిలిచ్చి, ప్రభుత్వ విద్యకు శఠగోపం పెట్టిన ఘనుడని ఆరోపించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధి ఎల్లమ్మబండలోని గోదాకృష్ణ ఫంక్షన్ హాల్లో మారబోయిన రఘునాథ్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం 'యువతా మేలుకో'కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి హాజరయ్యారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం పొంగులేటి మాట్లాడుతూ.. 60 ఏళ్ల పోరాడి సాధించుకున్న తెలంగాణను బంగారు తెలంగాణగా తీర్చిదిద్దుతానని గారడీ మాటలు చెప్పి రాష్ట్రంలోని యువతను అధోగతిపాలు చేశారని మండిపడ్డారు. ప్రతి ఇంటికి ఓ ఉద్యోగం, నిరుద్యోగులకు నిరుద్యోగభృతి ఇస్తానని చెప్పి, గద్దెనెక్కాక నట్టేట ముంచిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. పేపర్ లీకేజీ వ్యవహారంలో ఇప్పటివరకు ఒక్కరినీ శిక్షించలేని అసమర్థ ముఖ్యమంత్రిని విమర్శించారు. పిడమర్తి రవి మాట్లాడుతూ.. యువత ముందుకొచ్చి రాజకీయాల దశ, దిశ, మార్చాలని పిలుపునిచ్చారు. యూనివర్సిటీలను సీఎం కేసీఆర్ గంగలో కలిపారన్నారు.

..వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ

▶ మొదటి పేజీ తరువాయి

ఉజ్వల భవిష్యత్‌కి కలిసి పనిచేయాలని నిర్ణయించారు.

గొడుగు కింద ప్రఖ్యాత వినోద చానళ్లు..

వైవిధ్యభరిత కంటెంట్, బ్రాండ్స్, ఫ్రాంచైజీల ద్వారా టెలివిజన్, సినిమా, స్ట్రీమింగ్, గేమింగ్ వంటి రంగాల్లో వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ ప్రపంచ ఖ్యాతి గడించింది. సంస్థ గొడుగు కింద ప్రపంచ ప్రఖ్యాత హెచ్‌బీఓ, హెచ్‌బీఓ మ్యాక్స్, సీఎన్ఎన్, టీఎల్‌సీ, డిస్కవరీ, డిస్కవరీ ప్లస్, డబ్ల్యూబీ, యూరోస్పోర్ట్, అనిమల్ ప్లానెట్, కార్టూన్ నెట్‌వర్క్, సినిమాక్స్, పోగో, టూన్ కార్ట్, హెచ్‌జీటీవీ, క్వెస్ట్ వంటి ఎంటర్‌టైన్మెంట్ చానళ్లు పనిచేస్తున్నాయి. హైదరాబాద్‌లో తమ కార్యాలయాన్ని ప్రారంభించడం ద్వారా భారతీయ మార్కెట్‌లోని అపార వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవడంతో పాటు నగర మీడియా, ఎంటర్‌టైన్మెంట్ రంగాలపై తనదైన ముద్ర వేయాలని వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.

వ్యూహాత్మక కేంద్రంగా సేవలు..

మన దేశంలో వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ సంస్థ కార్యకలాపాలకు హైదరాబాద్‌లోని ఐడీసీ వ్యూహాత్మక కేంద్రంగా సేవలందించనుంది. తొలి ఏడాది 1200 వృత్తి నిపుణులకు ఉద్యోగావకాశాలు కల్పించనుంది. వ్యాపారాభివృద్ధికి అనుగుణంగా ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచుకోనుంది. స్థానిక నిపుణులను ప్రోత్సహించడం, హైదరాబాద్ నగరంలో మీడియా, వినోద రంగ పరిశ్రమల అభివృద్ధికి తోడ్పాటు అందించడంలో సంస్థ చిత్తశుద్ధికి ఈ నిర్ణయం నిదర్శనమని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది.

కాళేశ్వరం, భగీరథ ప్రాజెక్టులపై ప్రసంగించనున్న కేటీఆర్

కాగా, వారం రోజుల అమెరికా పర్యటనలో భాగంగా న్యూయార్క్‌లోని జేఎఫ్‌కే అంతర్జాతీయ విమానాశ్రయానికి బుధవారం చేరుకున్న మంత్రి కె.తారకరామారావుకు అక్కడి ఎన్ఆర్ఐలు ఘనస్వాగతం పలికారు. ఈనెల 21 నుంచి 25 వరకు నెవాడాలోని హెండర్సన్‌లో అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్(ఏఎస్‌సీఈ) ఆధ్వర్యంలో జరగనున్న ప్రపంచ పర్యావరణ, నీటి వనరుల సదస్సుకు కేటీఆర్ హాజరవుతున్నారు. తెలంగాణ పరివర్తనాత్మక ప్రాజెక్టులు – కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు, మిషన్ భగీరథ ప్రాజెక్టుల గురించి సదస్సులో ప్రసంగించనున్నారు. వివిధ వాణిజ్య సమావేశాల్లోనూ కేటీఆర్ పాల్గొననున్నారు.

క్లుప్తంగా...

శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్ల షెడ్యూల్ విడుదల

తిరుమల: తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్లను బుక్ చేసుకునే భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా టీటీడీ షెడ్యూల్ విడుదల చేసింది. సేవా టికెట్లు లేదా దర్శన టికెట్ల విడుదల తేదీ ఆదివారం వచ్చినట్లయితే వాటిని మరుసటి రోజు విడుదల చేస్తుంది. ప్రతినెలా 18 నుంచి 20వ తేదీ వరకు సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన ఆర్జిత సేవల లక్కీ డిప్ కోసం నమోదు చేసుకోవచ్చు. 20 నుంచి 22వ తేదీ వరకు డిప్‌లో టికెట్లు పొందిన వాళ్లు సొమ్ము చెల్లించి వాటిని ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది. కల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, ఊంజల్ సేవ, సహస్రదీపాలంకార సేవలతో పాటు వర్చువల్ సేవా టికెట్లను 21వ తేదీన విడుదల చేస్తారు. శ్రీవాణి, అంగ ప్రదక్షిణ, వృద్ధులు, దివ్యాంగుల దర్శన టికెట్లు 23వ తేదీన విడుదలవుతాయి. అదేవిధంగా రూ.300 దర్శన టికెట్ల కోటాను 24న, తిరుపతిలో గదుల కోటాను 25న, తిరుమలలో గదుల కోటాను 26న విడుదల చేస్తుంది.

టీడీపీ మాజీ మంత్రి అఖిలప్రియ అరెస్టు

- అఖిలప్రియ భర్త భార్గవరామ్ కూడా అరెస్టు... 14 రోజుల రిమాండ్



బొమ్మలసత్రం (నంద్యాల): నంద్యాల మండలం కొత్తపల్లి గ్రామ శివారులో మంగళవారం నారా లోకేశ్ పాదయాత్రలో టీడీపీ సీనియర్ నేత ఏవీ సుబ్బారెడ్డిపై దాడి చేసి, హత్యాయత్నం చేసిన కేసులో అదే పార్టీకి చెందిన మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, ఆమె భర్త భార్గవరామ్‌ను అరెస్టు చేశారు. అఖిలప్రియ, ఆమె భర్త, అనుచరులు, కిరాయి హంతకులతో కలిసి తనను చంపేందుకు ప్రయత్నించారని సుబ్బారెడ్డి నంద్యాల తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో భూమా అఖిలప్రియ, భార్గవరామ్, మోహన్, వెంకట సాయినాథ్, మరో ఏడుగురిపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. బుధవారం ఉదయం అఖిలప్రియ, భార్గవరామ్‌లను ఆళ్లగడ్డ పట్టణంలోని వారి నివాసంలో అదుపులోకి తీసుకొని పాణ్యం పోలీసు స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో వైద్యపరీక్షల అనంతరం నంద్యాల జేఎఫ్‌ఎంసీ కోర్టులో హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ ఆదినారాయణ వారికి 14 రోజుల రిమాండ్ విధించారు. అఖిలప్రియను కర్నూలు మహిళా సబ్ జైలుకు తరలించారు. పాదయాత్రలో తనను ఏవీ సుబ్బారెడ్డి చున్నీ లాగి గొంతుకు బిగించి హత్య చేసేందుకు ప్రయత్నించారని అఖిలప్రియ ఫిర్యాదు మేరకు సుబ్బారెడ్డిపై కేసు నమోదు చేశారు.

ఇది పేదల విజయం

అమరావతిలో ఇళ్ల స్థలాలకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్

ఏపీ హైకోర్టు ఉత్తర్వులపై స్టే ఇవ్వడానికి నిరాకరించిన సుప్రీంకోర్టు



సాక్షి, అమరావతి: రాజధానిలో పేదలకు స్థానమే లేకుండా చేసేందుకు తెలుగుదేశం పార్టీ కుట్రలు, కుతంత్రాలను సుప్రీంకోర్టు పటాపంచలు చేసింది. రాజధాని ప్రాంతంలో పేదలకు 5 శాతం భూమి కేటాయించాలన్న సీఆర్‌డీఏ చట్ట నిబంధనలను తు.చ. తప్పకుండా అమలు చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని అడ్డుకునేందుకు శక్తివంచన లేకుండా తెలుగుదేశం పార్టీలు పెద్దలు చేసిన యత్నాలను సుప్రీంకోర్టు తిప్పికొట్టింది. పేదలకు ఇళ్ల స్థలాలు రాకుండా చేసేందుకు న్యాయవాదులకు కోట్ల రూపాయలను వెదజల్లినా టీడీపీ ప్రయత్నాలు ఏవీ ఫలించలేదు. పేదలకు వ్యతిరేకంగా రైతుల ముసుగులో పిటిషన్లు దాఖలు చేయించి, వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని నిరోధించాలన్న అభ్యర్థనలను సుప్రీంకోర్టు నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. చట్ట ప్రకారం రాజధాని ప్రాంతంలో వేలాది మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతిచ్చింది. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంలో ఏ రకంగానూ జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పింది. ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా ప్రభుత్వాన్ని నిరోధించేందుకు నిరాకరిస్తూ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపులు రాజధాని ప్రధాన కేసులో తాము వెలువరించే తుది తీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ అరవింద్ కుమార్‌ల ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా అడ్డుకోండి

రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు 1,134 ఎకరాల భూమిని ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల కలెక్టర్లకు బదలాయించేందుకు సీఆర్‌డీఏకు అనుమతిస్తూ ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో 45ను సవాలు చేస్తూ అమరావతి రైతులు హైకోర్టులో పలు వ్యాజ్యాలు దాఖలు చేశారు. జీవో 45 అమలును నిలుపుదల చేయడంతో పాటు పేదలకు ఎలాంటి ఇళ్ల స్థలాలు కేటాయించకుండా ప్రభుత్వాన్ని నిరోధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని అనుబంధ వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ధర్మాసనం ఇటీవల విచారణ జరిపి వాటిని కొట్టేసింది. పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపు తాము వెలువరించే తుది తీర్పునకు లోబడి ఉంటాయని ధర్మాసనం తన మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మధ్యంతర ఉత్తర్వులను సవాలు చేస్తూ అమరావతి రైతులు కొందరు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై బుధవారం జస్టిస్ జోసెఫ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, సీఆర్‌డీఏ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి, పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు శ్యాం దివాన్, రంజిత్ కుమార్ తదితరులు వాదనలు వినిపించారు. ఈ విచారణకు హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి కూడా హాజరయ్యారు.

ఎలా చూసినా పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సిందే

రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ, పిటిషన్లు దాఖలు చేసిన పిటిషన్‌లకు ఎలాంటి విచారణ అర్హత లేదన్నారు. వేలాది మంది రైతుల్లో కనీసం పది మంది కూడా కోర్టుకు రాలేదన్నారు. సీఆర్‌డీఏ చట్టం ప్రకారం కూడా ఐదు శాతం భూమి ఈడబ్ల్యూఎస్ (ఎకనామికల్లీ వీకర్ సెక్షన్) వర్గాలకు ఇవ్వాల్సి ఉందన్నారు. దాని ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తోందని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ.. రాజధాని ప్రధాన కేసులో అనుకూలంగా తుది తీర్పు రాకపోతే పరిస్థితి ఏమిటని ప్రశ్నించింది. ఒకవేళ అలా జరిగినా ప్రస్తుతం పేదలకు చేస్తున్న కేటాయింపులకు ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు. ఎందుకంటే సీఆర్‌డీఏ చట్టమే పేదలకు ఐదు శాతం భూమి ఇవ్వాలని చెబుతోందని తెలిపారు. కాని ఇప్పుడు పేదలకు ప్రభుత్వం ఇస్తున్నది కేవలం 3.1 శాతం భూమి మాత్రమేనన్నారు. 34 వేల ఎకరాల్లో సుమారు 1,200 ఎకరాలు మాత్రమే పేదలకు కేటాయించామని తెలిపారు. సీఆర్‌డీఏ చట్టంలో సెక్షన్ 53 డీ ప్రకారం పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే అధికారం ప్రభుత్వానికి ఉందన్నారు. ఆర్–5 జోన్‌లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం వల్ల ఎలక్ట్రానిక్ సిటీ (ఈ–సిటీ)కి వచ్చిన ఇబ్బందేంటో తెలియడం లేదన్నారు. ఇళ్ల స్థలాల కేటాయింపుపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు మాత్రమే ఇచ్చిందని తుది విచారణ జరగాల్సి ఉందన్నారు. కోర్టులో దాఖలు అవుతున్నవన్నీ వ్యక్తిగత పిటిషన్లేనని, ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు కాదని వివరించారు.

ఈ పది మంది వెనుక ఎవరున్నారో పరిశీలించండి

వేల మంది భూములిచ్చిన రైతులుండగా, కేవలం పది మందే కోర్టుకు ఎందుకొచ్చారో, దీని వెనుక ఎవరున్నారో పరిశీలించాలన్నారు. ప్రస్తుతం పేదలకు కేటాయించిన స్థలాల వల్ల పిటిషనర్లకు చెందిన రిటర్నబుల్ ప్లాట్లకు వచ్చిన ఇబ్బంది ఏమీ లేదని సింఘ్వీ తెలిపారు. పేదలకు ప్రస్తుతం కేటాయించిన స్థలాలు ఈ–సిటీ దగ్గర్లో ఉన్నాయని, 6,500 ఎకరాల ఈ–సిటీలో ప్రభుత్వం పేదలకు కేటాయించిన స్థలం చాలా తక్కువని చెప్పారు. అసలు ఆర్–5 జోన్‌లోనే ఎందుకు.. మరెక్కడైనా ఇవ్వొచ్చుగా అని ప్రశ్నించినా సమాధానం చెప్పగలమన్నారు. ప్రస్తుతం ఉన్న నాలుగు జోన్లలో జోన్–1ను ప్రస్తుతం ఉన్న గ్రామాల కారణంగా ముట్టుకునే పరిస్థితి లేదని, జోన్–2 స్పెషల్ ఏరియా అని.. ఢిల్లీలో లుటియన్స్ ఢిల్లీ మాదిరి అని తెలిపారు. జోన్–3 భూములిచ్చిన వారికి ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లు ఉన్న ప్రాంతమని, జోన్–4 హై డెన్సిటీ ప్రాంతం అని ఆయన ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. అందుకే పేదల కోసం ఆర్–5 జోన్‌ను సృష్టించామని తెలిపారు. రిటర్నబుల్ ప్లాట్లు ఒకచోట, ఈ–సిటీ మరోచోట అని తెలిపారు. ఒకవేళ పిటిషనర్లు హైకోర్టులో గెలిచినా కూడా సీఆర్‌డీఏ చట్టం ప్రకారం పేదలకు ఐదు శాతం భూమి కేటాయించాల్సిందేన్నారు. రాజధాని ప్రధాన వ్యాజ్యాలు జూలైలో విచారణకు రానున్నా యని, ఒకవేళ పిటిషనర్లకు అనుకూలంగా తీర్పు వచ్చినా రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేయాల్సిందేనని, అప్పుడు కూడా ఐదు శాతం ఈడబ్ల్యూఎస్‌కు కేటాయించాల్సి ఉంటుందని వివరించారు.

మాస్టర్ ప్లాన్‌ను మార్చలేదు

సీఆర్‌డీఏ తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. మాస్టర్ ప్లాన్‌లో ఎలాంటి మార్పులు చేయడం లేదని స్పష్టం చేశారు. కేటాయించిన స్థలాల్లో నివాసాలు కట్టుకోవడానికి కూడా ప్రభుత్వం మద్దతు ఇస్తుందన్నారు. చట్ట ప్రకారం పేదలకు ఐదు శాతం స్థలాలు కేటాయించాల్సి ఉందన్నారు. భూసేకరణ అనేది ప్రభుత్వం ప్రజల కోసమే చేస్తుందని, దాన్ని ఇతరత్రా ప్రజా ప్రయోజనాల కోసం కూడా వినియోగిస్తుందని తెలిపారు. ఈడబ్ల్యూఎస్ వర్గాలకు స్థలాల కేటాయింపు ప్రజా ప్రయోజనం కాదని అనడం ఎంత మాత్రం సబబు కాదన్నారు. అంతకు ముందు పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాదులు శ్యాం దివాన్, రంజిత్ కుమార్ తదితరులు వాదనలు వినిపిస్తూ.. 29 గ్రామాలకు చెందిన 33 వేల మంది రైతులు భూ సమీకరణ కింద ప్రభుత్వానికి రాజధాని కోసం భూములు ఇచ్చారన్నారు. అమరావతిలో మీడియా సిటీ, నాలెడ్జి సిటీ, జస్టిస్ సిటీ, ఎలక్ట్రానిక్ సిటీ ఇలా తొమ్మిది రకాల సిటీలు అభివృద్ధి చేయాలని మాస్టర్ ప్లాన్‌లో ఉందన్నారు. ఒరిజినల్ మాస్టర్ ప్లాన్‌లో 5 శాతం పేదలకు ఇళ్ల స్థలాలను తొమ్మిది సిటీలకు విస్తరించాలన్నారు. మాస్టర్ ప్లాన్‌లో 17 వేల ఎకరాలు రెసిడెన్షియల్ జోన్లకు కేటాయించారని పేర్కొన్నారు. జూలైలో తుది తీర్పు రానుందని, అంతకు ముందుగానే పట్టాలు కేటాయించడం సబబు కాదని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఇరుపక్షాల వాదనల అనంతరం హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులపై స్టే ఇవ్వడానికి ధర్మాసనం నిరాకరించింది. అటు హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల్లో, ఇటు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంలో ఏ రకంగానూ జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది.

మీకిచ్చిన సెంటు భూమి | శవం పూడ్చడానికి సరిపోతుంది

పేదల ఇళ్లపై చంద్రబాబు అహంకారపూరిత వ్యాఖ్యలు




పెందుర్తిలో జనం లేక చంద్రబాబు రోడ్‌షో వెలవెల

సాక్షి, విశాఖపట్నం: పేదల సొంతింటి కల నెరవేర్చేలా అక్కచెల్లెమ్మలకు రూ.లక్షలు విలువ చేసే ఆస్తిని అందించేందుకు ప్రభుత్వం ఇస్తున్న సెంటు స్థలాలపై టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అహంకారపూరిత వ్యాఖ్యలు చేశారు. మీకిచ్చే సెంటు భూమి శవాన్ని పూడ్చడానికి సరిపోతుందంటూ కించపరిచేలా వ్యాఖ్యలు చేశారు. బుధవారం పెందుర్తిలో నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెందుర్తి ఎన్టీఆర్ జంక్షన్‌లో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. సెంటు భూమిలో ఇళ్లు కడతామని జగన్ చెబుతున్నారని, ఆ సెంటు భూమి బరియల్ గ్రౌండ్‌కు మాత్రమే ఉపయోగపడుతుందని ఎద్దేవా చేశారు. ఎవరైనా చనిపోతే అందులో పూడ్చడానికి మాత్రమే దీన్ని ఉపయోగించవచ్చని అన్నారు.

పొంగులేటి, జూపల్లి కాంగ్రెస్‌లోకే వస్తారు

- భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- కర్ణాటక ఫలితాలను చూసి కేసీఆర్ భయపడుతున్నారు
- తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



నల్లగొండ: 'పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావులతో మాట్లాడాను.. వారు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటారు' అని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం నల్లగొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలో చేరాల్సిందిగా కోరానని, దానికి వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. కాగా, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కర్ణాటక ఫలితాల భయం పట్టుకుందన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని తనకు ముందే తెలుసన్నారు. అక్కడ బీజేపీ నేతలు అక్రమాలకు పాల్పడ్డారని, అందుకే ప్రజలు ఆ పార్టీకి బుద్ధి చెప్పారని అన్నారు. తెలంగాణలో కూడా దళితబంధు పథకంలో అవినీతి జరిగిందని ముఖ్యమంత్రే ఒప్పుకున్నారని, ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఆ ప్రభుత్వానికి నూకలు చెల్లాయని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. టీఎస్‌పీఎస్సీ ద్వారా పరీక్షలు నిర్వహించ లేని స్థితిలో ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. గత సంవత్సరం ఇంటర్ పేపర్లు సక్రమంగా దిద్దక పోవడం వల్ల 30 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో ధాన్యం కొనుగోలు కేంద్రంలో వేల క్వింటాళ్ల ధాన్యం ఉన్నా కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. మిల్లర్లు, అధికారులు, నాయకులు కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే.. ఇచ్చి నహామీలన్నీ అమలు చేస్తామన్నారు. లేదంటే తాను ఆనాడు ఏస్థాయి పదవిలో ఉన్నా రాజీనామా చేస్తానని ప్రకటించారు.

నల్లగొండలో గుత్తా ఇల్లు ఇవ్వమనండి..

'గుత్తాకు నా ఆస్తులన్నీ ఇస్తా.. నల్లగొండలో ఆయన ఇల్లు ఇవ్వమనండి. నేను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత ఇక్కడ ఉండేందుకు పనికి వస్తుంది' అని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. 'నేను ఎదైనా మాట్లాడితే మతి భ్రమించి మాట్లాడుతున్నాడని అంటున్నారు. మరి గుత్తా సుఖేందర్‌రెడ్డి మతి భ్రమించే ఉరుమడ్లలో 800 ఎకరాలు కొన్నారా' అని ప్రశ్నించారు.

మంచు కొండల్లో.. మహాన్నదానం..

▶ మొదటి పేజీ తరువాయి

అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. విడతల వారీగా పది రోజులకు ఒక టీం వెళ్లి అక్కడ సేవ చేస్తున్నారు. లంగర్‌లో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి అన్నం, చపాతీ అందిస్తున్నారు. ఇలా ప్రతిరోజూ 4వేల మంది భక్తులకు భోజనం అందిస్తున్నారు. దక్షిణ భారతదేశానికి చెందిన భక్తులు ఏప్రిల్ చివరి వారం నుంచి జూన్ మొదటివారం వరకు ఎక్కువగా యాత్ర చేస్తారు. ఇప్పటివరకు లక్షకుపైగా భక్తులకు అన్నదానం చేశారు. రోజూ 250 మందికి రాత్రి సమయంలో బస సైతం కల్పిస్తున్నారు. అలాగే భక్తుల కోసం లంగర్ సమీపంలోనే సమాచార కేంద్రం ఏర్పాటు చేశారు. భక్తులు ఎలా వెళ్లాలో పలు సూచనలు చేస్తున్నారు. ఫోన్ సౌకర్యం ఏర్పాటు చేసి వారి బంధువులకు క్షేమ సమాచారాలను చేరవేస్తున్నారు.

ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తెస్తే కేసులు

– ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్

రాజేంద్రనగర్: ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి మద్యం బాటిళ్లు తీసుకురావడం నేరమని, అలా తెచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఇతర రాష్ట్రాల నుండి మద్యాన్ని తీసుకువస్తున్న వారిని గుర్తించి 16 లక్షల రూపాయల విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బుధవారం ఉప్పర్‌పల్లిలోని శంషాబాద్ ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గోవా, హరియాణా, ఢిల్లీ తదితర రాష్ట్రాల నుండి తెలంగాణ రాష్ట్రానికి అక్రమంగా మద్యాన్ని సరఫరా చేస్తున్నారని వెల్లడించారు. దీని ద్వారా ప్రభుత్వ ఆదాయానికి కొందరు గండి కొడుతున్నారని వెల్లడించారు. ఎలాంటి లేబుళ్లు లేకుండా రాష్ట్రానికి తరలించి లేబుళ్లు ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారన్నారు. ఇది నకిలీ మద్యం కూడా కావచ్చునని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఈ మద్యాన్ని నియంత్రించేందుకు గత వారం రోజులుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మద్య నిషేధ, ఎక్సైజ్ శాఖ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి సుమారు రూ.16 లక్షల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. ఈమేరకు 85 కేసులు నమోదు చేసి 81 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కుత్బుల్లాపూర్ స్టేషన్ పరిధిలో రెండు కేసులు నమోదు చేసి 15 మందిని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. వీరి వద్ద నుంచి 1600 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో నకిలీ మద్యాన్ని సరఫరా చేసేందుకు ఉపయోగిస్తున్న కంటైనర్‌తో పాటు 3 కార్లు, 2 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. సరూర్‌నగర్, మల్కాజిగిరి స్టేషన్ల పరిధిలో ఆర్మీ మందును విక్రయిస్తున్న 11 మందిని గుర్తించి, వారి నుండి 350 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

అంతకు మించొద్దు..

విదేశాల నుండి వచ్చే ప్రయాణికులు డ్యూటీ ఫ్రీ షాపు నుండి కొనుగోలు చేసిన 2 లీటర్ల విదేశీ మద్యాన్ని కలిగి ఉండవచ్చునని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. రాష్ట్రంలోని లైసెన్స్ దుకాణాల ద్వారా కొనుగోలు చేసిన 4.5 లీటర్ల మద్యాన్ని, 7.5 లీటర్ల బీర్లను కలిగి ఉండవచ్చునని వెల్లడించారు. అంతకుమించి ఎవరి దగ్గరైనా మద్యం లభిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్సైజ్ శాఖ అధికారులను ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ అభినందించారు. అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డేవిడ్ రవికాంత్, సహాయ కమిషనర్ చంద్రయ్య, శంషాబాద్ ఈఎస్‌ఏ సత్యనారాయణ, ఎస్‌హెచ్‌ఓలు శ్రీనివాస్, గాంధీ నాయక్, టాస్క్‌ఫోర్స్ అధికారులు వెంకటరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

'ప్లాంటేషన్ మోడల్' సిద్ధం చేయండి

ఇరిగేషన్ భూముల్లో మొక్కలు నాటేందుకు సీఎస్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: జూన్ 15 తర్వాత హరితహారం కింద నీటిపారుదలశాఖ భూముల్లో మొక్కలు నాటేందుకు 'ప్లాంటేషన్ మోడల్'సిద్ధం చేయాలని ఇరిగేషన్, పంచాయతీరాజ్, అటవీశాఖల అధికారులను సీఎస్ ఎ.శాంతికుమారి ఆదేశించారు. మూడు ఎకరాలకు పైబడి ఉన్న భూముల్లో ఈ మోడల్‌ను చేపట్టాలని, ఈ ప్రాంతాల్లో ట్రెంచింగ్, ఇతర పనులకోసం డిజైన్‌ను రూపొందించాలని సూచించారు. అటవీ, గ్రామపంచాయతీ నర్సరీల్లో ఉన్న కలప, పండ్ల మొక్కలను నాటాలన్నారు. గ్రామాలకు దగ్గరలో ఉన్న ఈ భూముల్లో పండ్ల మొక్కలు నాటాలని, కెనాల్ బండ్ల వెంట గుర్తించిన 389 బ్లాక్‌ల్లో మొక్కలు నాటేందుకు మైక్రోప్లాన్ కోసం అదనపు కలెక్టర్లు (ఎల్‌బీ), డీఎఫ్‌వోలు, డీఆర్‌డీవోలు, జిల్లా ఇరిగేషన్ అధికారుల సంయుక్త బృందాలను ఏర్పాటు చేశారు. సమావేశంలో పీఆర్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, డైరెక్టర్ హనుమంతరావు, పీసీసీఎఫ్ ఆర్‌ఎం డోబ్రియాల్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఒకటి... రెండు... మూడు.. అరెస్టు

▶ మొదటి పేజీ తరువాయి

రాజేశ్వర్‌కి బెయిల్ కూడా వచ్చింది. దీంతో శాంతి, రాహుల్‌తో పాటు టీఎస్‌పీఎస్సీ మాజీ సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్ రాజశేఖర్‌రెడ్డి భార్య సుచరిత, నాగార్జున సాగర్‌కు చెందిన దళారి రమావత్ దత్తులను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

రేణుక ద్వారా రాహుల్‌కు..

ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాహుల్‌కు కొన్నేళ్లుగా లీకేజీలో కీలక సూత్రధారి అయిన ప్రవీణ్‌కుమార్ స్నేహితురాలు రేణుకతో పరిచయం ఉంది. డీఏఓ పరీక్ష రాస్తున్నాడనే విషయం తెలిసిన రేణుక ఈ ఏడాది ఫిబ్రవరిలో రాహుల్‌ను కలిసి డీఏఓ మాస్టర్ పేపర్‌ను చూపించింది. అందులో ఉన్న ప్రశ్నలు–జవాబులను రాహుల్ తన వద్ద ఉన్న నోట్ బుక్‌లో రాసుకున్నాడు. వీటి ఆధారంగా పరీక్షకు సిద్ధమైన అతడు మూడో ర్యాంకు సాధించాడు. ఇదే పేపర్‌ను రేణుక భర్త డాక్యా నుంచి తీసుకుని రాజేశ్వర్, అతడి భార్య శాంతి పరీక్ష రాశారు.

తొలి పది ర్యాంకులు వచ్చిన వారిపై దృష్టి

లీకేజ్ కేసు దర్యాప్తు ప్రారంభించిన సిట్ అధికారులు వివిధ కోణాల్లో ముందుకు వెళ్తున్నారు. ప్రతి పరీక్షలోనూ అధిక మార్కులు, మొదటి పది ర్యాంకులు సాధించిన వారి వివరాలను సేకరించి విశ్లేషిస్తున్నారు. డీఏఓ పరీక్షల్లో ర్యాంకులు, మార్కులు సాధించిన వారిపై దృష్టి పెట్టిన పోలీసులు శాంతి, రాహుల్, సుచరిత, రాజేశ్వర్‌ల వ్యవహారం గుర్తించారు. రాజేశ్వర్ గతంలోనే ఈ కేసులో అరెస్టు అవడంతో బుధవారం రాహుల్, శాంతి, సుచరిత, దత్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. వీళ్లు విషయం అంగీకరించడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ పేపర్ వీరి నుంచి మరెవరికైనా చేరిందా అనే కోణంలో ఆరా తీస్తున్నారు. తదుపరి విచారణ నిమిత్తం ఈ నలుగురినీ కస్టడీకి కోరాలని సిట్ అధికారులు నిర్ణయించారు. ఈ అరెస్టులతో కలిసి ఇప్పటి వరకు లీకేజ్ కేసులో అరెస్టు అయిన వారి సంఖ్య 34కు చేరింది.

జనగామలోనూ నీటిలో తేలియాడే ఇటుకలు



ఇటుకను చూపిస్తున్న రెడ్డి రత్నాకర్‌రెడ్డి


జనగామ: కాకతీయులకు పూర్వమే నీటిలో తేలియాడే ఇటుకల తయారీ జనగామ జిల్లాలో ఉన్నట్లు చరిత్ర పరిశోధకుడు, డిస్కవర్ మ్యాన్ రెడ్డి రత్నాకర్‌రెడ్డి అన్నారు. వారు బుధవారం విలేకరులతో మాట్లాడుతూ జనగామ మండలం వడ్లకొండ–చీటకోడూరు గ్రామాల సరిహద్దున ఉన్న పొట్టిగుట్ట వద్ద నీటిలో తేలియాడే ఇటుకను గుర్తించామని, కాకతీయులకు పూర్వమే వీటిని తయారు చేసినట్టు తెలుస్తోందన్నారు. పొట్టిగుట్ట సమీపాన ప్రాచీన శిలాయుగం నాటి ఆదిమానవుల ఉనికి ఆనవాళ్లున్నాయని తెలిపారు. గుట్టలపై నవీన శిలాయుగం నాటి గ్రూప్స్.. బృహత్సిలా యుగానికి చెందిన సమాధులున్నట్లు పేర్కొన్నారు. ఇక్కడే శాతవాహనుల కాలం నాటి ఇటుకల నిర్మాణాలు కనిపిస్తున్నాయని, నాట్యగత్తె నడుం భాగం, ఎర్రకోట బొమ్మ లభించాయని చెప్పారు. ఇక్కడ లభించిన ఇటుకలు బోలుగా, తేలికగా ఉండి నీటిపై తేలియాడుతున్నాయని వివరించారు.

వక్రబుద్ధితో కేసీఆర్ వ్యాఖ్యలు

సాక్షి, హైదరాబాద్: దేశానికి కాంగ్రెస్ ఏమీ చేయలేదనడం సీఎం కేసీఆర్ వక్రబుద్ధికి నిదర్శనమని ఏఐసీసీ కిసాన్ సెల్ వైస్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి విమర్శించారు. కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టిన కాంగ్రెస్‌ను నిందించడం ఆయన కుటిల నీతిని బయట పెడుతోందని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మరో రెండు రోజులు భగభగలే

- అత్యధికంగా కొత్తగూడెం జిల్లా జూలూరుపాడులో 46.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు
- దూర ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని, వడదెబ్బ జాగ్రత్తలు తీసుకోవాలని సూచన
- హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు ఎండలు తీవ్రంగా ఉంటాయని, సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీల సెల్సియస్ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతో దూరప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, వడదెబ్బ తగిలే అవకాశం ఉన్న నేపథ్యంలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని శాఖ అధికారులు సూచించారు. కాగా, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సాధారణ స్థితిలోనే నమోదవుతాయని పేర్కొంది. బుధవారం గ్రేటర్ హైదరాబాద్ పరిధి మినహా రాష్ట్రవ్యాప్తంగా 40 డిగ్రీలకు పైగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడులో 46.4 డిగ్రీ సెల్సియస్ నమోదుకాగా, ఖమ్మం జిల్లా ఖానాపూర్‌లో 45.4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. బుధవారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే...ఖమ్మం జిల్లా ఖానాపూర్‌లో 45.4 డిగ్రీల సెల్సియస్, ఖమ్మంలో 43.2 డిగ్రీల సెల్సియస్ నమోదు కాగా, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 23.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది.

ఏపీలో ఠారెత్తిస్తున్న ఉష్ణోగ్రతలు

ఏపీలో సూర్యుడి ప్రతాపం కొనసాగుతోంది. బుధవారం రాయలసీమ జిల్లాల్లో ఎండ నిప్పులు చెరిగింది. తిరుపతి జిల్లా పల్లాం, నెల్లూరు జిల్లా కసుమూరులో అత్యధికంగా 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాత్రిపూట అనేక ప్రాంతాల్లో 36 నుంచి 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



సమానత్వం అనేది బహుశా సరైనదే కావొచ్చు, కానీ భూమ్మీది ఏ శక్తి కూడా దాన్నొక వాస్తవంగా మార్చలేదు.
– హొనొరే డె బాల్జాక్

సాక్షి
గురువారం, 18 మే 2023

ప్రజాతీర్పుకు పట్టం కట్టాలి!

అణిచివేత ఎక్కువైనప్పుడు ఆగ్రహం వస్తుంది. ఎన్నికలు జరిగినప్పుడు మార్పును కోరుతూ ప్రజా సందేశాన్ని మోసుకొస్తుంది. ఆదివారం థాయిలాండ్‌లో జరిగిన ఎన్నికల ఓటింగ్ సరళి అందుకు తాజా ఉదాహరణ. సైన్యం కనుసన్నల్లో నడుస్తున్న, మరోమాటలో సైన్యమే తొమ్మిదేళ్ళుగా నడుపుతున్న ప్రభుత్వంపై ప్రజల అసంతృప్తి, ఆగ్రహం స్పష్టంగా బయటపడింది. మార్పు కోరుతూ థాయిలాండ్ ఓటర్లు తీర్పునిచ్చారు. అలా 2020లో విద్యార్థుల నేతృత్వంలో సాగిన ప్రజాస్వామ్య అనుకూల భారీ నిరసన ఉద్యమాల తర్వాత జరిగిన తొలి జనరల్ ఎలక్షన్ ఫలితం అపూర్వం. దేశ రాజకీయాల్లో మిలటరీ, రాయల్టీ ప్రాబల్యాన్ని సామాన్యులు నిరసించడం అక్కడి ప్రజాస్వామ్యవాద శక్తులకు సంతోషకరమే. ప్రపంచవ్యాప్తంగా నియంతృత్వ పాలకులందరికీ గుణపాఠమే.

6.5 కోట్ల జనాభా గల థాయిలాండ్‌లో 5.2 కోట్ల మందికి ఓటు హక్కుంది. రానున్న నాలుగేళ్ళ కాలానికి 500 స్థానాల ప్రజా ప్రతినిధుల సభకు సభ్యులను ఎన్నుకొనేందుకు ఆదివారం ఎన్నికలు జరిగాయి. సుమారు 4 కోట్ల మంది ఓటర్లు తమ ఛాయిస్ ఏమిటో చెప్పేశారు. దేశంలో ప్రధాన ప్రతిపక్షాలైన ఫ్యూథాయ్, మూవ్ ఫార్వర్డ్ పార్టీలు రెండూ అధికార పార్టీని మట్టి కరిపించాయి. ఈ ఎన్నికల్లో ప్రజాస్వామ్య అనుకూల శిబిరాలు విజయం సాధిస్తాయని ముందస్తు ప్రజాభిప్రాయ సేకరణల నుంచి ఊహిస్తున్నదే. కానీ, ఈ స్థాయి విజయం అనూహ్యం, అద్భుతమే. పట్టణప్రాంతాల్లో పట్టున్న, ప్రగతిశీల 'మూవ్ ఫార్వర్డ్' 151 స్థానాలతో అగ్రపీఠిన నిలుస్తుందని అంచనా. ప్రస్తుతం ప్రవాసంలో ఉన్న పదవీచ్యుత ప్రధానమంత్రి తక్షిణ్ శినవాత్ర తరఫున జనాకర్షక రాజకీయ పక్షమైన 'ఫ్యూథాయ్'కి 141 స్థానాలు రావచ్చని లెక్క. అయితే, అధికార శక్తులు ఈ ఫలితాలను అంగీకరించి, ఈ సంస్కరణవాద పార్టీలు ప్రభుత్వం ఏర్పరిచేలా గద్దెను అప్పగిస్తాయా అన్నదే ప్రశ్న.

గత రెండు దశాబ్దాల్లో స్వేచ్ఛగా ఎన్నికలైన ప్రతిసారీ తక్షిణ్ నేతృత్వంలోని పార్టీలు గెలుస్తూ వచ్చాయి. సైన్యం మాత్రం కోర్టు జోక్యంతోనో, తిరుగుబాట్లతోనో వారిని పదే పదే అధికారానికి దూరం పెడుతూ వచ్చింది. నిండా 36 ఏళ్ళ తక్షిణ్ కుమార్తె ఇంగ్లక్ ఇప్పుడు 'ఫ్యూథాయ్' పార్టీని నడుపుతున్నారు. అయితే, వారసత్వ రాజకీయాలతో విసిగిన లక్షలాది తొలి యువ ఓటర్లు 'మూవ్ ఫార్వర్డ్' వైపు మొగ్గడంతో, ఆ పార్టీకి ఎక్కువ సీట్లు దక్కుతున్నాయి. విదేశాల్లో చదివి, వ్యాపార నిమిత్తం తిరిగొచ్చి, సైనికపాలన, రాజరికానికి వ్యతిరేకంగా సాగిన ప్రజాస్వామ్య పోరులో పాల్గొన్న 42 ఏళ్ళ పిటా లిమ్జాయెోన్రత్‌కు ఎన్నికల్లో జనం జై కొట్టారు. ఈ నేతలిద్దరూ సైన్యానికి ఎదురొడ్డిన ధనిక వ్యాపార కుటుంబాల వారే కావడం గమనార్హం. ఇక, చిన్నాచితకా ప్రతిపక్షాలు సైతం ఈసారి మెరుగైన ఫలితాలు సాధిస్తుండడం విశేషమే. ఈ ప్రజాస్వామ్య అనుకూల పార్టీలన్నీ కలసి సంకీర్ణ సర్కార్‌గా పనిచేసేందుకు సుముఖంగా ఉన్నాయట. అలా అన్నీ ఒక తాటిపైకొస్తే సైనిక పాలన, రాచరికపు అపరిమిత అధికారాలకు చరమగీతం పాడాలన్న జనం కోరిక నెరవేరుతుంది.

కానీ, పార్టీలు అనుకున్నంత మాత్రాన జరగాలని లేదు. 2019 ఎన్నికల్లో నేటి 'మూవ్ ఫార్వర్డ్' పార్టీ ముందస్తు రూపం 'ఫ్యూచర్ ఫార్వర్డ్' మూడోస్థానంలో నిలిచింది. తీరా పార్టీ సారథిని ఎంపీగా అనర్హుడిగా ప్రకటించారు. పార్టీ రద్దయింది. ఇప్పుడు ప్రధాని కావాలని ఆశిస్తున్న 'మూవ్ ఫార్వర్డ్' నేత పిటాకు సైతం ఎన్నికైన ఎంపీల మద్దతుతో పాటు సైన్యం నియమించిన సెనేటర్ల మద్దతు అవసరం. ఎన్నికల్లో గెలిచినా సరే ప్రభుత్వ ఏర్పాటుకు ఇతరుల మద్దతు అవసరం కావడమే థాయ్‌లోని విచిత్రం. ఇదంతా ఎన్నికల్లో గెలిచిన పార్టీల అధికారాన్ని సైతం తటస్థీకరించేలా, సెనేట్‌ను నియమిస్తూ 2017లో రాజ్యాంగాన్ని సైన్యం తిరగరాసిన ఫలితం. 2014లో జనరల్ ప్రయూత్ చాన్ – ఓచా అప్పటి పౌరప్రభుత్వాన్ని పడదోసి, సైన్యం, రాయలిస్ట్ పార్టీలు, రాచరికపు అండతో తనను తాను ప్రధానిగా నియమించుకున్నారు. న్యాయవ్యవస్థ సహా అన్నిటినీ విధేయులతో నింపేశారు.

ఇటు నిరుపేద థాయ్‌లను ఆకర్షించే ఫ్యూథాయ్ పార్టీ అన్నా... అటు నిర్బంధ సైనిక శిక్షణ, రాజు – రాణులను పల్లెత్తు మాటన్నా 15 ఏళ్ళ దాకా జైల్లోకి నెట్టే కఠినమైన 'లెస్–మాజెస్టీ' చట్టాలకు చరమగీతం పాడతానంటున్న మూవ్ ఫార్వడ్ పార్టీ అన్నా... సహజంగానే సైన్యానికి గిట్టదు. కానీ, రాచరిక అనుకూల చట్టాలను మారుస్తానంటున్న పార్టీకి నవతరం థాయ్ ప్రజలు జేజేలు పలకడం ఈ ఆగ్నేయాసియా దేశంలో ప్రజాస్వామ్య మార్పు పవనాలకు సూచన. ఇది గ్రహించి సంప్రదాయ శక్తులు పట్టు సడలిస్తాయా? జనం ఎన్నుకున్న 500 సభ్యుల ప్రతినిధుల సభతో పాటు పాలక సైనిక వర్గమే నియమించిన 250 మంది సభ్యుల సెనేట్‌కూ ప్రధాని ఎంపికలో ఓటు ఉండడమే విషాదం. అంటే ఎన్నికల్లో పెల్లుబికిన ప్రజాస్వామ్య వెల్లువను సైతం సైన్యం పరోక్షంగా తొక్కేసే ముప్పుంది.

ఇన్నేళ్ళుగా దేశాన్ని తమ కబంధ హస్తాల్లో ఉంచుకున్న సైనిక జనరల్స్ తాజా ప్రజా తీర్పును గౌరవించాలి. అధికారాన్ని గెలిచిన పార్టీలకు అప్పగించి, సైనిక విధులకు పరిమితం కావాలి. ఆ పని చేయక, ప్రజాకాంక్షలకు విరుద్ధంగా వ్యవహరిస్తే అది థాయిలాండ్‌కే మంచిది కాదు. పొరుగునే మయన్మార్‌లో 2020 నవంబర్ ఎన్నికల్లో ఆంగ్‌సాన్ సూకీ అఖండ విజయం సాధించినా, మూడునెలల్లో సైన్యం అధికారం హస్తగతం చేసుకొని, ఎన్నికల ఫలితాన్ని రద్దు చేసింది. ఇప్పుడు అంతర్యుద్ధంతో అల్లాడుతున్న ఆ దేశంలా థాయ్‌లాండ్ తయారు కాకుండా ప్రపంచ దేశాలూ జాగరూకత వహించాలి. అప్పుడే థాయ్ ప్రజలు గెలిచినట్టు, అక్కడ ప్రజాస్వామ్యం నిలిచినట్టు!

కర్ణాటక ఫలితాన్ని ఎలా చూడాలి?



మల్లెపల్లి లక్ష్మయ్య

కర్ణాటక శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచింది అనడం కన్నా బీజేపీ ఓడింది అనడం కరెక్టు. ఎందుకంటే కాంగ్రెస్‌ది సంపూర్ణ విజయం అనుకోలేం. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని వద్దనుకున్నవాళ్లు కాంగ్రెస్, జేడీ(ఎస్) మధ్య ఎటూ తేల్చుకోలేకపోయారు. ఈసారి మాత్రం కాంగ్రెస్ వైపు వచ్చారంతే! ఇప్పటికీ కర్ణాటకలో బీజేపీ బలమేమీ తగ్గలేదు. కానీ విడిపోయిన ప్రజలను ప్రతిపక్షం వైపు నిలబడేటట్టు చేసి, తన ఓటమిని తానే రాసుకుంది బీజేపీ. కాంగ్రెస్ పార్టీ ఆర్థిక విధానాలకూ, బీజేపీ అమలు చేస్తున్న విధానాలకూ మౌలికమైన తేడా లేదు. దేశంలో నెలకొన్న అన్ని విషయాలపైనా, ప్రజల క్షేమం, సంక్షేమం, సమగ్రాభివృద్ధి అనేవి కాంగ్రెస్ ఆశయాలైతే, వాటికి అనుగుణమైన విధానాన్ని ప్రకటించాలి.

ఇది ప్రజా విజయం. అధికార భారతీయ జనతా పార్టీ ఓటమి. ఇదే ఇటీవల కర్ణాటకలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల సారాంశం. అంతేగానీ, ఇది కేవలం కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ విజయమనుకుంటే పొరపాటు. ఇది దేశ వ్యాప్తంగా రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పునరావృతమవుతుందనుకుంటే అంతకన్నా పొరపాటు. అయితే, ఈ ఎన్నికల ఫలితాల వల్ల అంచనాలు తారుమారయ్యే అవకాశం మాత్రం ఉంది.

మొదటిగా, ప్రజల విజయం విషయానికి వస్తే– గతంలో జరిగిన ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీని కాదనుకున్నవాళ్ళు జనతాదళ్ (ఎస్)కు, కాంగ్రెస్‌కు మధ్యలో నిలిచిపోయారు. ఈ ఎన్నికల్లో వాళ్ళు తెలివిగా చాలా చోట్ల జనతాదళ్(ఎస్)ను పక్కన పెట్టి, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారు. భారతీయ జనతాపార్టీకి వ్యతిరేకంగా జేడీ(ఎస్), కాంగ్రెస్ పోటీలో ఉంటే, బీజేపీని కాదనుకున్న వాళ్ళు కాంగ్రెస్ వైపు మొగ్గారు. గత ఎన్నికల్లో జేడీ(ఎస్) 37 సీట్లలో విజయం సాధిస్తే, ప్రస్తుత ఎన్నికల్లో అది 19కి పడిపోయింది. అంటే సగానికి దిగజారిందని అర్థం. దీనికి కారణం, ప్రజల చతురత తప్ప మరొకటి కాదు. మూడు, నాలుగు పార్టీలు పోటీలో ఉన్న రాష్ట్రాల్లో ప్రజలు అనుసరించడానికి ఇది ఒక నమూనా.

ఉదాహరణకు, ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ చాలా బలంగా ఉన్నట్టు మనం భావిస్తున్నాం. ఎందుకంటే, పార్లమెంటు ఎన్నికల్లో, శాసనసభ ఎన్నికల్లో బీజేపీ అధికారాన్ని రెండుసార్లు నిలబెట్టుకుంది. అది కూడా అత్యంత అధిక సంఖ్యలో. అక్కడ నాలుగు పార్టీలు పోటీ పడుతున్నాయి. అందులో గత ఎన్నికల్లో బహుజన సమాజ్ పార్టీ చాలా బలహీనపడింది. కాంగ్రెస్ కూడా అంతంత మాత్రంగానే తన ఉనికిని చాటగలిగింది. అయితే అఖిలేశ్ యాదవ్ నాయకత్వంలోని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) బలమైన ప్రతిపక్షంగా నిలిచింది. 2017లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో బీజేపీ 312 సీట్లు గెలుచుకోగా, 2022లో దాని బలం 255కు పడిపోయింది. సమాజ్‌వాదీ పార్టీ 2017 ఎన్నికల్లో 47 స్థానాలకు పరిమితం కాగా, 2022లో 111 స్థానాలకు తన బలాన్ని పెంచుకున్నది. అంటే క్రమంగా సమాజ్‌వాదీ పార్టీ ఉత్తరప్రదేశ్‌లో బీజేపీకి బలమైన ప్రతిపక్షంగా ఎదుగుతోంది. మిగతా రెండు పార్టీల పరిస్థితిని చూస్తే, ఇది మనకు అర్థం అవుతుంది. కాంగ్రెస్ పార్టీ 2017 ఎన్నికల్లో 7 స్థానాల్లో గెలిచి, 6.25 శాతం ఓట్లను సాధించుకుంటే, 2022 ఎన్నికల్లో రెండు సీట్లకు పరిమితమై పోయి, 2.33 శాతం ఓట్లను మాత్రమే పొందగలిగింది. బహుజన్ సమాజ్ పార్టీ 2017 ఎన్నికల్లో 22.23 శాతం ఓట్లను సంపాదించి, 19 స్థానాల్లో విజయం సాధించింది. అయితే 2022 ఎన్నికల్లో ఓట్ల శాతం 12.88కి పడిపోగా, కేవలం ఒక్క స్థానానికే పరిమితం కావాల్సి వచ్చింది. కాంగ్రెస్, బీఎస్పీ క్రమంగా తమ రాజకీయ బలాలను కోల్పోతున్నట్టు కనిపిస్తున్నది. ఒకవేళ అక్కడ బీజేపీని ఓడించాలనుకునే ప్రజలు సమాజ్ వాదీ

కొత్త కోణం



పార్టీవైపే మొగ్గితే భారతీయ జనతాపార్టీ ఉత్తరప్రదేశ్‌లో తన ప్రాధాన్యతను కోల్పోవాల్సి వస్తుంది. అంటే జాతీయస్థాయి ఎన్నికల్లో కూడా బీజేపీ తన ఆధిపత్యాన్ని వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడక తప్పదు. దానికి ఉదాహరణగా సీట్లు మాత్రమే కాదు, ఓట్ల శాతాన్ని కూడా చూడాలి. సమాజ్‌వాదీ పార్టీ 2017 ఎన్నికల్లో 21.82 శాతం ఓట్లను పొందితే, 2022 ఎన్నికల్లో అది 32.06 శాతానికి పెరిగింది. అంటే దాదాపు పది శాతానికి పెరిగింది. కాంగ్రెస్, బహుజన సమాజ్‌వాదీ పార్టీలు ప్రజాదరణ కోల్పోతున్నట్లు, సమాజ్‌వాది పార్టీ వైపు ప్రజలు వెళుతున్నట్లు అర్థం చేసుకోవచ్చు.

ఇక రెండో విషయం, బీజేపీ ఓటమి: నిజానికి కర్ణాటక రాష్ట్ర చరిత్రలో ఇప్పటికీ ఒకే పార్టీ రెండు పర్యాయాలు అధికారంలోకి రాలేదు. 1985 నుంచి ఇదే చరిత్ర పునరావృతమవుతూ ఉంది. 1985 వరకు కర్ణాటకలో కాంగ్రెస్ పాలన కొనసాగింది. 1985లో మొదటిసారిగా జనతాపార్టీ నాయకత్వంలో రామకృష్ణ హెగ్డే ప్రభుత్వం ఏర్పాటయ్యింది. ఇదే మొదటి కాంగ్రెసేతర ప్రభుత్వం.1994లో జనతాదళ్ 227 సీట్లతో అధికారంలోకి వచ్చింది. 1999లో కాంగ్రెస్, 2004లో జనతాదళ్ సంకీర్ణ ప్రభుత్వం, 2008లో బీజేపీ ప్రభుత్వం, 2013లో మళ్ళీ కాంగ్రెస్, 2018లో మళ్ళీ బీజేపీ అధికారాన్ని అందుకున్నాయి. ఇప్పుడు కాంగ్రెస్ గెలిచింది. ఇది కర్ణాటక అసెంబ్లీ చరిత్ర. కర్ణాటక ప్రజలు 1985 నుంచి ఇప్పటి వరకు ఒకే పార్టీకి రెండవసారి అధికారం కట్టబెట్టలేదు. అయితే బీజేపీ ఈ చరిత్రను తిరగరాయాలని ఉవ్విళ్ళూరింది. అది ప్రజల మధ్య, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టాలని చూసింది. సూటిగా చెప్పాలంటే ముస్లింల మీద వ్యతిరేకతను రెచ్చగొట్టి, మిగతా ప్రజలందరినీ తమవైపు తిప్పుకోవాలని చూసింది. అందులో భాగంగానే హిజాబ్, అజాన్, ఉమ్మడి సివిల్ కోడ్, పశుసంరక్షణ పేరుతో దాడులు, ఒక రకంగా, ఉత్తర ప్రదేశ్‌లో అనుసరించిన అన్ని విధానాలను ఇక్కడ అమలు చేయాలని శతవిధాలుగా ప్రయత్నించింది. కానీ ఆ విషయాలేవీ కర్ణాటక ప్రజలు పట్టించుకోలేదనడానికి ఈ ఫలితాలే నిదర్శనం.

ఇది మతాల మధ్య విభజన అయితే – ఇక కులాల మధ్య ముఖ్యంగా ఎస్సీలలో ఉన్న వ్యత్యాసాలను ఉపయోగించుకొని మాదిగల ఓట్లను పొందడం కోసం రిజర్వేషన్ల విభజనను తెరపైకి తీసుకొచ్చింది. అదికూడా ఫలించలేదు. తన ఆర్థిక, సామాజిక కార్యక్రమాలు, అభివృద్ధి పనులను చూపించుకోవడం కాకుండా, ఇటువంటి విభజనతో తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలనుకున్నది. ఇప్పటికీ కర్ణాటకలో బీజేపీ బలమేమీ తగ్గలేదు. కానీ విడిపోయిన ప్రజలను ప్రతిపక్షం వైపు నిలబడేటట్టు చేసి, తన ఓటమిని తానే రాసుకుంది బీజేపీ.

మూడో విషయం, కాంగ్రెస్ గెలుపు: ఇది బీజేపీ ఓడిపోయి, అందించిన గెలుపు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులైన శివకుమార్, సిద్ధరామయ్య ఐక్య కృషి తోడైనప్పటికీ తనకు తాను గెలిచిన గెలుపు కాదిది. ఎందుకంటే, పదేళ్ళ కిందట దేశంలో అధికారం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ ఆర్థిక విధానాలకూ, ఇప్పుడు బీజేపీ అమలు చేస్తున్న విధానాలకూ మౌలికమైన తేడా లేదు. అయితే ఇటీవల ఆ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ మాట్లాడుతున్న మాటలు గత కాంగ్రెస్ విధానాలకు భిన్నంగా ఉన్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, అదే విధంగా కార్పొరేట్ల గుత్తాధిపత్యం మీద రాహుల్ చేస్తున్న విమర్శల్లో ఆ మార్పును చూడవచ్చు. కానీ అవి పార్టీ విధానంగా ప్రకటించాలి. అదే విధంగా గతంలో తాము అనుసరించిన ఆర్థిక, రాజకీయ విధానాల పైన ఆత్మవిమర్శ చేసుకోవాలి. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా అంబానీలను ఆకాశానికెత్తిన విషయాన్ని గుర్తు చేసుకొని సవరించుకోవాల్సిన బాధ్యత ఆ పార్టీపై ఉంది. అదే విషయంపై కొన్ని విషయాల్లో వ్యతిరేకించిన జైపాల్‌రెడ్డి లాంటి నాయకులు పదవులు కోల్పోవాల్సి వచ్చింది. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. అదే సంవత్సరంలో రాజీవ్ గాంధీ లాంటి నాయకులు అనుసరించిన హిందుత్వ అనుకూల విధానాలను సమీక్షించుకోవాలి. అయితే బీజేపీని కేవలం అధికారం కోసం మాత్రమే వ్యతిరేకించాలనే భావన ఉంటే కాంగ్రెస్ పార్టీ ఎదుగుదలను ఆశించలేం. దేశంలో నెలకొన్న అన్ని విషయాలపైనా, ప్రజల క్షేమం, సంక్షేమం, సమగ్రాభివృద్ధి అనేవి కాంగ్రెస్ ఆశయాలైతే, వాటికి అనుగుణమైన విధానాన్ని ప్రకటించాలి. కేవలం ఎన్నికల సమయంలో, లేదా ప్రతిపక్షంలో ఉన్నాం కాబట్టి ప్రభుత్వాన్ని వ్యతిరేకించాలని, ఆ తర్వాత దాని ఊసుఎత్తకపోతే, కాంగ్రెస్‌కు కర్ణాటక లాంటి గెలుపులు కష్టమనే చెప్పాలి. అందుకే ఇకనైనా కాంగ్రెస్ చేసిన తప్పులకు లెంపలేసుకొని, సరికొత్త ప్రజా మార్గాన్ని ఎంచుకోక తప్పదు.

వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు | మొబైల్: 81063 22077

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మహావీరులు



తొంభై ఏళ్ల క్రితం 1933 మే 17న మహావీర్ సింగ్‌ను అండమాన్‌లోని సెల్యులార్ జైల్లో బ్రిటిష్ వాళ్లు హింసించి చంపారు. ఆయన భగత్‌సింగ్ సన్నిహిత మిత్రుడు. భగత్, రాజ్‌గురు 1928లో శాండర్స్‌ను చంపినప్పుడు మహావీర్ కారు నడిపి వారు తప్పించుకునేలా చూశాడు. 1929లో అరెస్టయ్యాడు. అండమాన్‌లో ఖైదీలతో వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా చేపట్టిన నిరశన దీక్ష కారణంగా బ్రిటిష్ వాళ్లు మహావీర్‌తో పాటు మోహిత్ మొయిత్రా, మోహన్ కిశోర్ నామదాస్‌ల మరణానికి కారణమయ్యారు. వాళ్ల పేర్లు ఎంతమందికి తెలుసు?
– అద్వైద్, చరిత్రకారుడు

వాళ్లనేం చేస్తారు?



డియర్ (పాకిస్తాన్) జనరల్స్: (నిరసనల్లో భాగంగా) సైనిక నిర్మాణాలను లక్ష్యంగా చేసుకొని దాడి చేసిన యువతీ యువకులందరి మీదా విచారణ జరుపుతామని శపథం చేశారుగానీ దయచేసి కొంచెం వెనక్కి తగ్గి ఆలోచించండి. అసలు ఈ గందరగోళానికి నేరుగా మీ సీనియర్లు బాధ్యులు. సైనిక చట్టం కింద మీరు వాళ్లను కూడా విచారిస్తారా?
– రజా అహ్మద్ రూమీ, రచయిత

చూస్తూ ఉండాలి...



మహారాష్ట్ర రాజకీయాలు, పాకిస్తాన్ రాజకీయాలు, బీజేపీ–కాంగ్రెస్ రాజకీయాలు, క్రీడా రాజకీయాలు– ఈ విషయాలు విస్తారమైనవి. ఒక బయటి మనిషిగా ఇందులో ఎవరు సరో, ఎవరు కాదో అర్థం కాదు. నేను చేయగలిగిందల్లా వీటిని ఫాలో కావడమే.
– మానసీ నారాయణ జోషీ
పారా బ్యాడ్మింటన్ క్రీడాకారిణి

పరస్పర అభినందన



నువ్వొక పుస్తకం చదువుతున్నప్పుడు దాని రచయిత ఆ పక్కనే మనతో ప్రయాణించడం అద్భుతంగా ఉంటుంది. అదే రచయిత మన పుస్తకాన్ని చదువుతుంటే ఇక ఆ క్షణానికి విలువ కట్టలేం. (రచయిత, దౌత్యవేత్త నవతేజ్ సర్నాతో ప్రయాణిస్తున్న ఫొటో షేర్ చేశారు.)
– సంజీవ్ సన్యాల్, ఆర్థికవేత్త

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

చీకటి శిరసున సినీవాలి సిరివెన్నెల!

సందర్భం



డా॥ పైడిపాల

'సిరివెన్నెల' పేరునూ, కనీసం ఒకటైనా ఆయన సినిమా పాటనూ వినని తెలుగు వాళ్లుండరు. సిరివెన్నెల అసలు పేరు చేంబోలు సీతారామశాస్త్రి. సిరివెన్నెల చిత్రానికి 'సింగిల్ కార్డ్' పాటలతో ప్రాచుర్యం పొందిన సీతారామశాస్త్రికి ఆయనకు సినీగేయకవిగా జన్మనిచ్చిన దర్శకుడు కె.విశ్వనాథ్ వాత్సల్యంతో పెట్టిన పేరు 'సిరివెన్నెల సీతారామశాస్త్రి'. అలా 'సిరివెన్నెల' సీతారామశాస్త్రి కలం పేరుగా స్థిరపడింది. 1955 మే 20వ తేదీన మధ్యప్రదేశ్‌లోని 'శివిని' గ్రామంలో ఒక దిగువ మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన శాస్త్రి పూర్వాశ్రమంలో టెలిఫోన్ సంస్థలో చిరుద్యోగి. 'భరణి' కలం పేరుతో కవితలు రాయడం ప్రవృత్తిగా పెట్టుకొన్న శాస్త్రి సినిమాలకు పాటలు రాయాలని, రాస్తానని ఎపుడూ అనుకోలేదు.

'గంగావతరణం' గేయఖండిక ద్వారా కాకతాళీయంగా విశ్వనాథ్ దృష్టినాకర్షించిన సీతారామశాస్త్రి 'సిరివెన్నెల' చిత్రం సింహద్వారంగా సినీరంగ ప్రవేశం చేశారు. మొదటి పాటకే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి నంది పురస్కారాన్ని అందుకోవడమేగాక, వరుసగా మూడు సంవత్సరాల పాటు నంది పురస్కారాల నందుకొని 'హ్యాట్రిక్' సాధించిన ఏకైక సినీగేయకవిగా తన ప్రత్యేకతను నిరూపించుకున్నారు. అలాగే తన మూడున్నర దశాబ్దాల సినీగేయ ప్రస్థానంలో అత్యధిక (పదకొండు) నంది పురస్కారాలను, మనస్విని, కళాసాగర్, ఫిల్మ్‌ఫేర్ వంటి ఎన్నో ప్రతిష్ఠాత్మక సంస్థల నుండి అవార్డులను అందుకున్నారు. కేవలం సినిమాలకే పరిమితమైన ఏ తెలుగు సినీ గేయకవికీ లభించని 'పద్మశ్రీ' అవార్డు గౌరవాన్ని కూడా సాధించి అనితర సాధ్యమైన విజయాలను నమోదు చేసుకున్నారు. సినిమా పాట కొత్త పోకడలు పోతూ, ఎత్తు పల్లాల దారిలో ప్రయాణిస్తూ విమర్శలకు గురువుతున్న అయోమయ దశలో వేటూరి ఝంఝామారుతంలా విజృంభించి ఎల్లల్ని చెరిపివేస్తే... సిరివెన్నెల మలయమారుతంలా వేదిక మీదకు వచ్చి రసజ్ఞులకు సేద తీర్చారు.



పూర్వ సినీకవులు అనుసరించిన మార్గానికి భిన్నంగా సిరివెన్నెల ప్రేక్షకుల స్థాయిని తక్కువగా అంచనా వేయక వారిని తన స్థాయికి తీసుకొని వెళ్లడానికి ప్రయత్నించారు. కవిత్వానికి సినిమాపాటకు తేడా లేదనీ, సినిమాపాట కూడా కవిత్వమేననీ ఆయన నిశ్చితాభిప్రాయం. సినిమా పాటల్ని కూడా కవిత్వీకరించి వాటిని శుచిగా రుచిగా వడ్డించిన నైష్ఠికుడు సిరివెన్నెల. 'వాసి'కి ప్రాధాన్యమిస్తూ ఆయన రాసిన మొత్తం పాటలు సుమారు రెండు వేలు.

సీతారామశాస్త్రి సినీగేయరచనలో తొక్కిన కొత్త పుంతలకు స్ఫూర్తిప్రదాత, బహుభాషా కోవిదుడైన ఆయన తండ్రి డా॥ సీవీ యోగి. ఆయన తాత్వికత, తార్కికత, భారతీయ సనాతన ధర్మం పట్ల నిబద్ధత సిరివెన్నెలకు సాహిత్య పరంగా దిశానిర్దేశం చేశాయి. ఆ ప్రభావంతోనే సిరివెన్నెల తన మొదటిపాటలోనే విశ్వమంతా ప్రణవనాదం నుంచి ఆవిర్భవించిందనే వేదప్రామాణికమైన తత్వాన్నీ, సత్యాన్నీ ఆవిష్కరించారు. ఉపనిషత్ సారాన్ని జీర్ణించుకొని తర్కబద్ధమైన పాటల్ని రాశారనడానికి ఆయన ముందుగా రాసి ఉంచిన పాటల కోసమే తీసిన 'గాయం', 'చక్రం' వంటి చిత్రాలే ప్రత్యక్ష సాక్ష్యాలు. ఆయన తన పాటల్లో సనాతన ఆర్షధర్మానికి, భారతీయ సంస్కృతికి పెద్దపీట వేశారనడానికి 'స్వర్ణకమలం', 'శుభలగ్నం' వంటి చిత్రాల్లోని పాటలే నిదర్శనం. పై గుణాలకు తోడు పాట సంగీతం, గానం వంటివి లేకుండా విడిగా చదివినా సాహిత్యపరంగా స్వయం ప్రతిపత్తి కలిగి ఉండాలనీ, సంగీత ప్రమేయం లేకుండా మాట్లాడుకునే మామూలు భాషలో 'బోటనీ పాఠముంది' వంటి పాటల్లా వచన శైలిలో కూడా ఉండొచ్చనీ ఆయన అభిప్రాయాలు. అన్నిటికీ మించి తన పాటల్లో మనిషితనాన్ని శోధించడానికి నిరంతరం ప్రయత్నించిన 'మనిషి కవి' సిరివెన్నెల.

'నా ఉచ్ఛ్వాసం కవనం... నా నిశ్వాసం గానం' అని పాటను ప్రేమించి, శ్వాసించి, శాసించిన స్వాప్నికుడు సిరివెన్నెల. 'నా పాట పంచామృతం' అని పాటను పవిత్రంగా భావించిన సిరివెన్నెల ముద్ర ఏ విభాగానికి చెందిన పాటలలోనైనా స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన తనకు ముందుతరం కవులను గౌరవించడమే కాదు, తన నుండి స్ఫూర్తి పొందిన యువకవులను కూడా అంతగానూ ప్రోత్సహించారు. అందరిలో త్వరగా కలిసిపోవడం, అందర్నీ కలుపుకోవడం శాస్త్రి స్వభావం కనుకనే 'బాలు'లా ఆయన అందరివాడయ్యారు. ఏ రంగంలోనైనా శిఖరసమానుడైన మనిషి హఠాత్తుగా నిష్క్రమిస్తే అక్కడ ఎవరూ పూడ్చలేని శూన్యం, వెలితి ఏర్పడితే... ఆ మనిషి మనీషి, మహర్షి, సిరివెన్నెల సీతారామశాస్త్రి!

వ్యాసకర్త సినీగేయసాహిత్య పరిశోధకులు | 99891 06162
(మే 20న సిరివెన్నెల జయంతి; 19న పైడిపాల 'సిరివెన్నెల రసవాహిని', 20న చేంబోలు శ్రీరామశాస్త్రి 'పూర్ణత్వపు పొలిమేరలో' పుస్తకాల ఆవిష్కరణ)

దుంకులాడకుంటె బాగుంటది

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

పొద్దు మీకింది. మొగులు మీద చుక్కలు ఎల్లినయి. వాడకట్టుల లైటు బుగ్గలు ఎల్గినయి. గా దినం ఎప్పటి తీర్గనే ఆనంద్ బాగ్ చౌరస్త కాడ్కి బోయిన. గాడ రవి పాన్ డబ్బ ఉన్నది. గది మా దోస్తుల అడ్డ.

''కర్నాటకల కాంగ్రెస్ గెల్సింది గదా. గెలిస్తె బిజెపోల్లు ఏమంటున్నరు?'' అని యాద్గిరి అన్నడు.

''శాన మంది బిజెపి లీడర్లు మొకం సూబెడ్తలేరు. ఎలచ్చన్ల ముంగట గాల్లు సూర్ మార్ కాన్లమను కున్నరు. గని అంత ఉల్ట పల్ట అయ్యింది. బిజెపి ఓడిపోయినందుకు గాదు, ఎండలు ఎక్వ ఉండ బట్కి ఇంట్లకెల్లి ఇవుతలకు వొస్తలేము. మేము ఇవుతలకు రాకుంటె బిజెపి లీడర్లు మొకం సూబెడ్తలేరని పూజాల్ల అంటున్నరు. గీ తీర్గ అబద్దాలు మాట్లాడుడు ఏమన్న బాగున్నదా? అని గాల్లు అడుగుతున్నరు'' అని సత్నారి జెప్పిండు.

''కొందరు బిజెపి లీడర్లు ఇల్లు అల్కగనే పండ్గ గాదని ఎందుకంటున్నరు?'' అని ఇస్తారి అడిగిండు.

''కర్నాటక ఎలచ్చన్ల మేమందరం ఒక్కటే. మాదాంట్ల గ్రూపులు లెవ్వు అని కాంగ్రెస్ లీడర్లు అన్నరు. గాల్ల మాటలను బరోస జేసి జెనం కాంగ్రెస్‌ను గెలిపిచ్చింండ్రు. గెల్సినంక నాకు ముఖ్యమంత్రి కుర్సి గావాలంటె నాకు ముఖ్యమంత్రి కుర్సి గావాలని సిద్దరామయ్య, డికె శివకుమార్ అన్నరు. గీల్లిద్దరి చెంచగాల్ల నడ్మ పోస్టర్ విద్దం గుడ్క నడ్సింది. ఆపరేషన్ తామర పువ్వుతోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలను మా దిక్కు గుంజుతం. మహారాష్ట్రల జేసిన తీర్గ జేస్తం అని బిజెపోల్లు అన్నరు.''

''అంటె ఉద్దవ్ టాక్రె సర్కార్‌ను కూలగొట్టిన తీర్గనా?''

''అవ్''

''కర్నాటకల కాంగ్రెస్ గెలిస్తె తెలంగానల ఉన్న పార్టీలు ఏమనుకుంటున్నయి. బిజెపి ఏమనుకుంటున్నది?''

''ఒక్క రాష్ట్రంల కాంగ్రెస్ గెలిస్తె ఏమైతది. పదిహేను రాష్ట్రాలల్ల మా సర్కారున్నది. ఇయ్యాలేపు పోరగాల్లకు పెండ్లి అవుడు కష్టమైతున్నది. పెండ్లి గానోల్లకు పెండ్లి జేపిస్తమని జెప్తం. తామరపూలు చెవుల బెట్టేటి కొల్వులిస్తం. జై బజరంగ బలీ అంటం. గివన్ని మన మేనిఫెస్టోల బెట్టాలని తెలంగాన బిజెపి అనుకుంటున్నది.''

''కాంగ్రెస్ ఏమనుకుంటున్నది?''

''ఒక్క మెత్కును సూస్తె సాలు బువ్వ ఉడికిందో లేదో ఎర్కజేస్కునే తందుక్క. కర్నాటకల గెల్సినం. రేపొద్దు గాల్ల దేసమంతట గెలుస్తం. మా సర్కార్ గిన్నొస్తె ఆపీస్‌లల్ల మందు గొట్టెతందుక్క మొక ఇస్తమని జెప్పుమనాలె. గట్ల జేస్తిమా అంటె మన సర్కార్ ఆమ్దాని బెర్గుతదని జెప్పాలె. గా ఆమ్దానితోని సదుకున్న పోరగాల్లకు కొల్వులు ఇయ్యొచ్చు. మోదీ జై బజరంగ్ బలీ అంటె హన్మంతుడు తోక తోని గొట్టిండు. బిజెపి బజ్‌రంగ్ బలీ అంటె మనోల్లు జైశ్రీరామ్ అనాలె. బిజెపోల్లకు జైశ్రీరామ్ అనే మొక ఇయ్యొద్దు అని కాంగ్రెస్ లీడర్లు అనుకోబట్టింండ్రు'' అని సత్నారి చెప్పిండు.

''కర్నాటకల జెడిఎస్ గెలుస్తదనుకుంటిమి...'' అని యాద్గిరి ఇంకేమొ జెప్పబోతుంటె– ''కర్నాటకల జెడిఎస్ ఎట్ల గెలుస్తది. ఎట్ల సర్కార్ దెస్తది?'' అని సత్నారి.

''గెల్సుడంటె కింగ్ మేకర్ అవుడు. గని గా పార్టికి పందొమ్మిది సీట్లే వొచ్చినయి. జెనం గా పార్టి గాలి దీసింండ్రు. జెడిఎస్ కింగ్ మేకర్ అయితె కుమార స్వామి ముఖ్యమంత్రి అయినా గావొచ్చు. గప్పుడు మనం చెక్రం దిప్పొచ్చు. మన గాలి నడుస్తది అని బీఆర్ఎస్ లీడర్లు అనుకున్నరు.''



''గట్ల గాలేదు గదా.''

''అవ్, గాల్లు ఒకటనుకుంటె ఒకటైంది. తెలంగాన బార్డర్‌ల ఉన్న కర్నాటక జిల్లలల్ల గుడ్క బిఆర్ఎస్ పతార లేదు. ఇప్పటి దాంక ఒక్క తీర్గ దుంకులాడినం. ఇగ కొన్ని దినాలు దుంకకుంటె బాగుంటది. ముందుగాల్ల మన రాష్ట్రం సంగతి జూస్కోవాలె. కర్నాటకల అయిన తీర్గ గీడ గుడ్క అయితె ఎట్ల. మహారాష్ట్ర సంగతి గూడ కొన్ని దినాలు పక్కకు బెట్టాలని బీఆర్ఎస్ లీడర్లు అనుకున్నరు.''

''గీ నడ్మ పవన్ కల్యాణ్ సిఎం రేస్ల లేను అన్నడు. లెక్కలు మాట్లాడిండు. పోయిన ఎలచ్చన్ల నల్పై సీట్లు వొచ్చి వుంటె ముఖ్యమంత్రి కుర్సి అడిగెటోన్ని అన్నడు. పవన్ తెలుగు దేసంతోని పొత్తు బెట్టుకోని చెంద్రబాబును ముఖ్యమంత్రిని జెయ్యాలని జూస్తున్నడు. వెన్నుపోటును చెంద్రబాబు తాన నేర్సుకొని జనసైనికులకు వెన్నుపోటు పొడ్వాలని సూస్తున్నడు. గిదే మాటను రాంగోపాల్ వర్మ అన్నడు. గా నడ్మ అంబటాల నీడ రొండు నిముసాలు ఎందుకు కండ్లబడలేదు?''

''జెనాలకు లీడర్లు నిలువ నీడ లేకుంట జేస్తున్నందుకు.'' గీ తీర్గ మా దోస్తులు ముచ్చట బెట్టింండ్రు.

రచయిత సీనియర్ జర్నలిస్ట్ | 99591 50491

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, తిథి: బ.చతుర్దశి రా.9.20 వరకు, తదుపరి అమావాస్య, నక్షత్రం: అశ్విని ఉ.7.20 వరకు, తదుపరి భరణి, వర్జ్యం: సా.4.53 నుండి 6.29 వరకు, దుర్ముహూర్తం: ఉ.9.48 నుండి 10.38 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.46 వరకు; రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు, యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు, సూర్యోదయం: 5.47, సూర్యాస్తమయం: 6.37.

క్లుప్తంగా...

పట్టణ ఓటర్లలో నిరాసక్తత తొలగించాలి


వికాస్ రాజ్


సాక్షి, హైదరాబాద్: ఓటు హక్కు వినియోగించుకోవడంలో పట్టణ ప్రాంత ఓటర్ల నిరాసక్తతను తొలగించడానికి విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) వికాస్ రాజ్ ఆదేశించారు. జీహెచ్ఎంసీ, పరిసర ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెంచడానికి ఉధృత ప్రచారోద్యమం నిర్వహించాలని కోరారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల ఎన్నికల అధికారుల(డీఈఓ)ను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెంపుదలపై బుధవారం ఆయన తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాలోని ఇంటి నంబర్లు, ఓటర్ల వివరాలను పరిశీలించాలని సూచించారు. అర్హులైన ఓటర్లకు నష్టం కలగకుండా అనర్హులను జాబితాల నుంచి తొలగించాలని ఆదేశించారు.

ఐఐడీఎల్‌ను సందర్శించిన ఈటల



సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్ర పర్యటనలో ఉన్న బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ థానేలోని ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రటిక్ లీడర్‌షిప్ (ఐఐడీఎల్) సంస్థను సందర్శించారు. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ అధ్యక్షతన దీనిని నిర్వహిస్తున్నారు. యువతకు రాజకీయాలు, పాలన, విధాన రూపకల్పనలో శిక్షణను అందించే సంస్థగా దీనికి పేరుంది. బుధవారం ఈ సంస్థలో నిర్వహించిన మోడల్ పార్లమెంట్‌లో ఈటల సభాపతిగా కార్యకలాపాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణలో పాటు దేశంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులు, పరిణామాల గురించి విద్యార్థులకు ఈటల మార్గనిర్దేశం చేశారు. 13 రాష్ట్రాల నుంచి 30 మంది విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. మోడల్ పార్లమెంట్ సందర్భంగా విద్యార్థులు నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్ఆర్‌సీ) బిల్లు ఆమోదించారు. దీంతో పాటు పార్లమెంట్ మోడల్ సెషన్‌లో బడ్జెట్‌పై చర్చించి, ఫైనాన్స్ బిల్లును ఆమోదించారు. మోడల్ పార్లమెంట్‌లో భాగంగా ఆయా అంశాలపై జరిగిన చర్చ, అందుకు విద్యార్థులు సంసిద్ధమైన తీరు అభినందనీయ మని ఈటల పేర్కొన్నారు.

బీజేపీని అడ్డుకునేందుకే బీఆర్ఎస్‌తో దోస్తీ: కూనంనేని



సాక్షి, మహబూబాబాద్: బీజేపీని పాతరేసేందుకే బీఆర్ఎస్‌తో దోస్తీ కట్టామని, అయినా కేసీఆర్ పద్ధతిలో మార్పు రావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో బుధవారం జరిగిన పార్టీ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. మతోన్మాదంతో ప్రజల్లో అభద్రతాభావం కల్పిస్తున్న బీజేపీని ఓడించాలన్నదే తమ లక్ష్యమన్నారు. అయితే ఇందుకోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆశించిన స్థాయిలో ముందుకు వెళ్లడం లేదన్నారు. ప్రజలతో సమన్వయం చేసుకోవడంలో వెనకబడ్డారని, ఆయన పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. కర్ణాటక ఎన్నికల తర్వాత బీజేపీ ముగిసిన కథన్నారు. తెలంగాణలోనూ తిట్ల దండకం తప్ప బీజేపీకి బలమే లేదని తెలిపారు. దీంతో రాబోయే ఎన్నికల్లో ఈవీఎంల మానిప్యులేషనే లక్ష్యంగా బీజేపీ ముందుకెళ్తోందన్నారు. పొత్తుల విషయం ఎన్నికలవరకు ఆలోచిస్తామన్నారు.

తెల్లారిన బతుకులు

- ఏపీలో ఆటోను లారీ ఢీకొని ఆరుగురు కూలీల దుర్మరణం
- 8 మందికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం
- పల్నాడు జిల్లాలో పొందుగల వద్ద ప్రమాదం
- మృతులంతా తెలంగాణకు చెందిన వారే


ప్రమాదానికి గురైన ఆటో

దాచేపల్లి: ఏపీలోని పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పొందుగల గ్రామంలో బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్ర మాదం జరిగింది. కూలీలతో వెళ్తున్న ఆటోను ఎదురుగా అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఆటోలో ప్రయాణిస్తు న్న ఆరుగురు కూలీలు దుర్మరణం పాలయ్యారు. ఎనిమిదిమంది గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల కథనం మేరకు.. తెలంగాణలోని నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం నర్సాపురానికి చెందిన 13 మంది వ్యవసాయ కూలీలు మిర్చి పనుల నిమిత్తం ఆటోలో పల్నాడు జిల్లా గురజాల మండలం పులిపాడుకు వస్తున్నారు. ఏపీ సరిహద్దు గ్రామమైన పొందుగల పాత పంచాయతీ కార్యాలయం వద్దకు వేకువజామున 4.45 గంటలకు ఆటో చేరుకుంది. పిడుగురాళ్ల వైపు నుంచి హైదరాబాద్ వెళ్తున్న తమిళనాడుకు చెందిన లారీ.. అక్కడ ఆగి ఉన్న ధాన్యం లారీని క్రాస్ చేస్తూ అతివేగంగా ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొంది. ఆటోలో ఉన్న కూలీలు మాలోతు కవిత (38), ఇస్లావత్ మంజుల (26), భూక్యా పద్మ (28), భూక్యా సోని (55), వడ్త్యా సక్రి (40) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. తీవ్రంగా గాయపడిన ఇస్లావత్ పార్వతి (40) మిర్యాలగూడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది.

ప్రమాదంపై సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి

మృతుల కుటుంబాలకు రూ.ఐదు లక్షల పరిహారం

సాక్షి, హైదరాబాద్: పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పొందుగుల వద్ద రోడ్డు ప్రమాదంలో నల్లగొండ జిల్లా నర్సాపురం గ్రామానికి చెందిన ఆరుగురు గిరిజన కూలీలు మరణించడం, పలువురు గాయపడటం పట్ల సీఎం కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులకు తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావును ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, క్షతగాత్రులకు రూ.లక్ష ఎక్స్‌గ్రేషియాను సీఎం కేసీఆర్ ప్రకటించారు.

నుజ్జునుజ్జయిన ఆటో: ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జు కావటంతో మృతుల శరీరాల్లోకి ఇనుప రాడ్లు, చువ్వలు దూసుకెళ్లాయి. ప్రమాదంపై చుట్టుపక్కలవారు పోలీసులకు సమాచారం అందించారు. ఆటో డ్రైవర్ మాలవత్ వాగ్యనాయక్, కూలీలు మాలవత్ దేవి, మాలవత్ సునీత, మాలవత్ భారతి, మాలవత్ అంబాలి, మాలవత్ పద్మ, మాలవత్ లాలి మిర్యాలగూడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఇస్లావత్ పార్థును మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు. వీరిలో వాగ్యనాయక్, ఇస్లావత్ పార్థు పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదస్థలాన్ని గురజాల డీఎస్పీ పల్లపు రాజు, సీఐ షేక్ బి లాలుద్దీన్ పరిశీలించారు. మృతదేహాలకు గురజాల ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. ప్రమాదానికి కారణమైన లారీని తెలంగాణలోని నిజామాబాద్ వద్ద పోలీసులు పట్టుకుని లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

నర్సాపురం శోకసంద్రం

- ఏపీలో జరిగిన రోడ్డు ప్రమాదంతో మృతుల గ్రామంలో విషాదఛాయలు

మిర్యాలగూడ: మిరపకాయలు ఏరేందుకు వెళ్లిన కూలీల బతుకులు అక్కడే తెల్లారిపోవడం కలచివేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం పొందుగుల వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం నర్సాపురానికి చెందిన ఆరుగురు కూలీలు మృతిచెందడంతో వారి స్వగ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. పోస్టుమార్టం అనంతరం ఆరుగురి మృతదేహాలను సాయంత్రం స్వగ్రామానికి తీసుకురాగా కుటుంబసభ్యులు, బంధుమిత్రుల రోదనలు మిన్నంటాయి. మృతులంతా కూలి చేసుకుంటూ పొట్టపోసుకుంటున్న వారే. బుధవారం రాత్రి నిర్వహించిన వీరి అంత్యక్రియల్లో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

తల్లిని కోల్పోయిన పిల్లలు..



ప్రమాదంలో మృతిచెందిన ఇస్లావత్ మంజుల (26)ది నిరుపేద కుటుంబం. భర్త ట్రాక్టర్ డ్రైవర్. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మంజుల కూలి పనులకు వెళ్లేది. మంజుల మృతిచెందడంతో పిల్లలు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

పిల్లలకు పెళ్లి సంబంధాలు చూస్తూ..



గ్రామానికి చెందిన వడ్త్యా సక్రి (40)కి ఇద్దరు పెళ్లీడుకు వచ్చిన కూతుళ్లు ఉన్నారు. వారికి వివాహాలు చేయాలని సంబంధాలు కూడా చూస్తున్నారు. ఇంతలోనే తల్లి మృతిచెందడంతో ఆ యువతులు కన్నీరుమున్నీరవుతున్నారు. సక్రి భర్త సక్రు దివ్యాంగుడు కావడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. కూలి పనులకు వెళ్తున్న సక్రినే కుటుంబ బాధ్యతలను చూసుకుంటోంది. సక్రి మృతితో కుమార్తెలు, దివ్యాంగుడైన భర్త జీవనం అగమ్యగోచరంగా మారింది.

ఏడాది క్రితం భర్త మృతి.. ప్రస్తుతం భార్య కూడా...



ఆటో ప్రమాదంలో మృతిచెందిన భూక్యా సోని(55)కి నలుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సోని భర్త మాంజ్యా ఏడాది క్రితం మృతిచెందగా ప్రస్తుతం సోని చనిపోయింది. ఐదుగురికీ వివాహం కాగా, సోని కుమారుడి వద్ద ఉంటోంది. రోజుమాదిరిగానే బుధవారం ఇంటి నుంచి బయలుదేరిన అరగంటకే ఆమె మృత్యువాత పడింది. మిర్చి ఏరడానికి వెళ్లవద్దంటూ వారించినా వినలేదంటూ కుటుంబసభ్యులు విలపించారు.

సోదరుడి వివాహానికి వెళ్లాల్సి ఉండగా..: గ్రామానికి చెందిన ఇస్లావత్ పార్వతి (40) బుధవారం సాయంత్రం మండలంలోని కల్లెపల్లిలో సోదరుడి వివాహ వేడుకకు హాజరుకావాల్సి ఉంది. కూలీ కి వెళ్లి సాయంత్రం వస్తానని చెప్పి కానరానిలోకాలకు వెళ్లిపోయింది. పనికి వెళ్లి వచ్చి పెళ్లికి హాజరవుతావనుకుంటే విగతజీవిలా వస్తావా అంటూ కుటుంబసభ్యులు, బంధువులు రోదించారు. ఈమెకు కొడుకు, కూతురు ఉన్నారు. భర్త వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు.



కూతురు మృతి... తల్లి ఆస్పత్రిలో..



భూక్యా పద్మ(28) ప్రమాదంలో మృతి చెందగా, ఆమె తల్లి మునావత్ లాలి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పద్మకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. నిత్యం తల్లితో కలిసి పనుల కోసం ఏపీకి వెళ్లేది. భర్త కిరాణ దుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఆమె మృతితో కుటుంబభారం మరింత కష్టంగా మారింది.

రెక్కల కష్టంతోనే..



రెక్కల కష్టంతోనే భార్యాభర్తలు కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ప్రమాదంలో మృతిచెందిన మాలోతు కవిత(38)కు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. వీరిలో ఓ కూతురుకు పెళ్లి చేసింది. ఇద్దరికి వివాహం చేయాల్సి ఉంది. పని చేస్తేనే పూట గడవడం కష్టంగా ఉన్న తరుణంలో తల్లి మృతితో కుటుంబ పోషణ భారంగా మారిందని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

సీపీఐ నేత ఈర్ల నరసింహ కన్నుమూత

- పార్టీ అగ్రనేతలు సురవరం, నారాయణ, కూనంనేని సంతాపం



సాక్షి, హైదరాబాద్: సీపీఐ సీనియర్ నాయకుడు, పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శివర్గ సభ్యుడు ఈర్ల నరసింహ(72) బుధవారం ఉదయం హైదరాబాద్ హస్తినాపురంలోని గాయత్రి ఆసుపత్రిలో కన్నుమూశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఈర్ల నరసింహ డిగ్రీ పూర్తి కాగానే కమ్యూనిస్టు పార్టీలో పూర్తిస్థాయి కార్యకర్తగా చేరారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బిజినేపల్లి మండలం వెలుగొండ గ్రామంలో పాలేర్లను కూడగట్టి వారికిచ్చే జీతం పెంచాలని పోరాటం చేశారు. 1980 నుంచి 2009 వరకు వరుసగా సర్పంచ్, ఎంపీటీసీ సభ్యునిగా పనిచేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పార్టీ కార్యదర్శిగా 17 ఏళ్లు పనిచేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కూడా సేవలందించారు. ఆయనకు భార్య సరోజనమ్మ, నలుగురు కుమారులు ఉన్నారు. గురువారం సాయంత్రం తమ స్వగ్రామం వెలుగొండలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.


ప్రముఖుల సంతాపం..

ఈర్ల నరసింహ మృతి బాధాకరమని సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి పేర్కొన్నారు. వెలుగొండలో భూస్వామ్య దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పెద్ద పోరాటం చేశారన్నారు. ఆయన మృతి పట్ల సంతాపం ప్రకటించారు. నరసింహ మృతి పట్ల సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రగాఢ సంతాపాన్ని తెలియశారు. ఈర్ల నరసింహ మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు.

ఇద్దరిని బలిగొన్న సెల్ఫీ సరదా

- గోదావరిలో మునిగి మృతి
- మృతులు నిర్మల్ జిల్లా కేంద్రంలోని పురాణిపేట్ వాసులు


అబ్దుల్ ఫహీం


అబ్దుల్ బార్

బాల్కొండ: నీటి అంచున సెల్ఫీ దిగాలన్న ఓ యువకుడి సరదా అతనితో పాటు మరొకరిని బలిగొన్నది. నిర్మల్ జిల్లా కేంద్రంలోని పురాణిపేట్‌కు చెందిన అబ్దుల్ ఫహీం (50) తన మరదలు కుమారుడు అబ్దుల్ బార్ (23), తన కుమారుడు అబ్దుల్ సాద్‌తో కలిసి బుధవారం నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ సందర్శనకు వచ్చారు. ప్రాజెక్ట్ దిగువన ఎస్కేప్ గేట్ల వద్ద గోదావరిలోకి దిగారు. అక్కడ నీటి అంచున అబ్దుల్ బార్ సెల్ఫీ తీసుకోడానికి వెళ్లి ప్రమాదవశాత్తూ నదిలో పడిపోయాడు. ఇది గమనించిన అబ్దుల్ ఫ హీం.. అతన్ని రక్షించేందుకు నీటిలోకి దిగాడు. ఈ క్రమంలో ఇద్దరూ నీటిలో మునిగిపోయారు. ఒడ్డుపై నుంచి వీరిని చూస్తున్న అబ్దుల్ సాద్ గట్టిగా కేకలు వేశాడు. సమీపంలో ఉన్న మత్స్యకారులు వచ్చేలోపు ఇద్ద రూ నీటిలో పూర్తిగా మునిగి పోయారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా నీట మునిగిన చోటనే సాయంత్రానికి ఇద్దరి మృత దేహాలూ లభ్యమయ్యాయి.

ప్రమాదంలో 234 డ్యామ్‌లు!

- దేశంలో వందేళ్లకు పైబడిన డ్యామ్‌లపై పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ ఆందోళన
- జాబితాలో తెలంగాణలో 21, ఏపీలో 6 డ్యామ్‌లు

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో వందేళ్లకు పైబడిన డ్యామ్‌ల భద్రతపై జల వనరులపై ఏర్పాటైన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. దేశవ్యాప్తంగా 234 డ్యామ్‌లు వందేళ్లకు పైబడి ఉన్నాయని తెలిపిన కమిటీ.. వీటివల్ల కలిగే ప్రమాదాల అంశాన్ని లేవనెత్తింది. వీటి భద్రతకు చర్యలు తీసుకోవాలని కేంద్రానికి సూచించింది. కమిటీ పేర్కొన్న డ్యామ్‌లలో తెలంగాణ నుంచి 21, ఆంధ్రప్రదేశ్ నుంచి 6 ఉన్నాయి. జాబితాలో పేర్కొన్న తెలంగాణ డ్యామ్‌లలో ఆలేరు రిజర్వాయర్, లక్నవరం ట్యాంక్, ఉస్మాన్‌సాగర్, పాకాల, రామప్ప, పోచారం, శనిగరం, ఉదయసముద్రం ఉన్నాయి. సాధారణంగా డ్యామ్‌లను వందేళ్ల కాలపరిమితితో నిర్మిస్తారని, అయితే అంతకుమించి సేవలందిస్తున్నప్పటికీ ఇందులో ఏ డ్యామ్‌ను ఖాళీ (డీకమిషనింగ్) చేయడం లేదని కమిటీ పేర్కొంది. గతంలో జరిగిన ప్రమాదాలను కమిటీ నివేదికలో పేర్కొంది. డ్యామ్‌ల జీవితకాలం పెరిగిన దృష్ట్యా వాటిలో పూడిక పెరిగి నిల్వ సామర్థ్యం తగ్గిందని, దీంతో భారీ వర్షాల సమయంలో దిగువన వరదలు సంభవిస్తున్నాయని తెలిపింది. డ్యామ్‌ల పటిష్టతను మెరుగుపరిచేందుకు కేంద్రం తీసుకొచ్చిన ఆనకట్టల పునరుద్ధరణ, అభివృద్ధి ప్రాజెక్ట్ (డ్రిప్) పథకానికి నిధులు పెంచాలని కమిటీ సూచించింది.

'రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వండి'

సాక్షి, హైదరాబాద్: ఏపీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన ఆరుగురు మహిళా కూలీలు మరణించడం పట్ల మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరణించిన కూలీల కుటుంబాలకు రూ.10 లక్షలు, గాయపడిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఉనికిని కోసం కేసీఆర్ పాట్లు

టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల

సాక్షి, హైదరాబాద్: కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత సీఎం కేసీఆర్ రాష్ట్రంలో తన పార్టీ ఉనికిని కాపాడుకునేందుకు పాట్లు పడుతున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎద్దేవా చేశారు. అందుకే పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలతో సమావేశం ఏర్పాటు చేసి అధికారంలోకి మళ్లీ తామే వస్తామని గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చుకుని దేశాన్ని పాలిస్తాననే భ్రమలు కల్పించేందుకు కేసీఆర్ ప్రయత్నించారని, కానీ మళ్లీ పాత రాజకీయాలకు సిద్ధమవుతున్నారని అన్నారు.

ఎరువుల ప్రణాళిక ఖరారు

- 24.60 లక్షల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచాలని నిర్ణయం
- అందులో 9.50 లక్షల టన్నులు యూరియా
- రాష్ట్ర ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం
- మండలాలకు మొదటి దఫా సరఫరా

సాక్షి, హైదరాబాద్: రాబోయే వానాకాలం సీజన్‌లో 24.60 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను అందుబాటులో ఉంచాలని వ్యవసాయశాఖ నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ఎరువుల ప్ర ణాళికను ఖరారు చేసింది. రాష్ట్రం పంపిన ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదం తెలిపిందని వ్యవసాయ వర్గాలు వెల్లడించాయి. కేంద్రం కేటాయించిన ఎరువులు వానాకాలం సీజన్‌కు పూర్తిస్థాయిలో సరిపోతాయని తెలిపాయి. ఎ రువుల్లో అత్యధికంగా 9.50 లక్షల మెట్రిక్ ట న్నుల యూరియా కేటాయించారు. 9.40 లక్షల మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులను, 2.30 లక్షల మెట్రిక్ టన్నుల డీఏపీ, 1.25 లక్షల మెట్రిక్ టన్నుల పొటాష్, లక్ష మెట్రిక్ టన్నుల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్‌ను కేటాయించినట్లు వ్యవసాయశాఖ తెలిపింది. కాగా, ఏడాదికేడాదికి యూరియా వాడకం తగ్గుతోందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పచ్చిరొట్ట విత్తనాలను సరఫరా చేయడం వల్ల, గతం కంటే ఐదారు వేల మెట్రిక్ టన్నుల యూరియా వాడకం తగ్గుతోందంటున్నారు.

మండలాలకు ఎరువుల సరఫరా...

వచ్చే నెల మొదటి వారంలో వానాకాలం సీజ న్ ప్రారంభం కానుంది. ఒక వర్షం పడితే చాలు రైతులు దుక్కులు దున్నుతారు. దీంతో ముందస్తుగా మొదటి దఫా ఎరువులను మండలాలకు సరఫరా చేసినట్లు వ్యవసాయశాఖ వెల్లడించింది. మండలాల్లోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (ప్యాక్స్), ఆగ్రోస్ రైతు సే వా కేంద్రాల ద్వారా ఎరువులను సరఫరా చేశా రు. రైతులకు ఎరువులు నిత్యం అందుబాటు లో ఉండేలా చూడాలని ప్యాక్స్, రైతు సేవా కేంద్రాలను వ్యవసాయశాఖ ఆదేశించింది. ఎరు వుల కొరత రాకుండా, ఎక్కడా బ్లాక్ మార్కెటింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. కాగా, ఎరువులను రేక్ పాయింట్ల నుంచి రవాణా చేసేందుకు మార్క్‌ఫెడ్ ఇటీవల ప్రైవేట్ ఏజెన్సీలను ఎంపిక చేసింది. మొత్తం 20 రేక్ పాయింట్ల నుంచి ఎరువులను తీసుకెళ్లేందుకు మూడు ఏజెన్సీలకు అవకాశం ఇచ్చింది. అందులో ఒక ఏజెన్సీకే 18 రేక్ పాయింట్లు వచ్చాయి. మిగిలిన రెండు రేక్ పాయింట్లు మరో రెండు ఏజెన్సీలకు ఒక్కొక్కటి చొప్పున ఇచ్చారు. ఎరువుల రవాణా కోసం రూ. 96 కోట్లు ఖర్చు కానుంది.

క్లుప్తంగా

ఖరీఫ్‌లో ఎరువుల రాయితీ రూ.1.08 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: 2023–24 ఖరీఫ్ (ఏప్రిల్–సెప్టెంబర్) సీజన్‌లో ఎరువులపై రూ.1.08 లక్షల కోట్ల రాయితీ ఇచ్చేందుకు కేంద్ర మంత్రివర్గం బుధవారం ఆమోదముద్ర వేసింది. రిటైల్ మార్కెట్‌లో ఎరువుల ధరలు పెరగకుండా, అన్నదాతలపై ఆర్థిక భారం పడకుండా ఈ రాయితీ తోడ్పడుతుందని తెలియజేసింది. యూరియాపై రూ.70,000 కోట్లు, డీఏపీ, ఇతర ఎరువులపై రూ.38,000 కోట్ల సబ్సిడీ ఇవ్వనున్నట్లు కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ వివరించారు. ఎరువుల గరిష్ట అమ్మకం ధర(ఎంఆర్‌పీ)లో మార్పేమీ ఉండదని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఒక్కో సంచి యూరియా రూ.276, డీఏపీ రూ.1,350 ధర పలుకుతోంది.

సీసీఐ, ఈసీఏ ఒప్పందానికి ఓకే

కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ), ఈజిప్షియన్ కాంపిటీషన్ అథారిటీ(ఈసీఏ); ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ), చార్టెర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ద మాల్దీవ్స్ (సీఏ మాల్దీవ్స్) మధ్య అవగాహన ఒప్పందాలను కేబినెట్ ఆమోదించింది.

పాక్ డ్రోన్లలో 15 కిలోల డ్రగ్స్

జలంధర్: పాకిస్తాన్ సరిహద్దు వెంట భారత గగనతలంలోకి డ్రోన్ల ద్వారా వచ్చిన 15 కిలోలకు పైగా మాదకద్రవ్యాలను సైన్యం స్వాధీనం చేసుకుంది. మంగళవారం అర్ధరాత్రి దాటాక పంజాబ్‌లో అమృత్‌సర్ పరిధిలోని రామ్‌కోట్ గ్రామం వద్ద ఓ డ్రోన్ కిలోలకొద్దీ డ్రగ్స్ తెచ్చి పడేసింది. సైనికులు కాల్పులు జరపడంతో వెనక్కి వెళ్లిపోయింది. డ్రగ్స్ మూటలను పట్టుకెళ్లేందుకు వచ్చిన వారిపైకీ సైనికులు కాల్పులు జరిపారు. వారు పారిపోతూ కొన్ని ప్యాకెట్లు పడేసుకున్నారు. కఖర్ గ్రామంలోనూ ఒక డ్రోన్ సరిహద్దు దాటి వచ్చి డ్రగ్స్ ప్యాకెట్లను పడేసి వెళ్లింది.

ఇమ్రాన్ ఖాన్‌ను 31 దాకా అరెస్టు చేయొద్దు: హైకోర్టు

ఇస్లామాబాద్: పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్(70)ను దేశంలో నమోదైన ఏ కేసులోనూ అరెస్టు చేయకుండా నిర్దేశించిన గడువును ఇస్లామాబాద్ హైకోర్టు ఈ నెల 31వ తేదీ దాకా పొడిగించింది. పాకిస్తాన్ ప్రభుత్వం తనను అరెస్టు చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపిస్తూ ఇమ్రాన్ ఖాన్ ఇస్లామాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ మియాంగుల్ హసన్ ఔరంగజేబ్ బుధవారం విచారణ చేపట్టారు. ఇమ్రాన్‌ను పోలీసులు అరెస్టు చేయకుండా ఆదేశాలివ్వాలని ఆయన తరపు న్యాయవాది కోరారు. ఇమ్రాన్ అరెస్టును నియంత్రిస్తూ గతంలో జారీ చేసిన ఉత్తర్వు గడువు పెంచాలన్నారు.



బుధవారం ఢిల్లీలో రాహుల్‌గాంధీతో భేటీ అయిన సిద్ధరామయ్య



రాహుల్‌గాంధీని కలిసిన కర్ణాటక పీసీసీ చీఫ్ శివకుమార్

కొనసాగుతున్న కర్నాటకం

పట్టు వీడని సిద్ధూ, డీకే • తలపట్టుకుంటున్న అధిష్ఠానం • సిద్ధూను ఖరారు చేస్తూ తొలుత నిర్ణయం!

- మధ్యాహ్నం ఖర్గే-డీకే భేటీతో మారిన సీను
- మొదలైన ప్రమాణస్వీకార ఏర్పాట్లు బంద్
- రెండు మూడు రోజుల్లో నిర్ణయం: సుర్జేవాలా

న్యూఢిల్లీ: కర్ణాటక ముఖ్యమంత్రి ఎంపిక వ్యవహారం కాంగ్రెస్ అధిష్ఠానానికి చుక్కలు చూపుతోంది. మాజీ సీఎం సిద్ధరామయ్య, పీసీసీ చీఫ్ డీకే శివకుమార్ ఎవరి పట్టు మీద వారే ఉండటంతో పీటముడి మరింత బిగుసుకుంటోంది. ఈ విషయమై హస్తినలో సోమ, మంగళవారాల్లో అధిష్ఠానం చర్చోపచర్చలు జరిపినా ఫలితం లేకపోయింది. దాంతో బుధవారం నిర్ణయం తీసుకుంటామని ప్రకటించడం తెలిసిందే. కానీ ఇద్దరు నేతల్లో ఎవరూ వెనక్కు తగ్గేందుకు సిద్ధంగా లేకపోవడంతో చివరికి అధిష్ఠానం ఏమీ తేల్చలేకపోయింది. నిర్ణయానికి మరో రెండు మూడు రోజులు పట్టవచ్చని కాంగ్రెస్ కర్ణాటక వ్యవహారాల ఇన్‌చార్జి రణ్‌దీప్ సుర్జేవాలా మీడియాకు చెప్పారు. ఆలోపు కాంగ్రెస్ నేతలెవరూ దీనిపై తప్పుడు ప్రకటనలు చేయొద్దని ఆదేశించారు. లేదంటే క్రమశిక్షణారాహిత్యంగా పరిగణించి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కర్ణాటకలో కాంగ్రెస్ చేతిలో ఓటమిని జీర్ణించుకోలేని బీజేపీ సీఎం ఎంపికపై తప్పుడు ప్రచారాలకు పాల్పడుతోందని ఆరోపించారు. సీఎంను కూడా ఎన్నుకోలేకపోతున్నారన్న విమర్శలను తిప్పికొట్టారు. అస్సాం వంటి రాష్ట్రాల్లో సీఎం ఎంపికకు బీజేపీ ఎన్ని రోజులు తీసుకుందో అందరికీ తెలుసన్నారు. ఎవరిని సీఎం చేయాలో కూడా తేల్చుకోలేని అయోమయంలో కాంగ్రెస్ పెద్దలున్నారంటూ కర్ణాటక తాజా మాజీ సీఎం బసవరాజ్ బొమ్మై, ఇతర బీజేపీ నేతలు అంతకుముందు చురకలు వేశారు.

రోజంతా చర్చలే చర్చలు

బుధవారం ఉదయం రాహుల్‌గాంధీ తొలుత సిద్ధరామయ్య, తర్వాత డీకేతో సమావేశమయ్యారు. 10, జన్‌పథ్ నివాసంలో వారితో చెరో అర గంటకు పైగా చర్చలు జరిపారు. తర్వాత సిద్ధరామయ్యనే సీఎం చేయాలని అధిష్ఠానం నిర్ణయించినట్టు చెబుతున్నారు. ఈ మేరకు లేఖ కూడా సిద్ధమైనట్టు సమాచారం. బెంగళూరు కంఠీరవ స్టేడియంలో గురువారం మధ్యాహ్నం సిద్ధరామయ్య ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు కూడా మొదలయ్యాయి. సిద్ధరామయ్యే సీఎం అంటూ చానళ్లలో వార్తలు రావడంతో ఆయన సొంతూళ్లో, బెంగళూరులోని నివాసం వద్ద సంబరాలు మొదలయ్యాయి. దాంతో భగ్గుమన్న డీకే సరాసరి వెళ్లి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సమావేశమయ్యారు. అనంతరం బెంగళూరులో ప్రమాణోత్సవ ఏర్పాట్లు నిలిచిపోయాయి. నిర్ణయానికి మరో రెండు మూడు రోజులు పట్టొచ్చన్న ప్రకటన వెలువడింది. తర్వాత ప్రతిష్టంభనకు తెర దించే ప్రయత్నాలను అధిష్ఠానం ముమ్మరం చేసింది. వాటిలో భాగంగా ఆదివారం నాటి కర్ణాటక సీఎల్పీ భేటీకి అధిష్ఠానం పరిశీలకునిగా వెళ్లిన సుశీల్‌కుమార్ షిండేతో ఖర్గే తన నివాసంలో భేటీ అయ్యారు.

బుధవారం హస్తినలో చోటుచేసుకున్న కర్ణాటక రాజకీయ పరిణామాలు...

➤ ఉదయం 8.46: సీఎం రేసులో ముందున్న సిద్ధరామయ్య	➤ 11.30: సిద్ధరామయ్యతో రాహుల్ భేటీ	➤ మధ్యాహ్నం 12.20: డీకే శివకుమార్‌తో రాహుల్ సమావేశం	➤ 1.27: బెంగళూరు కంఠీరవ స్టేడియంలో ప్రమాణస్వీకార ఏర్పాట్లు షురూ
➤ 1.54: సిద్ధరామయ్యను సీఎంగా పేర్కొంటూ లేఖ ప్రతి కూడా సిద్ధం	➤ 2.14: కాంగ్రెస్ చీఫ్ ఖర్గేతో శివకుమార్ భేటీ	➤ 4.16: షేరింగ్ ఫార్ములాకు, డిప్యూటీ సీఎం పదవికి డీకే ససేమిరా	➤ సాయంత్రం 4.30: బెంగళూరులో నిలిచిపోయిన ప్రమాణస్వీకార ఏర్పాట్లు
➤ 5.25: ఎమ్మెల్యేలు, మద్దతుదారులతో ఢిల్లీలోని సోదరుడు సురేశ్ నివాసంలో డీకే మంతనాలు			

• కర్ణాటక సీఎం పంచాయితీ... ఎందుకిలా..?

ఎస్.రాజమహేంద్రారెడ్డి

ఏ రాజకీయ పార్టీకైనా ఎన్నికల్లో గెలవడమే అతిపెద్ద సవాల్. ది గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్‌కు మాత్రం ఎన్నికల్లో నెగ్గడం దైవాధీనం, నెగ్గాక ముఖ్యమంత్రిని ఎంపిక చేయడమే అతిపెద్ద సవాల్. ప్రస్తుత కర్ణాటక సంక్షోభమే ఇందుకు ఉదాహరణ. ఐదేళ్లు పాలించిన బీజేపీని కాదని, కింగ్‌మేకర్ అనుకున్న జేడీ(ఎస్)కు అవకాశం లేకుండా చేసి, కర్ణాటక ఓటర్లు అందించిన ఘన విజయాన్ని సగర్వంగా భుజాలకెత్తుకోవాల్సిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి ఎంపికలో తడబాటుకు గురవుతోంది. ఎన్నో చేదు అనుభవాలు, మరెన్నో గుణపాఠాల నుంచి నేర్చుకున్నది ఏమీ లేదని ఆ పార్టీ మరోసారి రుజువు చేసింది. పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే వైరం నుంచి శాసనసభాపక్ష నాయకుడు సిద్ధరామయ్య, పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌లను 'దోస్త్ మేరా దోస్త్' దాకా తీసుకొచ్చి ఎన్నికల ముందు హిట్ కొట్టిన కాంగ్రెస్ హైకమాండ్, సీఎం పదవి విషయానికొచ్చేసరికి ఇద్దరి మధ్య సఖ్యత కుదర్చడానికి మల్లగుల్లాలు పడుతోంది. ఎందుకిలా?

ఒకేమాట.. కలలో మాట

ఎన్నికల ముందు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట గాంధీ(సోనియా, రాహుల్, ప్రియాంక)ల మాటగా చెల్లింది. దాంతో ఎందుకిలా అని అడిగేవాళ్లు గానీ, అలకపాన్పు ఎక్కే వాళ్లు గానీ ఎవరూ కనిపించలేదు. లేదా ఎవరూ అందుకు సాహసించలేదు. సిద్ధరామయ్య, శివకుమార్‌లు సైతం ఖర్గే మాట జవదాటకుండా పార్టీ విజయానికి కృషి చేశారు. గెలిచాక మళ్లీ షరా మామూలే! సిద్ధరామయ్య, శివకుమార్‌లు ఎవరి గూట్లోకి వారు వెళ్లిపోయి, సై అంటే సై అనే స్థాయిలో ఢీకొంటున్నారు. సీఎం రేసులోనూ అదే వైఖరి. ఎన్నికల ఫలితాలు వెలువడి నాలుగు రోజులైనా ఎటూ తేల్చుకోలేని స్థితిలో అధిష్ఠానం ఊగిసలాడుతోందంటే ఏమనుకోవాలి? పార్టీలోని పెద్దలు ఒకేమాట మీద నిలబడలేకపోవడం కారణం కాదా? రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలు సిద్ధరామయ్య వైపు, మల్లికార్జున ఖర్గే శివకుమార్ వైపు మొగ్గు చూపుతున్నారని అభిజ్ఞ వర్గాల భోగట్టా. ఎన్నికల ముందు లాగా హైకమాండ్ ఒకేమాట మీద ఉండి ఉంటే ఈ పరిస్థితి వచ్చేదే కాదు. సిద్ధరామయ్య, శివకుమార్‌లు మా అంటే కాసేపు అలకపాన్పు ఎక్కి, ఆ తర్వాత సర్దుకునేవారు.

అందుకే సీఎం పీఠంపై పీటముడి

గతంలో ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన సిద్ధరామయ్య అనుభవానికి పెద్దపీట వేయడంలో తప్పు లేదు గానీ, పార్టీ విజయం కోసం అహర్నిశలూ చెమటోడ్చడమే కాకుండా ఆర్థిక వనరులు సైతం సమకూర్చిన శివకుమార్‌ను ఉప ముఖ్యమంత్రి పదవితో సరిపెట్టుకోమనడం అభిమానులకు రుచించలేదు. అందుకే ముఖ్యమంత్రి పీఠంపై పీటముడి పడింది. ఢిల్లీ వేదికగా ప్రత్యర్థులిద్దరూ బుధవారం మొత్తం లాబీయింగ్‌లో తలమునకలై ఉన్నారు. క్షణానికో సీన్ మారింది. సిద్ధరామయ్యే సీఎం అంటూ లేఖ సైతం సిద్ధమయ్యింది. శివకుమార్ ససేమిరా అనడంతో ఆ లేఖ బుట్టదాఖలయ్యింది. బెంగళూరు కంఠీరవ స్టేడియంలో గురువారం జరగాల్సిన ప్రమాణ స్వీకార ఏర్పాట్లను ప్రస్తుతానికి నిలిపేశారు. సీఎం పోస్టు కోసం కొట్లాట ఈ స్థాయికి చేరుకుందంటే ముగింపు ఎలా ఉంటుందో ఊహించడం కష్టం. అసలు హైకమాండ్ దాకా వెళ్లకుండా కాంగ్రెస్ శాసన సభాపక్ష(సీఎల్పీ) సమావేశంలోనే సీఎం అభ్యర్థిని ఎన్నికొని ఉంటే ఎలాంటి వివాదానికి తావు ఉండేది కాదు. హైకమాండ్ చేతికి మట్టి అంటకుండా ఉండేది. అలా చేస్తే అది కాంగ్రెస్ సంస్కృతి ఎందుకవుతుంది? తెగేదాకా లాగి రెండు కుంపట్లు పెట్టుకుంటే ప్రతిపక్షం దాన్ని సొమ్ము చేసుకోవడం ఖాయం. అదే పరిస్థితి వస్తే ఈ ఇద్దరినీ కాదని మూడో వ్యక్తిని ముఖ్యమంత్రిగా ఎంపిక చేయడం తప్ప కాంగ్రెస్‌కు మరో గత్యంతరం లేదు.




కాంగ్రెస్ నేర్చుకున్నదేమీ లేదు

రాజస్తాన్‌లో 2018లో అశోక్ గహ్లోత్, సచిన్ పైలట్ మధ్య మొదలైన సీఎం పీఠం లొల్లి ఐదేళ్లయినా ఇంకా ఓ కొలిక్కిరాలేదు. ఈ అనుభవం నుంచి కాంగ్రెస్ నేర్చుకున్నదేమీ లేదు. పీసీసీ అధ్యక్షుడిగా పార్టీని గెలిపించిన సచిన్ పైలట్‌ను పక్కనపెట్టి(కొన్ని రోజులు డిప్యూటీ సీఎం పదవి ఎరవేసి), అనుభవాన్ని సాకుగా చూపి గహ్లోత్‌ను ముఖ్యమంత్రి పదవిలో కూర్చోబెట్టారు. అప్పటినుంచి రాజస్తాన్ అంతర్గత కుమ్ములాటలతో సతమతమవుతూనే ఉంది. రాష్ట్రంలో ఈ ఏడాది డిసెంబర్‌లో జరిగే ఎన్నికల్లో గెలుస్తామన్న ఆశలు సన్నగిల్లాయి. ఇదంతా ఎందుకంటే.. డీకే శివకుమార్ మరో సచిన్ పైలట్ అయితే, కర్ణాటక మరో రాజస్తాన్ అవుతుందని రాజకీయ విశ్లేషకుల అంచనా.



కొత్త జాతి జీవి... మిజోరంకు ఎగిరొచ్చింది!

ఐజ్వాల్: అత్యల్పదూరం ఎగిరే బల్లి జాతి బుల్లి జీవిని శాస్త్రవేత్తలు భారత్‌లో తొలిసారిగా మిజోరంలో గుర్తించారు. చెట్లపై జీవించే దీనికి గెక్కో మిజోరమెన్సిస్ అని పేరు పెట్టారు. ఒక చెట్టు నుంచి మరో చెట్టుకు ఒక్క ఉదుటున దూకడం దీని ప్రత్యేకత. 20 సెం.మీ. పొడవుండే ఈ జీవికి గెంతేందుకు అనువుగా తోక చివరి భాగం పైకి వంగి ఉంది. 'వీటి డీఎన్ఏ 21 శాతం వేరుగా ఉంది. ఇది నిజంగా కొత్త జాతి' అని మిజోరం వర్సిటీ, జర్మనీలోని మ్యాక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయోలజీ పరిశోధకులు తెలిపారు. మిజోరం ప్రజలు వీటిని అత్యంత ఖరీదైనవిగా భావించి వేటాడుతున్నారట.



మధ్యప్రదేశ్‌లోని షాదోల్ జిల్లాలో అంబులెన్స్‌కు డబ్బుల్లేక కూతురి మృతదేహాన్ని 70 కి.మీ. దూరంలోని స్వగ్రామానికి వేరేవాళ్ల బైక్‌పై తీసుకెళ్తున్న ఓ పేద తండ్రి. విషయం తెలిసి కలెక్టర్ వెంటనే అంబులెన్స్ పంపి ఆర్థిక సాయం కూడా చేశారు.



షేరింగ్.. ఓ ఫ్లాప్ ఫార్ములా..!

- కాంగ్రెస్ పాలనలో ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో బెడిసికొట్టింది
- గద్దె దిగి సింగ్‌దేవ్‌కు చాన్సిచ్చేందుకు భగెల్ ససేమిరా
- కర్ణాటకలోనూ ఫలించని బీజేపీ-జేడీ(ఎస్) ప్రయోగం

కర్ణాటకలో అధికార పీఠం కోసం సిద్ధరామయ్య, డీకే శివకుమార్ హస్తిన వేదికగా హోరాహోరీ తలపడుతున్నారు. మధ్యేమార్గంగా చెరో రెండున్నరేళ్లు పదవిని పంచుకోవాలని అధిష్ఠానం ప్రతిపాదించినా సిద్ధరామయ్యకు తొలి చాన్సిచ్చేందుకు డీకే ససేమిరా అంటున్నారు. "అన్నదమ్ముల్లా సమానంగా పంచుకోవడానికి అదేమీ వారసత్వపు ఆస్తి కాదు! సీఎం పదవి. ప్రభుత్వ ఏర్పాటుతో ముడిపడ్డ అంశం. పంచుకునే సమస్యే లేదు" అని ఆయన కరాఖండిగా చెబుతున్నారు. డీకే అభ్యంతరాల వెనక సహేతుకమైన కారణాలు లేకపోలేదు. కర్ణాటకతో సహా పలు రాష్ట్రాల్లో ఇలాంటి ప్రయోగాలు పెద్దగా ఫలించిన దాఖలాలు లేవు!

ఛత్తీస్‌లో 'చెయ్యి'చ్చిన భగెల్

➤ ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలోనే ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో పార్టీలోనే ముఖ్య నేతల మధ్య పవర్ షేరింగ్ ఫార్ములా బెడిసికొట్టింది. అక్కడ 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ స్పష్టమైన మెజారిటీ సాధించింది. భూపేశ్ భగెల్ (62), త్రిభువనేశ్వర్ శరణ్ సింగ్‌దేవ్ (70) సీఎం పదవి కోసం పట్టుబట్టారు. దాంతో అధిష్ఠానం ఇప్పుడు సిద్ధూ–డీకే ద్వయానికి ప్రతిపాదించిన ఫార్ములానే అమలు చేసింది. చెరో రెండున్నరేళ్లు సీఎంగా ఉండేలా రాజీ ఫార్ములా కుదిర్చింది. సింగ్‌దేవ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలతో సరిపెట్టుకోగా తొలుత భగెల్ గద్దెనెక్కారు. తీరా 2021 జూలైలో రెండున్నరేళ్లు ముగిశాక తప్పుకుని సింగ్‌దేవ్‌కు చాన్సిచ్చేందుకు ససేమిరా అన్నారు. ఇప్పటికీ సీఎంగా కొనసాగుతున్నారు. అగ్ర నేత రాహుల్‌గాంధీ రాష్ట్రాన్ని సందర్శించి అభివృద్ధి పనులన్నీ కళ్లారా చూశాక తనను ఉంచాలో, దించాలో డిసైడ్ చేస్తారని చెబుతూ రెండేళ్లుగా కాలం వెళ్లదీస్తున్నారు. అధిష్ఠానం జోక్యం కోసం ఎదురు చూసి చిర్రెత్తుకొచ్చిన సింగ్‌దేవ్ ఇటీవలే మంత్రి పదవులకు రాజీనామా చేసినా లాభం లేకపోయింది. ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలున్న నేపథ్యంలో భగెల్‌ను మార్చే ఉద్దేశం కూడా హస్తిన పెద్దలకు లేనట్టే కన్పిస్తోంది!

కర్ణాటకలోనే ఫెయిలైంది'...

➤ కర్ణాటకలోనే దాదాపు 20 ఏళ్ల క్రితం బీజేపీ, జేడీ(ఎస్) మధ్య సీఎం పదవి పంపకం కథ ఇలాగే అడ్డం తిరిగింది. 2004 అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకీ మెజారిటీ రాలేదు. బీజేపీకి 79, కాంగ్రెస్‌కు 65, జేడీ(ఎస్)కు 58 సీట్లొచ్చాయి. కాంగ్రెస్, జేడీ(ఎస్) సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేశాయి. కానీ రెండేళ్లకే కాంగ్రెస్‌కు జేడీ(ఎస్) చెయ్యిచ్చింది. సంకీర్ణాన్ని కూలదోసి 2006 ఫిబ్రవరిలో బీజేపీతో జట్టు కట్టింది. చెరో 20 నెలలు సీఎం పదవిని పంచుకునేలా ఒప్పందం కుదిరింది. తొలి చాన్సు దక్కించుకున్న జేడీ(ఎస్) నేత కుమారస్వామి ఒప్పందం మేరకు 2007 అక్టోబర్‌లో గద్దె దిగేందుకు ససేమిరా అన్నారు. 4,5రోజుల హైడ్రామా తర్వాత ఆయన రాజీనామాతో రాష్ట్రం రాష్ట్రపతి పాలనలోకి వెళ్లింది. నెల తర్వాత జేడీ(ఎస్) బెట్టు సడలించడంతో బీజేపీ నేత యడియూరప్ప యడియూరప్ప సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. కానీ శాఖల పంపిణీలో విభేదాలు రావడంతో యడ్డీ సర్కారుకు మద్దతివ్వను పొమ్మన్నారు కుమారస్వామి! అలా బీజేపీ-జేడీ(ఎస్) సంకీర్ణం కథ పూర్తిగా పట్టాలెక్కకుండానే కంచికి చేరింది!

యూపీలోనూ అంతే

1996లో ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్, బీఎస్పీ ముందస్తు పొత్తు పెట్టుకుని ఎన్నికలకు వెళ్లాయి. ఏ పార్టీకీ మెజారిటీ రాలేదు. మొత్తం 424 స్థానాలకు గాను 174 సీట్లతో బీజేపీ అతి పెద్ద పార్టీగా నిలవగా సమాజ్‌వాదీకి 110, బీఎస్పీకి 67, కాంగ్రెస్‌కు 33 స్థానాలు దక్కాయి. కొద్ది నెలల రాష్ట్రపతి పాలన అనంతరం కాంగ్రెస్‌కు బీఎస్పీ గుడ్‌బై చెప్పింది. ఆర్నెల్లకోసారి అధికారాన్ని మార్చుకునే ఒప్పందంతో బీజేపీతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 1997 మార్చిలో మాయావతి సీఎం అయ్యారు. సెప్టెంబర్లో ఆమె గద్దె దిగి బీజేపీ నేత కల్యాణ్‌సింగ్ సీఎం అయ్యారు. నెల రోజులకే బీఎస్పీ మద్దతు ఉపసంహరించడంతో సంకీర్ణం కథ ముగిసింది. అంతకుముందు 1995లోనూ బీజేపీ–బీఎస్పీ సంకీర్ణ సర్కారు ఐదు నెలలకే కుప్పకూలింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఆగస్టు 14లోగా దర్యాప్తు పూర్తి చేయండి

అదానీపై గ్రూప్ అక్రమాలపై సెబీకి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్‌లో అవకతవకల ఆరోపణలపై దర్యాప్తును ఆగస్టు 14కల్లా పూర్తి చేయాలని సెబీని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇప్పటిదాకా జరిగిన దర్యాప్తుపై నివేదిక సమర్పించాలని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై దాఖలైన పిటిషన్లపై సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. దర్యాప్తు డెడ్‌లైన్‌ను సెప్టెంబర్ నెలాఖరు దాకా పొడిగించాలన్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా విజ్ఞప్తికి అంగీకరించలేదు. దర్యాప్తులో ఇబ్బందులుంటే తెలియజేయాలని సూచించింది.

చైనా నౌక మునిగి 30 మంది గల్లంతు

బీజింగ్: 39 మందితో చేపల వేటకు బయలుదేరిన చైనా నౌక మంగళవారం తెల్లవారుజామున హిందూ మహాసముద్రంలో మునిగిపోయింది. వీరిలో 17 మంది చైనావాసులు, 17 మంది ఇండోనేషియా పౌరులు, ఐదుగురు ఫిలిప్పైన్స్ జాతీయులు ఉన్నారు. 9 మంది జాడ గుర్తించారు. మిగతా వారికోసం గాలింపు సాగుతోంది. ఆస్ట్రేలియా, శ్రీలంక, మాల్దీవులు, ఇండోనేషియా, ఫిలిప్పైన్స్‌తోపాటు పలు దేశాల ప్రభుత్వ అధికారులతో చైనా విదేశాంగ శాఖ సంప్రదింపులు జరుపుతోంది. గాలింపు, సహాయక చర్యల్లో పాలుపంచుకోవాలని కోరింది.

బైడెన్ గైర్హాజరుతో క్వాడ్ సదస్సు రద్దు

మెల్‌బోర్న్/వాషింగ్టన్: అమెరికా రుణపరిమితి పెంపు సమస్యను అత్యవసరంగా చక్కదిద్దాల్సిన నేపథ్యంలో 24వ తేదీన ఆస్ట్రేలియాలో జరగాల్సిన క్వాడ్ సదస్సుకు హాజరు కాలేనని అధ్యక్షుడు బైడెన్ తెలిపారు. దాంతో సదస్సు రద్దయింది. అందులో చర్చించదలచిన కీలకాంశాలను జపాన్‌లోని హిరోషిమాలో జరగబోయే జీ7 సదస్సు సందర్భంగా క్వాడ్ దేశాలు చర్చించే అవకాశముందని ఆస్ట్రేలియా ప్రధాని ఆల్బనీస్ తెలిపారు. అయితే ప్రధాని నరేంద్ర మోదీ ఆస్ట్రేలియా యథాతథంగా జరగనుంది. ఆల్బనీస్‌తో ద్వైపాక్షిక చర్చలతో పాటువాణిజ్య సంబంధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. మే 19– 21 మధ్య మోదీ జపాన్‌లో జీ7 సదస్సులో పాల్గొంటారు. 22న పపువా న్యూ గినియాలో ఇండో–పసిఫిక్ ద్వీపాల సహకార సదస్సులో పాల్గొంటారు. 23న ఆస్ట్రేలియాలో భారతీయులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. జీ7 భేటీ మోదీ, జపాన్, ఆస్ట్రేలియా ప్రధానులతో బైడెన్ చర్చిస్తారని శ్వేతసౌధం ప్రకటించింది.

హ్యారీ దంపతుల్ని వేటాడిన కెమెరా కళ్లు!

న్యూయార్క్‌లో కొద్దిలో తప్పిన రోడ్డు ప్రమాదం



న్యూయార్క్: అమెరికాలో ఓ దాతృత్వ కార్యక్రమానికి వెళ్తున్న బ్రిటన్ రాచకుటుంబానికి చెందిన ప్రిన్స్ హ్యారీ, భార్య మెఘన్, అత్త డోరియా రాగ్లాండ్‌లను మీడియా ఫొటోగ్రాఫర్లు ఫొటోల కోసం వెంబడించారు. ఇది పాతికేళ్ల క్రితం హ్యారీ తల్లి ప్రిన్సెస్ డయానాను పారిస్‌లో కెమెరామెన్లు వాహనాల్లో వెంబడించడం అది విషాదాంతమవడాన్ని గుర్తుచేసింది. 'ఆరు వాహనాల్లో మీడియా వ్యక్తులు ఏకంగా రెండు గంటలపాటు హ్యారీ వాహనాన్ని వెంబడించారు. మంగళవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో పలు వాహనాలు దాదాపు గుద్దుకున్నంత పని జరిగింది. ఈ ఘటనలో పలు వాహనాలు, పాదచారులు, ఇద్దరు న్యూయార్క్ పోలీసు అధికారులు చాలా ఇబ్బంది పడ్డారు' అని హ్యారీ అధికార ప్రతినిధి బుధవారం వెల్లడించారు. ఘటన తర్వాత పోలీస్ రక్షణలో వారు వెళ్తున్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమయ్యాయి. అయితే అధికారికంగా ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని న్యూయార్క్ పోలీసు విభాగం ప్రకటించింది. లండన్‌లో బ్రిటన్ రాజుగా చార్లెస్ పట్టాభిషేకం తర్వాత దాదాపు నెలరోజుల తర్వాత తొలిసారిగా ఈ జంట మీడియా కంటపడటంతో మీడియా అత్యుత్సాహం చూపి ఉంటుందని వార్తలొచ్చాయి.

ఎవరెస్ట్‌నెక్కి రికార్డుకెక్కారు

27 సార్లు పర్వతారోహణ చేసిన నేపాల్ షెర్పా కమీ రీటా

కఠ్మాండూ: నేపాల్‌కు చెందిన ప్రఖ్యాత పర్వతారోహకుడు కమీ రీటా షెర్పా మరోమారు ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించి తన గత రికార్డును తానే చెరిపేసి కొత్త రికార్డ్‌ను లిఖించారు. 53 ఏళ్ల రీటా బుధవారం ఉదయం విజయవంతంగా 27వసారి ఎవరెస్ట్‌ను ఎక్కారని నేపాల్ పర్యాటక శాఖ ప్రకటించింది. దీంతో నూతన ప్రపంచ రికార్డు ఆవిష్కృతమైంది. గత ఏడాది రీటా 26వసారి ఎవరెస్ట్ పర్వతారోహణ విజయవంతంగా పూర్తిచేసి ప్రపంచ రికార్డును సృష్టించారు. ఆ రికార్డును మూడు రోజుల క్రితం మరో షెర్పా అయిన 46 ఏళ్ల పసంగ్ దవా సమం చేశారు. దీంతో రీటా బుధవారం మరోమారు పర్వతమెక్కి తన పేరిట రికార్డును లిఖించుకున్నారు. ఈయన 1994 మే 13న తొలిసారి ఈ పర్వతశిఖరాన్ని చేరారు. రీటా గతంలోనే ప్రపంచంలోని 8,000 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తున్న పలు శిఖరాలను అధిరోహించారు. సీనియర్ మౌంటేన్ గాడ్‌గా పనిచేస్తున్నారు. బుధవారంనాటి పర్వతారోహణకు అయిన ఖర్చులను కఠ్మాండూకు చెందిన ఒక వాణిజ్య సాహసయాత్రల నిర్వహణ సంస్థ భరించింది. ఈ స్ప్రింగ్ సీజన్‌లో ఇప్పటిదాకా మొత్తంగా 478 మందికి ఎవరెస్ట్ ఎక్కేందుకు అనుమతులు వచ్చాయి.



వచ్చే ఐదేళ్లలో ఎండ ప్రచండం!



జెనీవా: వచ్చే అయిదేళ్ల పాటు ప్రపంచ దేశాల్లో ఎండలు దంచికొడతాయని ఐక్యరాజ్యసమితికి చెందిన ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) హెచ్చరించింది. పరిమితికి మించి గ్రీన్‌హౌస్ వాయువులు విడుదల, ఎల్‌నినో ప్రభావంతో అయిదేళ్ల పాటు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలున్నాయని తెలిపింది. 2015లో జరిగిన పారిస్ ఒప్పందంలో ప్రపంచ ఉష్ణోగ్రతల పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్‌కు మించకుండా చూడాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, దానిని అధిగమించేలా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా వేసింది. 2015–2022 వరకు వరసగా ఎనిమిదేళ్లు రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని, వచ్చే ఐదేళ్లలో మరింత పెరిగిపోతాయని తెలిపింది. "వచ్చే అయిదేళ్లలో ఏదో ఒక ఏడాది లేదంటే అయిదేళ్ల సగటు ఉష్ణోగ్రతలు పారిస్ ఒప్పందాన్ని అధిగమించేలా 1.5 డిగ్రీలు పెరిగిపోతాయి. అలా పెరగడానికి 98% అవకాశాలున్నాయి" అని డబ్ల్యూఎంఓ చీఫ్ పెటరి టాలస్ చెప్పారు. ప్రపంచ దేశాలన్నీ పారిస్ ఒప్పందాన్ని ఉల్లంఘించడంతో పాటు ఎల్‌నినో పరిస్థితులతో ఈ ప్రమాదం ముంచుకొస్తోందని తెలిపారు. ప్రపంచ ఉష్ణోగ్రతలు పెరిగిపోవడం వల్ల ఆరోగ్యం, ఆహారం, నీటి పర్యవేక్షణ, పర్యావరణంపై ప్రభావం కనిపిస్తుందన్నారు.



పోచమ్మ బోనాల జాతర

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టులో బుధవారం పోచమ్మ బోనాల జాతర జరిగింది. మహిళలు బోనాలతో తరలివెళ్లి నైవేద్యం సమర్పించారు.



నృసింహునికి మొక్కులు

ధర్మపురి : శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో వేలాది మంది భక్తులు పూజలు చేశారు. వేసవి సెలవు రద్దీ కొనసాగింది.

గరిష్టం/కనిష్టం
42.1/28.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఎండ తీవ్రత పెరిగి ఉక్కపోతగా ఉంటుంది

న్యూస్‌రీల్

ప్రశాంతంగా పాలిసెట్



కరీంనగర్: పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పాలిసెట్–2023) ప్రవేశ పరీక్ష బుధవారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. ప్రవేశ పరీక్ష కోసం జిల్లా వ్యాప్తంగా ఎనిమిది కేంద్రాలు ఏర్పాటు చేశారు. 4,373 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 4,112 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు కో ఆర్డినేటర్ అప్పారావు తెలిపారు. బాలుర విభాగంలో 2,232 మందికి 126 మంది గైర్హాజరు కాగా 2,106 మంది పరీక్షకు హాజరయ్యారు. బాలికల విభాగంలో 2,141 మంది విద్యార్థులకు 135 మంది గైర్హాజరు 2,006 మంది పరీక్షకు హాజరయ్యారు. తిమ్మాపూర్‌లోని పరీక్ష కేంద్రంలో ఐదుగురు విద్యార్థులు పరీక్షకు ఆలస్యంగా రాగా వారిని పరీక్షకు అనుమతించ లేదు.

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం



శంకరపట్నం(మానకొండూర్): పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులకు దూరంగా ఉంటామని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. బుధవారం మండలంలోని కాచాపూర్‌లో మన ఊరు మన బడిలో చేపట్టిన అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కంపోస్టు షెడ్డును పరిశీలించారు. కంపోస్టు ఎరువు తయారీ చేసుకుని ఆదాయం సమకూర్చుకోవాలని కార్యదర్శికి సూచించారు. కేశవపట్నంలో క్రీడాపోటీలను పరిశీలించారు. అదనపు కలెక్టర్ వెంట డీపీవో వీరబుచ్చయ్య, ఎంపీడీవో బషీరొద్దీన్, సర్పంచ్ కోండ్ర రాజయ్య, ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, కిషన్‌స్వామి, రమేశ్ పాల్గొన్నారు.

31లోగా సీఎంఆర్ ఇవ్వాల్సిందే



కరీంనగర్‌అర్బన్: ఈనెల 31లోగా సీఎంఆర్ బకాయిలను ఎఫ్‌సీఐకి అందజేయాలని, పొడిగింపు ఉండదని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్ మిల్లర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో 2021–23 బాకీ ఉన్న మిల్లర్లతో సమీక్షించారు. ఎండ తీవ్రత దృష్ట్యా వారం రోజుల్లో ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలని అన్నారు. ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్‌లో నమోదు చేసి డబ్బులందేలా చూడాలని సూచించారు. డీఎస్‌వో సురేశ్‌రెడ్డి, సివిల్ సప్లయ్ డీఎం ముప్పిడి శ్రీకాంత్‌రెడ్డి, మిల్లర్ల సంఘం ప్రతినిధులు నర్సింగరావు, కరుణాకర్, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో రూ.53,792 రికవరీ

శంకరపట్నం(మానకొండూర్): సామాజిక తనిఖీ ప్రజావేదికలో రూ.53,792 రికవరీకి ఆదేశించినట్లు డీఆర్‌డీవో శ్రీలతారెడ్డి తెలిపారు. శంకరపట్నం మండల పరిషత్ ఆవరణలో బుధవారం 13వ విడత ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక జరిగింది. తనిఖీ బృందం సభ్యులు గ్రామాల్లో చేసిన తనిఖీ వివరాలను చదివి వినిపించారు. నాటిన మొక్కలు ఎండిపోయినట్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. 10మంది పంచాయతీ కార్యదర్శుల నుంచి రూ.16,605, టెక్నికల్ అసిస్టెంట్లు రూ.8,602, జేఈ, ఈసీల నుంచి 7106, సీవో 367, 8 గ్రామపంచాయితీల నుంచి రూ.13,857 రికవరీకి వెల్లడైంది. ఈ సమావేశంలో ఎంపీపీ సరోజన, అడిషనల్ డీఆర్‌డీవో సంధ్యారాణి, విజిలెన్స్ అధికారి వసంత, క్యూసీ శ్రీధర్‌రెడ్డి, అంబుడ్స్‌మెన్ లక్ష్మీనారాయణ, ఎంపీడీవో బషీరొద్దీన్, ఏపీవో శారద, సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫీజు గడువు పెంపు

కరీంనగర్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లింపు గడువును ఈనెల 19వ తేదీ వరకు పొడిగించినట్లు డీఐఈవో రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో విధించిన గడువు ముగియగా కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం పొడిగించిందన్నారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ ఫీజు రేపటి వరకు చెల్లించవచ్చునని పేర్కొన్నారు. జూన్4వ తేదీ నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయని తెలిపారు.



దుర్శేడ్‌లో పెట్రోల్ బంక్‌కు గోనె సంచులు కట్టి నీళ్లు చల్లుతున్న సిబ్బంది



కరీంనగర్ టవర్ సర్కిల్ ప్రాంతంలో గొడుగు సహాయంతో వెళ్తున్న వ్యక్తి



డీర్ పార్క్‌లో ఏర్పాటు చేసిన నీటిని తాగుతున్న జింకలు

ఐదురోజుల్లో నమోదైన ఉష్ణోగ్రత వివరాలు

తేదీ	గరిష్టం
13	43.1
14	42.8
15	42.6
16	44.9
17	42.1

నిప్పుల కొలిమి..

- జిల్లాలో దంచి కొడుతున్న ఎండలు
- కరీంనగర్‌లో 42.1 డిగ్రీల ఉష్ణోగ్రత
- మరో నాలుగు రోజులపాటు ఇదే పరిస్థితి
- వ్యాయామం, ఆహారం, దుస్తుల విషయంలో జాగ్రత్త
- వృద్ధులు, బాలింతలు, గర్భిణులకు వడగాలుల ముప్పు
- అవసరమైతే తప్ప బయటికి వెళ్లొద్దంటున్న వైద్యులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ప్రచండ భానుడి ప్రతాపం రోజురోజుకు ఉధృతమవుతోంది. 40 డిగ్రీలు దాటి నమోదవుతున్న ఎండలకు పిల్లలు, వృద్ధులు, గర్భిణులు తాళలేకపోతున్నారు. నోరు లేని మూగజీవాలు అల్లాడుతున్నాయి. జిల్లాలో బుధవారం 42.1 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. ఈ పరిణామాలు మరో నాలుగు రోజులపాటు (ఈనెల 18, 19, 20, 21వ తేదీల వరకు) కొనసాగే ప్రమాదముందని ఐఎండీ హెచ్చరించింది. వడ గాలులు వీస్తున్న క్రమంలో ఎలాంటి పనులు ఉన్నా.. ఉదయాన్నే పూర్తి చేసుకోవాలని, మధ్యాహ్నం పూట వీలైనంత వరకు ఇంటికే పరిమితం కావాలని వైద్యులు సూచిస్తున్నారు. రెండు వారాల క్రితం వరకు వరుస వర్షాలతో జనజీవనం అతలాకుతలమైంది. ఇప్పుడేమో భరించలేని ఎండలతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. జిల్లాలో మధ్యాహ్నం సమయంలో రోడ్లన్నీ జనం లేక నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. సాయంత్రం 5 గంటలు దాటినా భానుడి తీవ్రత ఏ మాత్రం తగ్గడం లేదు. నాలుగు రోజులుగా జిల్లాలో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో రానున్న రోజుల్లో పరిస్థితి తలచుకొని ప్రజలంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయ పనులు చేసుకునే వారు, పశువుల కాపర్లు, హమాలీ కూలీలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పనిచేసేవారు, రోడ్డు, సివిల్, నిర్మాణ రంగం కూలీలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అదే సమయంలో బీపీ, షుగర్, గుండెజబ్బులతోపాటు గర్భిణులు, శిశువులు జాగ్రత్తగా ఉండాలంటున్నారు. కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఎండ నుంచి రక్షణ పొందవచ్చని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఎవరు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో పలువురు వైద్యులు 'సాక్షి'కి సూచించారు.



నిర్మానుష్యంగా మారిన కరీంనగర్ కోర్టు చౌరస్తా

పశువులకు నీడ, చల్లటి నీరు ముఖ్యం..



ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున రైతులు, జంతు ప్రేమికులు అప్రమత్తంగా వ్యవహరించాలి. మేతకు ఉదయం , సాయంత్రం వేళలో మాత్రమే తీసుకెళ్లాలి. వడగాలి తగలకుండా చుట్టూ తడికలు కట్టి చల్లగా ఉండేలా నీటిని చిలకరించాలి. చల్లగా ఉండే నీటిని మాత్రమే తాగునీరుగా అందించాలి. నీటి తొట్టిలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు నీటిని పెట్టడం ఉత్తమం. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నీడలో ఉండేలా చర్యలు తీసుకోవా లి. ఇక పక్షుల దాహార్తిని తీర్చేందుకు చిన్న చిన్న పాత్రల్లో ఇల్లు పైన, అక్కడక్కడ నీటి ని ఏర్పాటు చేయాలి. ఎండ బారిన పడకుండా పెంపుడు కుక్కలను ఇంట్లోనే నీడపట్టున ఉంచాలి.

– డా.తుమ్మల కిరణ్ కుమార్‌రెడ్డి, సీనియర్ పశు వైద్యులు

డీహైడ్రేషన్‌కు గురయ్యే అవకాశం ఉంటుంది



డాక్టర్ వెంకట్‌రెడ్డి, జనరల్ ఫిజీషియన్

సాక్షి: బీపీ, షుగర్, గుండె జబ్బులు ఉన్న వారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

డాక్టర్ : బీపీ, షుగర్, గుండె జబ్బులు, క్రానిక్ డిసీజెస్ ఉండి మందులు వాడే వారు ఎండలో తిరిగితే డీహైడ్రేషన్ అయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. వీరికి గుండెపోటు, పక్షవాతం వచ్చే అవకాశాలు ఉంటాయి. అలాంటి వారంతా ఎండలో వెళ్లకుండా ఉంటేనే మంచిది. తప్పని సరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు ఎప్పటికప్పుడు మంచి నీరు తాగుతుండాలి. ఇబ్బంది అనిపించినప్పుడు నీడలో ఉండే ప్రయత్నం చేయాలి.

సాక్షి: ఎలాంటి దుస్తులు ధరించాలి?

డాక్టర్ : లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలి. ఎండలో వెళ్లేటప్పుడు నైలాన్, పాలిస్టర్ లాంటి దుస్తులు ఎట్టి పరిస్థితుల్లో వాడొద్దు. దుస్తులు వదులుగా ఉండేలా చూసుకోవాలి. అలాగైతే శరీరానికి ఎక్కువగా చెమటపట్టదు. తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వస్తే చలువ కంటి అద్దాలు, క్యాప్ తప్పనిసరిగా ధరించాలి.

సాక్షి: వ్యాయామం ఏ సమయంలో చేయాలి?

డాక్టర్: ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్న ప్రస్తుత తరుణంలో మైదానాలకు వెళ్లే వారు ఉదయం 5 నుంచి 6 గంటల మధ్య మాత్రమే వాకింగ్, వ్యాయామం చేయాలి. అది కూడా ఒంట్లో శక్తిని కోల్పోయే విధంగా ఉండకూడదు. ఇక ఏసీ జిమ్‌లలో వ్యాయామం చేసేవారు ఎప్పుడైనా చేసుకోవచ్చు.

సాక్షి: ఎండదెబ్బ తగిలితే ఏం చేయాలి?

డాక్టర్: ఎండదెబ్బ తగిలినట్లు గ్రహించిన వెంటనే ఆ వ్యక్తిని గాలి ఉండే చల్లని ప్రదేశంలో ఉంచాలి. వీలైనంత త్వరగా ఆసుపత్రికి తీసుకెళ్లాలి. ఎండదెబ్బతో డీహైడ్రేషన్ జరిగి మనిషి ఒక్కసారిగా కుప్పకూలే ప్రమాదం ఉంటుంది. మరణించే ప్రమాదం అధికం కాబట్టి జాగ్రత్తలు తీసుకోవాలి.

ఎండలోకి వెళ్లొద్దు



డాక్టర్ ప్రతిష్టారావు, గైనకాలజిస్టు

సాక్షి : గర్భిణులు, బాలింతలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

డాక్టర్: గర్భిణులు, బాలింతలు ఎండలోకి వెళ్లకుండా ఉండేలా చూసుకోవాలి. అత్యవసరమైతే గొడుగు, స్కార్ఫ్ వాడాలి. ఎండ తగలకుండా చూసుకుంటే సరిపోతుంది. ఎండదెబ్బ తగిలితే గర్భిణులు, బాలింతలు త్వరగా నీరసించిపోతారు. అలాంటి పరిస్థితి ఎదురుకాకుండా చూసుకోవాలి.

సాక్షి : ఎలాంటి ఆహారం తీసుకోవాలి?

డాక్టర్: ఎండాకాలంలో సులువుగా జీర్ణమయ్యే తేలికపాటి ఆహారం తీసుకోవాలి? గొంతు తడారకుండా ఎప్పటికప్పుడు మంచినీళ్లు తాగుతుండాలి. బయటకు వెళ్లాల్సి వస్తే నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరినీళ్లు తాగాలి. వాటర్‌మిలన్, మస్క్‌మిలన్, పీచు, నీరు శాతం ఎక్కువగా ఉండే పండ్లు తినాలి. షుగర్, అధిక బరువు లేని వారు మామిడిపండ్లు తినడం వల్ల శరీరానికి విటమిన్ ఏ, డీ, సీ పుష్కలంగా అందుతాయి.

సాక్షి: దుస్తుల విషయంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి?

డాక్టర్: గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా కాటన్ దుస్తులు ధరించాలి. ఒంటికి లూజుగా ఉండే బట్టలు ధరించడం వల్ల చెమటపట్టకుండా ఉంటుంది. చెమటలో ఎక్కువగా పొటాషియం పోతుంది. దీంతో తల్లికి బిడ్డకు ఇద్దరికి ఇబ్బందులు ఏర్పడతాయి. గర్భిణులు రోజు 350 క్యాలరీల అధిక ఆహారం తీసుకోవాలి.

సాక్షి: శిశువుల సంరక్షణ ఎలా?

డాక్టర్: శిశువులకు ప్రతీ మూడు గంటలకు ఒకసారి తప్పనిసరిగా తల్లిపాలు/పోతపాలు పట్టించాలి. ఎండప్రభావంతో శిశువుల కళ్లు డల్‌గా మారడం, చర్మం పొడిబారడం, జబ్బుపడ్డ లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా డాక్టర్‌ను సంప్రదించి చికిత్స అందించాలి.

ఆరోగ్య తెలంగాణ దిశగా బస్తీ దవాఖానాలు

- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్‌టౌన్: పట్టణాల నుంచి పల్లెల వరకు సత్వర వైద్య సహాయాన్ని అందించి ఆరోగ్య తెలంగాణను సాధించే దిశగా బస్తీ దవాఖానాలను ఆచరణలోకి తీసుకవచ్చినట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని పద్మనగర్‌లో రూ.21.30 లక్షలతో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాను ప్రారంభించి మాట్లాడారు. గతంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం అంటేనే భయపడే రోజులుండేవని, ఇప్పుడు కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా సకల వసతులు, సదుపాయాలను ప్రభుత్వ ఆసుపత్రుల్లో కల్పించడంతో ప్రభుత్వ వైద్యంపై బలమైన నమ్మకాన్ని ఏర్పడిందన్నారు. ఆరోగ్య తెలంగాణ లక్ష్యమే దిశగా ప్రతీ 10వేల మందికి ఒక బస్తీ దవాఖానాను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బస్తీ దవాఖానాలో ఒక డాక్టర్, ఒక స్టాఫ్ నర్స్, ఒక నర్స్‌తోపాటు, మందులు, రోగ నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉంటాయన్నారు. అనంతరం మంత్రి, మేయర్‌లు వైద్యపరీక్షలు చేయించుకున్నారు. బస్తీ దవాఖానాను ఆనుకొని ఏర్పాటు చేసిన యోగా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, మేయర్ సునీల్‌రావు, డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి, కార్పొరేటర్లు బోనాల శ్రీకాంత్, గందె మాధవి, గుగ్గిళ్ల జయశ్రీ, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, తహసీల్దార్ వెంకట్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



బస్తీ దవాఖానాను ప్రారంభిస్తున్న మంత్రి గంగుల

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

కరీంనగర్‌కార్పొరేషన్: నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం నగరంలోని పద్మనగర్, మార్కండేయనగర్, సప్తగిరికాలనీల్లో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమాల్లో మేయర్ సునీల్‌రావు, కార్పొరేటర్లు బోనాల శ్రీకాంత్, దిండిగాల మహేష్, యునైటెడ్ ముస్లిం, రజక సంఘాల నాయకులు కలీం, షాదుల్, అజీమ్, పూసాల సంపత్ పాల్గొన్నారు.

ఏసీడీ చార్జీలు ఎత్తివేయాలని బీజేపీ ధర్నా

కొత్తపల్లి(కరీంనగర్): గృహ విద్యుత్ వినియోగదారుల నుంచి ముందస్తు డిపాజిట్ బిల్లుల పేరిట విద్యుత్ సంస్థ చేస్తున్న వసూళ్లను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని విద్యుత్‌భవన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఏసీడీ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏసీడీ చార్జీలు రద్దు చేసినట్లే చేసి మళ్లీ వసూలు చేయాలని చూస్తోందని మండిపడ్డారు. కరెంటు, ఆర్టీసీ, పెట్రోల్, డీజిల్, రిజిస్ట్రేషన్ చార్జీలు, ఇంటిపన్ను, మద్యం ధరల పెంపు ఇలా ఏ ఒక్క రంగాన్ని వదలకుండా కేసీఆర్ సర్కార్ అడ్డగోలుగా ధరలు పెంచి ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు మాడ వెంకటరెడ్డి, గుర్రాల వెంకట్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధులు బొంతల కల్యాణ్ చంద్ర, జానపట్ల స్వామి, సత్యనారాయణరెడ్డి, సుధాకర్, దుర్శెట్టి సంపత్, జాడి బాల్‌రెడ్డి, బండ రమణారెడ్డి, పెరుక శ్రావణ్, పుప్పాల రఘు, బల్వీర్ సింగ్, కరీంనగర్ జోన్ల అధ్యక్షులు నరహరి లక్ష్మారెడ్డి, పాదం శివరాజ్, ఆవుదుర్తి శ్రీనివాస్, మామిడి చైతన్య, మామిడి రమేశ్, రాగి సత్యనారాయణ పాల్గొన్నారు.



విద్యుత్ భవన్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

విత్తన రాయితీకి మంగళం

- కేవలం జీలుగ, పచ్చిరొట్ట విత్తనాలే పంపిణీ
- ఇతర పంటలు, కూరగాయల విత్తనాల్లేవిక
- ఆరేళ్లుగా జాడలేని ఆర్‌కేవీవై
- రైతులపై పెను భారం

విత్తనాలు	అలాట్‌మెంట్ (క్వింటాళ్లలో)	క్వింటాల్ ధర (రూ.లలో)	రాయితీ (రూ.లలో)	రైతు ఇవ్వాల్సింది (రూ.లలో)
జీలుగ	8,357	6,325	4,111	2,214
జనుము	500	8,325	5,411	2,914

కరీంనగర్ అర్బన్: సాగులో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్న ప్రభుత్వం మరోవైపు పలు రకాల విత్తనాలపై రాయితీని ఎత్తేసింది. మూడేళ్ల క్రితం వరకు ఇచ్చిన రాయితీకి మంగళం పాడింది. ప్రతీ సీజన్‌లో రైతులకు రకాన్ని బట్టి రాయితీపై విత్తనాలు పంపిణీ చేస్తుండగా రాయితీని ఎత్తివేయడంతో రైతులకు అదనపు భారం పడుతోంది. కేవలం పచ్చిరొట్ట విత్తనాలను 65శాతం రాయితీపై అందించాలని జిల్లా వ్యవసాయ శాఖను ఆదేశించింది. విత్తనాలు జిల్లాకు చేరగా రాయితీ వివరాలను అధికారులు వెల్లడించారు. పచ్చిరొట్ట(నేలలో సారం పెంచే) జీలుగ, జనుము విత్తనాలను ఇవ్వనున్నారు. పిల్లి పెసరకు కూడా రాయితీ ఇవ్వగా జిల్లాకు అలాట్‌మెంట్ ఇవ్వలేదు.

జీలుగ, జనుము మాత్రమే

సాగు నేలలో సారం పెంచే జీలుగ, జనుము విత్తనాలను మాత్రమే రాయితీపై ఇస్తున్నారు. పిల్లి పెసర విత్తనాలకు రాయితీ ప్రకటించినప్పటికీ జిల్లాకు కేటాయించ లేదు. మొత్తం 8వేల క్వింటాళ్లకు పైగా విత్తనాలను జిల్లాకు కేటాయించారని జిల్లా వ్యవసాయ అధికారి వి.శ్రీధర్ వివరించారు. జిల్లాలోని 18 ఆగ్రోస్ సేవా కేంద్రాలతో పాటు 31 డీసీఎంఎస్ కేంద్రాలు, 24 ప్రాథమిక సహకార సంఘాల ద్వారా ఆన్‌లైన్ విధానంలో అందిస్తామని తెలిపారు.

ఇతర విత్తనాల రాయితీకి స్వస్తి

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో సుమారు 3.36 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తారని వ్యవసాయ అధికారుల అంచనా. ఇందులో ఎక్కువ వరి, పత్తి, కందులు, పెసర, మినుము, జొన్న వంటి పంటలను సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. గతేడాది 3.26లక్షల ఎకరాల్లో సాగు చేయగా ఈసారి అదనంగా 10వేలకు పైగా ఎకరాల్లో పంటలు సాగు చేయనున్నట్లు సమాచారం. ఈసారి పత్తి సాగు విస్తీర్ణాన్ని వీలైనంత వరకు పెంచనున్నారు. మొక్కజొన్న, కందులు, అపరాలు, తృణధాన్యాలను కూడ ప్రోత్సహించనున్నారు. జిల్లాలో రైతులు ఎక్కువగా ఆగ్రోస్ సేవాకేంద్రాలు, డీసీఎంఎస్, పీఏసీఎస్, ఎఫ్‌పీవో కేంద్రాల్లో విత్తనాలను కొనుగోలు చేస్తుంటారు. సారం పెంచేవే తప్పా ఆయా పంటల విత్తనాలకు రాయితీ లేకపోగా సదరు విత్తనాల ఊసే లేదు. ప్రధాన పంటల్లో వరిలో అన్ని రకాలు, పెసర, కంది, మినుము విత్తనాలకు రాయితీ ఇవ్వలేదు. 2019 వానాకాలం సీజన్‌లో వీటిని 50శాతం రాయితీపై రైతులకు అందించారు. రాయితీ లేకపోవడంతో రెట్టింపు ధర చెల్లించడం ఈసారి రైతులకు భారంగా మారింది. వరి దొడ్డు రకాలు 30కిలోల బస్తా ఎంటీయూ 1010 రూ.900, కేఎస్‌ఎం118 రూ.900 ఉండగా గతేడాది రూ.450లకే రాయితీపై అందించారు. ప్రస్తుతం రాయితీ లేక రెట్టింపు ధర చెల్లించాల్సి వస్తోంది. ఈ నాలుగు పంటలపైనే రూ.1.30కోట్ల భారం పడుతోంది.

అటకెక్కిన ఆర్‌కేవీవై

ఇదిలా ఉండగా ఉద్యాన శాఖ ద్వారా కూరగాయల విత్తనాలను రాయితీపై అందించేవారు. ఐదేళ్ల నుంచి వాటి ఊసే లేదు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవీవై) పథకం కింద రాయితీపై కూరగాయల విత్తనాల పంపిణీ చేసేవారు. ఆరేళ్లుగా ఆ ఊసే లేకపోవడంతో రైతులకు అదనపు భారం పడుతుండగా కూరగాయలు సాగు చేసే రైతుల సంఖ్య ఏటేటా తగ్గుతోంది. జిల్లాలో కరీంనగర్ రూరల్, తిమ్మాపూర్, రామడుగు, మానకొండూరు, శంకరపట్నం, హుజూరాబాద్, జమ్మికుంట తదితర ప్రాంతాల్లో 10వేల ఎకరాల్లో కూరగాయలు సాగయ్యేవి. అయితే కూరగాయలు సాగు చేసే రైతులను ప్రోత్సహించడంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త భాగస్వామ్యంతో పథకానికి రూపకల్పన చేశారు. 50శాతం రాయితీతో గరిష్ఠంగా ఒక రైతుకు ఐదెకరాల వరకు అవసరమైన విత్తనాలు అందించేవారు.



ఆర్థిక భారం

2015–16 వరకు చాలా మంది సన్న, చిన్న కారు రైతులు రాయితీపై అందించే కూరగాయల విత్తనాలను తీసుకునేవారు. దీనివల్ల వారికి కొంత పెట్టుబడి తగ్గేది. నాణ్యమైన విత్తనం అందేది. సగం రాయితీపై ఇవ్వడంతో పెట్టుబడి తగ్గేది. రాయితీకి స్వస్తి పలకడంతో ఆర్థికంగా ఇబ్బందులు తప్పడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్రీడల్లో రాణించాలి



చొప్పదండి: క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనాలని ట్రెయినీ కలెక్టర్ లెనిన్ వి టిప్పో అన్నారు. బుధవారం పట్టణంలోని క్రీడా మైదానంలో నిర్వహించిన మండలస్థాయి సీఎం కప్ క్రీడల ముగింపు వేడుకలకు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. అథ్లెటిక్స్ 100, 400 మీటర్ల పరుగు పందెంలో శేఖర్ ప్రథమ, ఆశ్రిత్ రెండోస్థానం సాధించారు. మహిళా విభాగంలో 100 మీటర్ల పరుగులో వైష్ణవి ప్రథమ, అంకిత రెండోస్థానం పొందారు. 400 మీటర్ల పరుగులో అక్షయ ప్రథమ, సౌమ్య ద్వితీయ స్థానం, పురుషుల షాట్‌పుట్‌లో శేఖర్ ప్రథమ, మహిళా విభాగంలో అంకిత మొదటి బహుమతి సాధించింది. కబడ్డీలో అర్నకొండ జట్టు విజేతగా నిలవగా చొప్పదండి రన్నపర్‌గా, వాలీబాల్‌లో చొప్పదండి, వెదురుగట్ట జట్లు ప్రథమ, ద్వితీయస్థానాలు సాధించారు. ఎంపీపీ చిలుక రవీందర్, ప్రత్యేకాధికారి రాంబాబు, తహసీల్దార్ అంబటి రజిత, ఎంపీవో రాజగోపాల్, ము న్సిపల్ కమిషనర్ శాంతి కుమార్, మేనేజర్ ప్రశాంత్ కుమార్, క్రిష్ణ, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్సీ కవితను కించపర్చేలా పోస్టులు పెట్టినవారిపై కేసు

కరీంనగర్ క్రైం: సోషల్ మీడియాలో ఎమ్మెల్సీ కవితను కించపర్చేలా పోస్టులు పెట్టిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ త్రీటౌన్ పోలీసులు తెలిపారు. బీజేవైఎం నాయకులు సంపత్, కల్యాణ్‌లు పోస్టులు పెట్టారని బీఆర్ఎస్ యూత్ ప్రతినిధి కుల్దీప్ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

21న ఉచిత శిక్షణకు ప్రవేశ పరీక్ష

కరీంనగర్: తెలంగాణ స్టేట్ షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ కోర్సు–1 బ్యాచ్–2023 పోటీ పరీక్షల ఉచిత శిక్షణకు ఈ నెల 21న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి నేతానియల్, స్టడీ సర్కిల్ డైరెక్టర్ బండ శ్రీనివాస్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అభ్యర్థులను ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తామన్నారు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జగిత్యాల రోడ్‌లోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్లను ఈ నెల17 నుంచి www.tsstudycircle.co.in వెబ్ సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి

- జమ్మికుంట రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై ఘటన



జమ్మికుంట(హుజూరాబాద్): స్థానిక రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై గుర్తు తెలియని ఓ వృద్ధురాలు మృతి చెందింది. రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ గంగారపు తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై బుధవారం ఓ వృద్ధురాలు మృతిచెందినట్లు ప్రయాణికులు గుర్తించారు. మృతురాలి వయసు 75 ఏళ్ల వరకు ఉంటుంది. ఆమె మృతికి ఎండ తీవ్రతనా లేక అనారోగ్యమా అన్న కారణాలు తెలియలేదు. మృతురాలి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేవని, ఒంటిపై వంకాయ రంగ బ్లౌజ్, కనకాంబరం రంగుతో చుక్కల చీర ధరించిందని హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. ఆమె మృతదేహాన్ని హుజూరాబాద్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచామన్నారు. వివరాలు తెలిసినవారు 99493 04574, 94407 00039 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రైలు కిందపడి యువకుడి బలవన్మరణం



అజయ్‌కుమార్ (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): రైలు కిందపడి, ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రామగుండం రైల్వే హెడ్ కానిస్టేబుల్ గంగారపు తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని కల్వల గ్రామానికి చెందిన మారమల్ల అజయ్‌కుమార్ (19) వీణవంక మండల కేంద్రంలోని ఓ టిఫిన్ సెంటర్‌లో పని చేసేవాడు. మద్యానికి బానిసవడంతో అనారోగ్యానికి గురయ్యాడు. కుటుంబసభ్యులు పలుమార్లు ఎంజీఎంలో వైద్యం చేయించారు. అయినా అతను తాగడం మానలేదు. దీంతో అనారోగ్యం నుంచి కోలుకోకుండా మనస్తాపానికి గురై, బుధవారం జమ్మికుంట రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి, ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి రాజేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ పేర్కొన్నారు.

‘ఆదర్శ’లో ఇంటర్మీడియట్ ప్రవేశాలు

- ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఈ నెల 25 వరకు గడువు
- ఒక్కో పాఠశాలలో 160 సీట్లు
- ఆంగ్ల మాధ్యమంలో బోధన
- బాలికలకు హాస్టల్ వసతి
- జిల్లాలో 11 మోడల్ స్కూళ్లు



ఆదర్శ పాఠశాల

కరీంనగర్: ఇంటర్మీడియట్ ఆంగ్ల మాధ్యమంలో చదవాలనుకునే గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆదర్శ పాఠశాలలు ఓ వరం. 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్‌లో ప్రవేశాల కోసం ఈ నెల16 నుంచి 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు నోటిఫికేషన్ వెలువడింది. పదోతరగతిలో ఉత్తీర్ణులైనవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

ఒక్కో గ్రూపులో 40 సీట్లు..

కరీంనగర్ జిల్లాలో చొప్పదండి మండలంలోని రుక్మాపూర్, కరీంనగర్ మండలంలోని ఎలగందల్, మానకొండూర్ మండలంలోని పోచంపల్లి, రామడుగు, వీణవంక, జమ్మికుంట మండలంలోని టేకుర్తి, చిగురుమామిడి మండలంలోని ముల్కనూర్, గంగాధర, శంకరపట్నం, తిమ్మాపూర్, సైదాపూర్‌లలో ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. ప్రతీ పాఠశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులుండగా ఒక్కోదానిలో 40 సీట్ల చొప్పున 160 సీట్లు కేటాయించారు.

ఎంసెట్, నీట్, సీఏ, సీపీటీ కోచింగ్..

ఎంపికైన విద్యార్థులకు ఇంటర్ విద్యతోపాటు ఎంసెట్, నీట్, సీఏ, సీపీటీ కోచింగ్ ఇస్తారు. వివిధ ఉన్నతస్థాయి చదువులకు మార్గదర్శనం చేస్తారు. విద్యార్థులందరికీ ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందజేస్తారు. ఆసక్తి గలవారు అడ్మిషన్ పొందేందుకు ఇంటర్నెట్ లేదా మీసేవ, ఈసేవ సెంటర్లలో దరఖాస్తు చేసుకోవాలి.

100 మందికి హాస్టల్ సౌకర్యం..

ఆదర్శ పాఠశాలల్లో బాలికలకు హాస్టల్ వసతి ఉంది. పూర్తిస్థాయి భవన నిర్మాణాలు, మౌలిక వసతులు లేని పాఠశాలల్లో ఈ సౌకర్యం కల్పించడం లేదు. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభంలోగా నిర్మాణాలు పూర్తయితే కల్పించనున్నారు. 9, 10 తరగతులతోపాటు ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న 100 మందికే అవకాశం ఉంది. హాస్టల్‌కు కనీసం మూడు కిలోమీటర్ల నుంచి ఆపై దూరంగా ఉండేవారు మాత్రమే వసతిగృహంలో ప్రవేశానికి అర్హులు.

రిజర్వేషన్ల వారీగా సీట్ల వివరాలు..

(ప్రతి గ్రూపునకు 40 సీట్లు.. కేటాయింపు ఇలా..)

కేటగిరీ	శాతం	సీట్లు	జనరల్	బాలికలు
జనరల్	50	20	13	07
ఎస్సీ	15	06	04	02
ఎస్టీ	06	02	01	01
బీసీ–ఏ	07	03	02	01
బీసీ–బీ	10	04	03	01
బీసీ–సీ	01	00	00	00
బీసీ–డీ	07	03	02	01
బీసీ–ఈ	04	02	02	00

సద్వినియోగం చేసుకోండి



మోడల్ స్కూళ్లలో నాణ్యమైన విద్య అందుతోంది. వసతులున్నాయి. మంచి ఫలితాలు వస్తున్నాయి. జిల్లాలోని 11 ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు తమకు ఇష్టమైన కోర్సుల్లో ప్రవేశాలు పొందాలి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– జనార్దన్‌రావు, డీఈవో

‘ఆ టీచర్ల డ్యూటీ సర్టిఫికెట్లు ఫేక్?’


జగిత్యాల: జిల్లాలో ఇటీవల జరిగిన ఇంటర్మీడియట్ మొదటి, రెండో సంవత్సరం పరీక్షలకు పర్యవేక్షకులుగా సారంగాపూర్ మండలంలోని 10 మంది ఉపాధ్యాయులను మార్చి 15 నుంచి ఏప్రిల్ 1 వరకు రిలీవ్ చేశారు. దీంతో వారు మార్చి 14న మధ్యాహ్నం 2 గంటలకు సదరు పరీక్ష కేంద్రాల్లో రిపోర్ట్ సైతం చేశారు. కానీ వీరిలో కొందరు టీచర్లు అటు ఇంటర్మీడియట్ పరీక్షల పర్యవేక్షణకు, ఇటు పాఠశాలలకు వెళ్లలేదు.

అన్నీ ప్రెజెంట్ అని వేసుకున్నారు..

ఇంటర్మీడియట్ పరీక్షల పర్యవేక్షణకు వెళ్లిన టీచర్లు తిరిగి పాఠశాలల్లో జాయిన్ అయ్యే సమయంలో హెచ్‌ఎంలకు, హెచ్‌ఎంలే అయితే ఎంఈవోలకు డ్యూటీ సర్టిఫికెట్లు అందజేయాల్సి ఉంటుంది. కానీ అవి అందజేయకుండానే ఉపాధ్యాయులు తమ విధుల్లో చేరారు. 15 రోజులకు సంబంధించిన జీతం సైతం తీసుకున్నారు. ‘సాక్షి’ దినపత్రికలో ‘ఇన్విజిలేషన్‌కు వెళ్లలేదు’ అనే శీర్షికన వార్త ప్రచురితం కావడంతో సంబంధిత ఎంఈవో ఈ నెల 15వ తేదీలోపు డ్యూటీ సర్టిఫికెట్లు అందించాలని వారిని ఆదేశించారు. దీంతో కొందరు అందజేశారు. వీరిలో పర్యవేక్షకులుగా పనిచేయనప్పటికీ ఫేక్ సర్టిఫికెట్ సృష్టించి, ఎంఈవోకు అందించినట్లు తెలిసింది. రిలీజ్ ఆర్డర్‌లో ఇంటర్మీడియట్ అధికారులు కంప్యూటర్ షీట్‌లో అబ్‌సెంట్, ప్రెజెంట్ వేశారు. కానీ కొందరు టీచర్లు వాటిని జిరాక్స్ తీసుకొని, చేతితో అన్నీ ప్రెజెంట్ అని వేసుకున్నారు. కాగా, మార్చి 15 నుంచి వీరు విధుల్లో చేరుతున్నట్లు ఉండగా డ్యూటీ సర్టిఫికెట్‌లో మాత్రం 10 నుంచే వెళ్లినట్లు పెట్టారు. అలాగే పేర్లను అధికారులు పెన్నుతో రాయగా కొందరు కంప్యూటర్ షీట్‌లో టైప్ చేసుకున్నారు. ఎవరి ఇష్టానుసారంగా వారు డ్యూటీ సర్టిఫికెట్లు తయారు చేసి, అందజేశారు. ఇవి ఫేక్ డ్యూటీ సర్టిఫికెట్లు అని స్పష్టంగా తెలుస్తోంది. పూర్తిస్థాయిలో విచారణ చేపడితే నిజానిజాలు బయటపడతాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై సారంగాపూర్ ఎంఈవో భీమయ్యను వివరణ కోరగా డ్యూటీ సర్టిఫికెట్లు తీసుకొని, డీఈవోకు పంపించామని, ఆయన పరిశీలిస్తారని తెలిపారు.



ఒక సర్టిఫికెట్‌లో హ్యాండ్ రైటింగ్..



మరో సర్టిఫికెట్ కంప్యూటర్ షీట్‌లో..


వెల్గొండలో షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- రూ.10 లక్షలకు పైగా ఆస్తి నష్టం



బుగ్గారం(ధర్మపురి): మండలంలోని వెల్గొండలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి, ఓ ఇల్లు దగ్ధమైంది. సామగ్రి కాలిబూడిదవగా కుటుంబసభ్యులు నిరాశ్రయులయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన పెసరి అశోక్, పాండు సోదరులు. వీరి ఇంట్లో బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. చుట్టుపక్కలవారు గమనించి అగ్రిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ అదుపులోకి రాలేదు. ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. అగ్రిమాపక సిబ్బంది వచ్చి, మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయినప్పటికీ సమీపంలోని రెండు ఇళ్లు పాక్షికంగా కాలిపోయాయి. మంటలు చెలరేగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. అశోక్, పాండు ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లారు. సంఘటన స్థలాన్ని తహసీల్దార్ ఫారుఖ్ పరిశీలించి, నష్టాన్ని అంచనా వేశారు. రూ.10 లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు. తక్షణసాయంగా బాధితులకు బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. జెడ్పీటీసీ సభ్యుడు బాదినేని రాజేందర్ వారిని పరామర్శించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి, అన్ని విధాలా ఆదుకునేందుకు కృషి చేస్తామన్నారు. తన వంతు తక్షణసాయంగా రూ.10 వేలు అందించారు. బాధితులకు ప్రస్తుతం వారి బంధువుల ఇంట్లో ఆశ్రయం కల్పించారు.

జవాన్ అనిల్ కుటుంబానికి ఆర్థికసాయం



బోయినపల్లి(చొప్పదండి): ఇటీవల జమ్మూ–కశ్మీర్‌లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో మల్కాపూర్‌కు చెందిన జవాన్ పబ్బాల అనిల్ మృతిచెందిన విషయం విదితమే. బాధిత కుటుంబాన్ని మైత్రి గ్రూప్ చైర్మన్ కొత్త జైపాల్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా అనిల్ భార్య సౌజన్య, తల్లి లక్ష్మిలకు రూ.50 వేల ఆర్థికసాయం అందించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. సర్పంచ్‌లు రాజ్యలక్ష్మి, నరేశ్, నాయకులు భాగ్యలత, కిషన్, సత్యనారయణ, రామానుజం, రమేశ్, సతీశ్, రాజేశం, రాజిరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు
- రాఘవపేట వద్ద ఎదురెదురుగా ఢీకొన్న బైక్‌లు



ఘటనాస్థలిలో షేక్ అప్సర్ మృతదేహం

మల్లాపూర్(కోరుట్ల): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. మెట్‌పల్లి పట్టణానికి చెందిన షేక్ అప్సర్(34) బుధవారం ద్విచక్ర వాహనంపై నిర్మల్ జిల్లా ఖానాపూర్ వెళ్లి, తిరిగి వస్తున్నాడు. మొగిలిపేట గ్రామానికి చెందిన దండ్ల సాయిలు బైక్‌పై మెట్‌పల్లి వెళ్లి తిరిగివస్తుండగా రాఘవపేట పెట్రోల్ బంక్ వద్ద రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో షేక్ అప్సర్ తలకు బలమైన గాయమై, అక్కడికక్కడే మృతిచెందాడు. సాయిలు తీవ్రంగా గాయపడటంతో స్థానికులు మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ముంతాజ్ బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

మహిళ ఆత్మహత్య

పెగడపల్లి(ధర్మపురి): మండలంలోని బతికపల్లి శివారు కొండాయపల్లికి చెందిన బోగు లత (38) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కుమారస్వామి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం .. లత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా నయం కావడం లేదు. ఈ క్రమంలో బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో కడుపునొప్పి తీవ్రమవడంతో ఆ బాధ భరించలేక దూలానికి ఉరేసుకుంది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వడదెబ్బతో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గోదావరిఖని(రామగుండం): గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పవర్‌హౌస్‌కాలనీ శివాలయం సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి(40) బుధవారం మృతి చెందాడు. కొంతకాలంగా భిక్షాటన చేస్తూ, చెత్తను ఏరుకుంటూ బతికే ఇతను ఎండదెబ్బకు గురై మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మార్చురిలో భద్రపర్చామని, సంబంధికులు ఎవరైన ఉంటే వన్‌టౌన్ ఎస్సై కమలాకర్‌ను 8712581052లో సంప్రదించాలని కోరారు.

వ్యక్తిపై చీటింగ్ కేసు

జ్యోతినగర్(రామగుండం): భూమి విక్రయిస్తానని డబ్బులు తీసుకొని, రిజిస్ట్రేషన్ చేయకుండా మోసగించిన వ్యక్తిపై ఎన్టీపీసీ పోలీసు స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. తన సమీప బంధువు పెద్దపల్లికి చెందిన అలుగువెల్లి సతీశ్ మూడు గుంటల స్థలం విక్రయిస్తానని తన వద్ద రూ.16.80 లక్షలు తీసుకున్నాడని ఎన్టీపీసీ ఠాణా పరిధిలోని మాతంగికాలనీకి చెందిన పోలంపల్లి స్వరూప ఆరోపించింది. తాను మోసపోయానని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సతీశ్‌పై చీటింగ్ కేసు నమోదు చేసి, విచారణ జరుపుతున్నట్లు వారు తెలిపారు.

గ్రామాల్లో పచ్చదనం పెంపొందించాలి

- పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ జాయింట్ కమిషనర్ శ్రీనివాస్
- విలాసాగర్‌లో పర్యటన



పల్లె ప్రకృతి వనం పరిశీలించిన జాయింట్ కమిషనర్ శ్రీనివాస్

జమ్మికుంట(హుజూరాబాద్): గ్రామాల్లో పచ్చదనం పెంపొందించి, ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలని పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ జాయింట్ కమిషనర్ ఎ.శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా జమ్మికుంట మండలంలోని విలాసాగర్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో పల్లె ప్రకృతి వనం, ఇంకుడు గుంతలు, జీపీ నర్సరీ, కంపోస్ట్ షెడ్డు, అవెన్యూ ప్లాంటేషన్ తదితరాలను పరిశీలించారు. గ్రామ పంచాయతీ నిర్వహణ బాగుందని అభినందించారు. సర్పంచ్ పింగిళి రమాదేవి, కరీంనగర్ డీఎల్‌పీవో హరికృష్ణ, హుజూరాబాద్ డివిజినల్ డీఎల్‌పీవో శ్రీలత, ఎంపీడీవో కల్పన, ఎంపీవో సతీశ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మనోహర్‌రెడ్డి, వార్డు సభ్యులు తదితరులున్నారు.

అనాథ, పేద బాలురకు ఉచిత విద్య

- భోజన వసతితో ఇంగ్లిష్ మీడియం బోధన
- రంగినేని ట్రస్ట్‌లో డిజిటల్ తరగతులు
- ట్రస్ట్ చైర్మన్ నవీన్‌రావు



మాట్లాడుతున్న ట్రస్ట్ చైర్మన్ నవీన్‌రావు

సిరిసిల్ల: పట్టణ శివారులోని రంగినేని ట్రస్ట్‌లో అనాథ, పేద బాలురకు ఉచితంగా ఇంగ్లిష్ మీడియం విద్యనందిస్తామని ట్రస్ట్ చైర్మన్ నవీన్‌రావు తెలిపారు. సిరిసిల్ల ప్రెస్ క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రంగినేని ట్రస్ట్‌లో రెండు దశాబ్దాలపాటు అనాథ, పేద విద్యార్థులకు విద్యాబోధన చేశామని, 2020లో కరోనా లాక్‌డౌన్ కారణంగా స్కూల్ బంద్ చేసినట్లు తెలిపారు. 19 మంది పిల్లలను ప్రభుత్వ స్కూల్‌కు పంపించామన్నారు. ప్రస్తుతం 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు బాలురకు భోజన వసతితో ఇంగ్లిష్ మీడియంలో డిజిటల్ తరగతులతో విద్యాబోధన అందించేందుకు ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు రంగినేని మోహన్‌రావు నిర్ణయించారని చెప్పారు. స్కూల్ కరస్పాండెంట్ తూడి వెంకట్‌రావు మాట్లాడుతూ.. ట్రస్ట్‌లో చదువుకున్న విద్యార్థులు చాలా మంది దేశ, విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారని, వివిధ స్థాయిల్లో ప్రభుత్వ ఉద్యోగులుగా స్థిరపడ్డారని తెలిపారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ గాజుల ప్రతాప్ పర్యవేక్షణలో ఇంగ్లిష్ మీడియం రెసిడెన్షియల్ స్కూల్ నడుపుతామని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ట్రస్ట్‌లో అబ్బాయిలను చేర్పించవచ్చన్నారు. ప్రస్తుతం బాలికలను తీసుకోవడం లేదని తెలిపారు. సమావేశంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ గాజుల ప్రతాప్, ప్రముఖ విద్యావేత్త మడుపు ముత్యంరెడ్డి, ఉపాధ్యాయుడు నీలం అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

దొరికిన పర్సు పోలీసులకు అప్పగింత



యువకులను సన్మానిస్తున్న ఎస్సై సతీశ్

కోరుట్లటౌన్: బంగారం, నగదు ఉన్న బ్యాగు ఇద్దరు యువకులు దొరికింది.. దాన్ని వారు పోలీసులకు అప్పగించి, నిజాయితీ చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కోరుట్ల పట్టణంలోని ఓ ఫొటో స్టూడియోలో పని చేస్తున్న ఎల్ల సాయి, దామ రాజేశ్‌లకు పాత ఆనంద్ షాపింగ్ మాల్ వద్ద బుధవారం ఉదయం గులాబీ రంగు పర్సు దొరికింది. ఈ విషయాన్ని వారు తమ యజమాని దృష్టికి తీసుకెళ్లారు. ఆయన పోలీసులకు ఇస్తే, పోగొట్టుకున్నవారికి ఇస్తారని సూచించారు. దీంతో ఆ యువకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి, ఎస్సై సతీశ్‌కు అందజేశారు. పర్సులో 2 తులాల బంగారు ఆభరణం, 1 తులం బంగారు బిస్కెట్, రూ.1,000 ఉన్నాయి. పోలీసులు సంఘటన స్థలానికి సంబంధించిన సీసీ ఫుటేజీ పరిశీలించి, బాధితురాలు మెట్‌పల్లి పట్టణానికి చెందిన ధనలక్ష్మికి సమాచారం ఇచ్చారు. ఆమె పోలీస్‌స్టేషన్‌కు రావడంతో ఆధారాలు పరిశీలించి, పర్సు అప్పగించారు. నిజాయితీ చాటుకున్న యువకులను ఎస్సై అభినందించి, శాలువాలతో సన్మానించారు.

కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలి



రైల్వే కాంట్రాక్టు కార్మికులతో రమేశ్

గోదావరిఖని(రామగుండం): సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు తోకల రమేశ్ కోరారు. ఆర్జీ–1 ఏరియా సీఎస్పీ రైల్వే కాంట్రాక్టు కార్మికుల సమావేశం బుధవారం నిర్వహించారు. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ప్రతీ నెల 7వ తేదీలోపు వేతనాలు ఇవ్వాలని డైరెక్టర్ ఇచ్చిన ఆదేశాలు అమలు చేయాలని కోరారు. పేరుకే సర్క్యులర్లు జారీ చేస్తూ దానిపై సమీక్ష లేకుండా, కనీస పర్యవేక్షణ లేకుండా సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులపై నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందన్నారు. సకాలంలో వేతనాలు అందక కాంట్రాక్టు కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైన సింగరేణి యాజమాన్యం జోక్యం చేసుకొని డైరెక్టర్ ఇచ్చిన సర్క్యులర్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కె.శంకర్, ఎం.సమ్మయ్య, చిన్నయ్య, మధు, కొయ్యడ సురేశ్, శనిగరపు కృష్ణ, గాజుల రమేశ్, గంగుల వెంకటేశ్, భూదారపు సురేశ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

- కూతురు పెళ్లికి చేసిన అప్పు తీర్చలేక ఈ నెల 16న ఆత్మహత్యాయత్నం



శ్రీనివాస్ (ఫైల్)

సుల్తానాబాద్ రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల గ్రామానికి చెందిన కలబోని శ్రీనివాస్(50) చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై విజేందర్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ కూలీ పని చేసేవాడు. ఇతనికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. అప్పు చేసి, కూతురు పెళ్లి జరిపించాడు. అప్పు తీర్చలేక, వడ్డీ చెల్లించలేక తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం గ్రామ శివారులోని చెరువు కట్టపై క్రిమిసంహారక మందు తాగాడు. తర్వాత ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు ఫోన్‌లో తెలిపాడు. వారు వెంటనే అతన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తొలుత కరీంనగర్, అనంతరం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం చనిపోయాడు. మృతుడి భార్య స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

20న పౌర హక్కుల సంఘం బహిరంగ సభ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

విద్యానగర్(కరీంనగర్): ఛత్తీస్‌గఢ్ ఆదివాసీ గ్రామాలపై కేంద్ర ప్రభుత్వ యుద్ధ హెలికాప్టర్ల దాడులను నిలిపివేయాలని, ఆదివాసీల జీవించే హక్కుకు భంగం కలిగించొద్దన్న డిమాండ్లతో ఈ నెల 20న పెద్దపల్లిలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పౌర హక్కుల, ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. ఈ మేరకు బుధవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో సంబంధిత వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెద్దపల్లిలోని మూన్ ఫంక్షన్‌హాల్‌లో బహిరంగ సభ జరుపుతున్నట్లు పేర్కొన్నారు. సంఘం ఉమ్మడి జిల్లా కమిటీ అధ్యక్షుడు శ్రీపతి రాజగోపాల్ అధ్యక్షతన జరిగే ఈ సభకు వక్తలుగా రాష్ట్ర పౌరహక్కుల సంఘం సీనియర్ కార్యవర్గ సభ్యుడు హరగోపాల్, రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎన్.నారాయణరావు, సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక చంద్రశేఖర్ హాజరవుతారని తెలిపారు. సంఘం ఉమ్మడి జిల్లా కమిటీ సహాయ కార్యదర్శి బొడ్డుపెల్లి రవి, గడ్డం సంజీవ్ కుమార్, ఉపాధ్యక్షుడు నార వినోద్, దళిత లిబరేషన్ ఫ్రంట్ ప్రధాన కార్యదర్శి మార్వాడీ సుదర్శన్ పాల్గొన్నారు.

తాళాలు వేసిన ఐదిళ్లలో చోరీ



విచారణ జరుపుతున్న పోలీసులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని చీకురాయి రోడ్, నారాయణస్వామినగర్‌లలోని ఐదిళ్లలో బుధవారం తెల్లవారుజామున దొంగలు పడ్డారు. 10 తులాల బంగారం, 8 తులాల వెండి, రూ.1.20 లక్షలు ఎత్తుకెళ్లారని ఎస్సై మహేందర్ తెలిపారు. బాధితులు వేగోలపు తిరుపతి, కట్ట రమేశ్, రాజన్న, బొల్లంపల్లి మహేశ్, ఇనుగాల రాజ్‌కుమార్ తమ ఇళ్లకు తాళాలు వేసి, కుటుంబసభ్యులతో కలిసి బంధువుల ఇళ్లలో జరిగిన కార్యక్రమాలకు వెళ్లారని పేర్కొన్నారు. క్లూస్ టీం, ఫింగర్‌ప్రింట్ నిపుణులు ఆధారాలు సేకరించారు.

క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



నగదు అందిస్తున్న నాయకులు

కరీంనగర్: ఆర్‌బీవీఆర్‌ఆర్ రెడ్డి సంక్షేమ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు నరహరి జగ్గారెడ్డి ఆధ్వర్యంలో పేదింటి యువతి వివాహానికి ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా సంఘం కార్యాలయంలో కార్యదర్శి గోపాల్‌రెడ్డి, కోశాధికారి కాసర్ల మధుకర్‌రెడ్డితో కలిసి రూ.13వేలు నగదు అందించారు. కొడిమ్యాల మండలం రామకిష్టాపూర్‌కు చెందిన భవానిరెడ్డి అనాథకు వివాహం నిశ్చయమైంది. సంఘం తరఫున బంగారు పుస్తెమెట్టెలకు నగదును పెండ్లి నిర్వాహకులు నారెడ్డి పద్మాకర్‌రెడ్డికి అందించినట్లు సభ్యులు తెలిపారు. సంఘంజిల్లా ఉపాధ్యక్షుడు గన్ను మహేందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులు దారం జగన్నాథరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మంచినీటి పైప్‌లైన్ పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజు

కొత్తపల్లి: పట్టణంలోని 4,5వ వార్డుల్లో రూ.4.50 లక్షలతో చేపట్టే మంచినీటి పైప్‌లైన్ పనులకు బుధవారం మున్సిపల్‌చైర్మన్ రుద్రరాజు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గున్నాల విజయ, మానుపాటి వేణుగోపాల్, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ ఫక్రుద్దీన్, ఏఈ ఆసీఫ్ నాయకులు జి.రమేశ్, ఎస్కే.బాబా, కట్ల సుధాకర్, మునావర్, జె.శ్రీకాంత్ పాల్గొన్నారు.

పేదల ఇళ్లు కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి



ఇళ్లు కూల్చిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎంఐఎం నాయకులు

విద్యానగర్: ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని చెబుతుంటే, ల్యాండ్‌మాఫియా కొమ్ముకాస్తు పేదల ఇళ్లను కూల్చిన రెవెన్యూ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంఐఎం కరీంనగర్ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ డిమాండ్ చేశారు. కరీంనగర్ 19వ డివిజన్ పరిధిలోని రేకుర్తిలో ఇళ్లు కూల్చిన ప్రాంతాలను పర్యటించి మాట్లాడారు. రేకుర్తిలోని 194 పట్టా స్థలంలో పర్మిషన్ ఉన్న ఇళ్లను సెలవురోజున ఏలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చడాన్ని తప్పుపట్టారు. ఇళ్లుకూల్చిన వారిపై చర్యలు తీసుకుని బాధితులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్‌చేశారు. కూల్చిన ఇళ్లను పరిశీలించిన వారిలో ఎంఐఎం నగర ప్రధానకార్యదర్శి బర్కత్ అలీ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అఖీల్ ఫిరోజ్, కార్పొరేటర్ శర్ఫుద్దీన్, నాయకులు ఆతిన, అజర్ దబీర్, యాకూబ్ ఖాన్, ఖమరుద్దీన్ ఉన్నారు.

మురుగునీరంతా ఇళ్లలోకే!

- పట్టించుకోని అధికారులు
- ఏళ్లుగా ఇదే సమస్య
- పెద్దమోరీతో తిప్పలు
- ముకరంపుర వాసుల గోడు

కరీంనగర్ కార్పొరేషన్: ఇళ్లల్లోని మురుగునీరంతా డ్రెయినేజీలోకి వెళ్లాలి... ఇదీ సిస్టం... కానీ ఇక్కడ పరిస్థితి వేరు.. డ్రెయినేజీ నీళ్లు ఇళ్లల్లోకి వస్తున్నాయి నగరం నడిబొడ్డున ముకరంపురలోని పెద్దమోరీ ప్రాంతంలో ఏళ్లుగా నలుగుతున్న సమస్య ఇదీ. ఈ సమస్య పరిష్కరించాలంటూ సంవత్సరాలుగా ఈ ప్రాంతవాసులు అధికారులు చుట్టూ తిరుగుతున్నా ఫలితం కనిపించడం లేదు. నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఆనుకొని వెళ్లే డ్రెయినేజీతో సమీప ప్రాంత వాసులు ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముకరంపుర, మంకమ్మతోట.. రెండు ప్రాంతాలకు చెందిన ఈ కాలనీలో దాదాపు 100కు పైగా ఇళ్లలోని వారు ఈ సమస్య ఎదుర్కొంటున్నారు. విద్యానగర్, భాగ్యనగర్, మంకమ్మతోట, జ్యోతినగర్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే ఈ పెద్ద డ్రెయినేజీలో ఎప్పుడూ మురుగు నీళ్లు పారుతూ ఉంటాయి. మోరీలో సిల్ట్ తీయకపోవడం, సైడ్‌వాల్స్ పూర్తిగా కూలిపోవడంతో మురుగునీరు నిలిచి ఇళ్లవైపు మళ్లుతున్నాయి. ఇళ్లలోని



ఇళ్ల పక్కనుంచి వెళ్తున్న డ్రెయినేజీ

మురుగునీరంతా ఈ పెద్దమోరీలోకి పైప్‌లైన్‌తో వదులుతుండడంతో డ్రెయినేజీ నిలిచినప్పుడల్లా మురుగునీరంతా అదే పైప్‌ల గుండా ఇళ్లలోకి రివర్స్‌లో వస్తున్నాయి. దీంతో కాలనీ వాసులు దుర్వాసన భరించలేకపోతున్నారు. క్రిమికీటకాలు, చెత్తాచెదారంతో ఇళ్లు అపరిశుభ్రంగా మారి, రోగాల బారిన పడుతున్నారు. ఈ ప్రధానవీధి ఓవైపు 55వ డివిజన్‌లో, మరో వైపు 60వ డివిజన్‌లో ఉండడం కూడా సమస్యగా మారినట్లు స్థానికులు వాపోతున్నారు. ఈ సమస్య ఎప్పటికీ ఉన్నప్పటికీ, వర్షాకాలంలో మాత్రం పరిస్థితి తీవ్రంగా ఉంటోంది. అందుకే వర్షాకాలానికి ముందుగానే మోరీపై శ్లాబ్ నిర్మిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని కాలనీవాసులు అధికారులను వేడుకుంటున్నారు. ఇటీవల కలెక్టరేట్ ప్రజావాణిలోనూ స్థానికులు ఫిర్యాదుచేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మోరీలో సిల్ట్‌తీసి శ్లాబ్ నిర్మించేలా చూడాలని కోరుతున్నారు.

పెద్దమోరీపై శ్లాబ్ నిర్మించాలి



పెద్దమోరీలో సిల్ట్ తీయకపోవడంతో మురుగునీరంతా మా ప్రాంతంలో నిలిచిపోవడంతో పాటు ఇళ్లల్లోకి వస్తున్నాయి. మురుగునీరు ఇళ్లలోకి రాకుండా చర్యలు చేపట్టాలి. మోరీ పక్కన చెట్లు విరిగి ఇళ్లపై పడుతున్నాయి. మోరీపై శ్లాబ్ నిర్మించి సమస్యకు అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలి. – డాక్టర్ బి.శ్రీనివాస్, స్థానికుడు

ముగిసిన మండలస్థాయి క్రీడోత్సవాలు



విజేతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంపీపీ లక్ష్మయ్య



సర్టిఫికెట్లు, మెడల్స్ అందిస్తున్న మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్

- విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు ప్రదానం
- పలు మండలాల్లో సర్టిఫికెట్లు అందజేత
- 22 నుంచి జిల్లాస్థాయి క్రీడా పోటీలు
- జిల్లాస్థాయి పోటీల్లో రాణించాలని..

కరీంనగర్‌స్పోర్ట్స్: సీఎంకప్ 2023 మండలస్థాయి క్రీడల సందడి ముగిసింది. ఈనెల 15నుంచి మూడు రోజులు జిల్లా వ్యాప్తంగా 16 మండలాల్లో ఆయా వేదికల్లో అట్టహాసంగా నిర్వహించిన మండలస్థాయి క్రీడాపోటీలు బుధవారంతో ముగిశాయి. మండలస్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి ట్రోఫీలు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కొన్ని మండలాల్లో కేవలం సర్టిఫికెట్లు మాత్రమే ప్రదానం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నిర్వహించిన ఈ పోటీలకు మంచి స్పందన లభించింది. ఈ మూడు రోజుల్లో భానుడి ప్రతాపం తీవ్రమవడంతో క్రీడాకారులు హాజరుకాలేకపోయారని పలు మండలకేంద్రాల్లోని నిర్వహణ కమిటీ సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా తొలిసారిగా నిర్వహించిన సీఎం కప్ 2023 ప్రశాంతంగా ముగిసింది. మండలస్థాయిలో రాణించిన క్రీడాకారులను జిల్లాస్థాయి పోటీలకు నిర్వాహకులు పంపిస్తున్నారు. ఈనెల 22 నుంచి 24 వరకు జిల్లాస్థాయి పోటీలు నిర్వహించనున్నారు.

జిల్లాస్థాయి క్రీడాపోటీలు..

మండల స్థాయిలో ఐదు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించిన సంగతి తెలిసిందే. జిల్లాస్థాయిలో మాత్రం 11 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. కరీంనగర్‌లోని అంబేడ్కర్‌స్టేడియంలో జిల్లాస్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. పురుషులు, మహిళలకు అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్ పోటీలు నిర్వహించనుండగా కేవలం పురుషులకు ఫుట్‌బాల్, బాక్సింగ్, రెజ్లింగ్ పోటీలు నిర్వహించనున్నారు.

విజయం సాధించాలి

కరీంనగర్ రూరల్ మండలస్థాయి క్రీడాకారులు జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడోత్సవాల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య అన్నారు. నగునూర్‌లోని జెడ్పీపాఠశాలలో నిర్వహించిన కరీంనగర్ రూరల్ మండల స్థాయి క్రీడాపోటీల ముగింపు వేడుకలకు హాజరై విజేతలకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జగన్మోహన్ రెడ్డి, సర్పంచ్ ఉప్పుల శ్రీధర్, ఎస్జీఎఫ్ కార్యదర్శి పోతన శ్రీనివాస్, పీడీలు, పీఈటీలు బిట్ర శ్రీనివాస్, సంధ్యారాణి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు మెడల్స్ ప్రదానం..

కరీంనగర్ అర్బన్ మండలస్థాయి క్రీడోత్సవాల్లో విజేతలైన వారికి బుధవారం రాత్రి అంబేడ్కర్ స్టేడియంలో అర్బన్ క్రీడోత్సవాల ముగింపు కార్యక్రమంలో కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్ మెడల్స్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కప్ క్రీడల్లో అర్బన్ జట్లు జిల్లాస్థాయిలో విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ కీర్తి రాజవీరు, పీడీ, పీఈటీలు అంతటి శంకరయ్య, దివాకర్, వేణు, వలీ పాష, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

నేటి కంటి వెలుగు శిబిరాలు

కరీంనగర్‌టౌన్: జిల్లాలో గురువారం నిర్వహించే కంటివెలుగు శిబిరాల వివరాలను జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితాదేవి ప్రకటించారు. కరీంనగర్ నగరంలోని 39, 54, 60వ డివిజన్‌లలో, హుజూరాబాద్ పట్టణం 3వ వార్డు, అదే మండలం రంగాపూర్ గ్రామంలో, జమ్మికుంట పట్టణంలోని 18వ వార్డు, అదేమండలం జగ్గయ్యపల్లి, వెంకటేశ్వర్లపల్లి గ్రామాల్లో శిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు. వీణవంకమండలం నర్సింగాపూర్, లింగాపూర్, వెల్ది, చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లి, కొండాపూర్, చొప్పదండి మండలం భూపాలపట్నం, గంగాధర మండలం హిమ్మత్‌నగర్, రామడుగు మండలం వెదిర, కొత్తపల్లి మండలం ఎలగందుల, నాగులమల్యాల, మానకొండూరు మండలం ఖాదర్‌గూడెం, సైదాపూర్ మండలం ఆకునూర్, కేశవపట్నం మండలం కన్నాపూర్, రాజాపూర్, తిమ్మాపూర్ మండలం మల్లాపూర్, చీమలకుంటపల్లి గ్రామాల్లో కంటి వెలుగుబృందాలు పనిచేస్తాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇద్దరికి గాయాలు

మానకొండూర్: మండలంలోని ముంజంపల్లి శివారులోని జాలగుట్టకు చెందిన శివ (27) ఉదయ్‌కుమార్(25) జాలగుట్ట నుంచి ఈదు ల గట్టెపల్లి స్టేజీ వైపు వెళ్తుండగా కరీంనగర్ వరంగల్ ప్రధాన రహదారి పెట్రోల్ బంకు సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడగా ఇద్దరికి గాయాలయ్యాయి చికిత్స నిమిత్తం 108లో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆర్థికసాయం అందజేత

గంగాధర: మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన టేల ముత్తయ్య కుటుంబానికి గ్రామానికి చెందిన తూడి లచ్చయ్య బుధవారం రూ.10వేలను ఆర్థికసాయం అందించారు. ముత్తయ్య భార్య అనారోగ్యంతో బాధపడుతోంది. ఆస్పత్రిలో వైద్యఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు

హుజూరాబాద్: పట్టణంలోని వరంగల్ రోడ్డులో పెద్ద మోరి పక్కన నుంచి బతుకమ్మ సొల్లకు వెళ్లే రహదారిని నాగరాజు అనే వ్యక్తి ప్రధాన రహదారి నుంచి బీఎస్సార్ గార్డెన్‌కు వెళ్లే రోడ్డు, కిందివాడకు వెళ్లే రోడ్డును రాత్రికి రాత్రే జేసీబీతో తవ్వాడని బీఎస్‌ఆర్ గార్డెన్ మేనేజర్ మంచికట్ల శ్రీనివాస్ తహసీల్దార్ కోమల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యకు బుధవారం ఫిర్యాదుచేశారు. నాగరాజు భూమిపక్కన మున్సిపల్ నుంచి బీఎస్‌ఆర్ గార్డెన్‌కు కిందివాడకు వెళ్లేందుకు 30 ఫీట్ల రోడ్డుకు అనుమతి ఉందని, అయితే ఆ స్థలం తనదేనంటూ గార్డెన్ నిర్వాహకులను, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలిపారు. దీనిపై విచారణ చేపట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వాహనదారుల ఇబ్బందులు

మానకొండూర్: మండలంలోని పోచంపల్లిశివారులోని డీబీఎం 6 ఉప కాలువ వంతెనపై బుధవారం రాత్రి టిప్పర్ నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పచ్చునూర్ వైపు నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఇసుక ట్రిప్పర్ డీబీఎం 6 ఉప కాలువ వంతెనపై నిలిచిపోయింది. వెల్ది, పోచంపల్లి మీదుగా వాహనాలు మళ్లించి రాకపోకలు సాగించారు. వంతెనపై టిప్పర్ నిలిచిపోవడంతో రోడ్డుకిరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. చివరకు జేసీబీ సాయంతో టిప్పర్‌ను పక్కకు తప్పించడంతో రాకపోకలు సాగించారు.

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: స్మార్ట్‌సిటీ పనుల్లో భాగంగా గురువారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఎన్జీవోస్ కాలనీ ప్రాంతం, కట్టరాంపూర్ ప్రాంతం, ఎర్రగుట్టపల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ సుధీర్ కుమార్ విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరుతున్నారు.

స్వీపింగ్.. స్లీపింగ్

- రూ.లక్షలతో స్వీపింగ్ మిషన్లు కొనుగోలు
- మరమ్మతులతో వృథాగా మిషన్లు
- మూడు నెలలుగా మూలకు
- పట్టించుకోని అధికారులు

కరీంనగర్‌కార్పొరేషన్: లక్షలాది రూపాయల ప్రజాధనంతో కొనుగోలుచేసిన స్వీపింగ్ మిషన్లు నగరంలో అలంకారప్రాయంగా మారాయి. మరమ్మతులకు నోచుకోక మిషన్లు మూడు నెలలుగా మూలనపడి ఉన్నా, వాటిని పట్టించుకునే వారులేకుండా పోయారు. అరిగిన బ్రష్‌ల స్థానంలో కొత్తవి అమర్చేందుకు అధికారులకు సమయం లేకుండా పోయింది. శానిటైజేషన్‌లో కీలకమైన స్వీపింగ్ మిషన్లు కానరావడం లేదు.

లక్షలాది రూపాయలతో కొనుగోలు...

నగరంలోని రహదారులు, వీధులను శుభ్రపర్చేందుకు సాధారణంగా పారిశుధ్య కార్మికులు పనిచేస్తుంటారు. ఈ పనుల్లో వేగం పెంచేందుకు, రోడ్లను పూర్తిగా శుభ్రం చేసేందుకు అన్ని పుర, నగర పాలికల్లో అదనంగా యంత్రాలను ప్రవేశపెట్టారు. ఈక్రమంలోనే నగరానికి కూడా స్వీపింగ్ మిషన్లు వచ్చాయి. నగరపాలక సంస్థ, శాతవాహన్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(సుడా)లు స్వీపింగ్ మిషన్‌లను గతంలోనే కొనుగోలు చేశాయి. నగరపాలక సంస్థ రెండు పెద్ద, రెండు చిన్న మిషన్లను కొనుగోలు చేయగా, సుడా కూడా రెండు పెద్ద మిషన్‌లను కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇందులో పెద్ద మిషన్‌లకు ఒక్కొక్కటి సుమారు రూ.60 లక్షలు, చిన్న మిషన్‌లకు ఒక్కోటి సుమారు రూ.30 లక్షలు వెచ్చించినట్లు చెబుతున్నారు. లక్షల్లో నిధులు వెచ్చించి కొనుగోలు చేసిన మిషన్ల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. కొన్నినెలలుగా నగరంలో ఈ మిషన్లు రోడ్లను శుభ్రపరుస్తున్నట్లు అధికారులు చెబుతున్నా ఎక్కడా కనిపించడం లేదు.



సుడా కార్యాలయం ఆవరణలో నిలిపిన స్వీపింగ్ మిషన్లు

మూడు నెలలుగా మూలకే..

సుడా తాత్కాలిక కార్యాలయ ఆవరణలో మూడు నెలలుగా రెండు స్వీపింగ్ మిషన్లు వృథాగా ఉంటున్నాయి ఇవి మరమ్మతుకు వచ్చాయని అందుకే వినియోగించడం లేదని అధికారులు చెబుతున్నారు. ఈ మిషన్లు సుడా ఆధ్వర్యంలో కొనుగోలు చేసినవని, బ్రష్‌లు అరిగిపోవడంతో పనిచేయడం లేదని అంటున్నారు. అయితే మూడు నెలలు గడుస్తున్నా కొత్త బ్రష్‌లు అమర్చకపోవడం అధికారుల పనితీరును తెలియజేస్తోంది. ఇదిలా ఉంటే కొత్త బ్రష్‌లకు ఆర్డర్ పెట్టామని, అవి రాగానే మిషన్లకు అమర్చి మరమ్మతులు చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఏదేమైనా మూడు నెలలుగా మూలన పడిన స్వీపింగ్ మిషన్లు వినియోగంలోకి తేవాలని పట్టణ ప్రజలు అంటున్నారు. ఇందుకు తగిన విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వర్షాకాల పంటలపై రైతులకు అవగాహన



పంటలపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కొత్తపల్లి: ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన స్థానం కరీంనగర్ దత్తత గ్రామమైన కొత్తపల్లి మండలం నాగులమల్యాలలో బుధవారం వానాకాలం పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. దత్తత గ్రామ ఇన్‌చార్జి డా.జి.ఉషారాణి సమావేశం నిర్వహించి మాట్లాడారు. వానకాలంలో వివిధ రకాల పంటల నూతన వంగడాలు, వాటి గుణగణాలు, అధిక దిగుబడికి మేలైన యాజమాన్య పద్ధతులను వివరించారు. ఈనెల 24 విత్తన మేళా నిర్వహిస్తున్నామని రైతులందరూ పరిశోధన స్థానంలో నాణ్యమైన విత్తనాలు సేకరించి మంచి దిగుబడి సాధించాలన్నారు. వ్యవసాయ పరిశోధన స్థానంలో నాణ్యమైన మొక్కజొన్న, కంది విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, ఆసక్తి గల రైతులు వాటిని తీసుకోవాలని కోరారు. వ్యవసాయంలో పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యత, యాజమాన్య పద్ధతులను శాస్త్రవేత్త డా.పి.మధుకర్‌రావు తెలిపారు. విత్తన శుద్ధితో పురుగులు, తెగుళ్లను నివారించవచ్చని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డా.ఎం.రాజేంద్రప్రసాద్ వివరించారు. అనంతరం ఏవో రంజిత్ మాట్లాడుతూ.. 65శాతం సబ్సిడీతో జీలుగ విత్తనాలు డీసీఎంఎస్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారిని లలిత, సర్పంచ్ నాయనిప్రసాద్, ఉపసర్పంచ్ ఉల్లందుల అనీల్, వార్డు సభ్యుడు నగేశ్, విద్యార్థులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్‌లో పాల్గొనండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నరేందర్‌రెడ్డి తదితరులు

కరీంనగర్‌టౌన్: హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా ప్రదేశ్ కాంగ్రెస్‌కమిటీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్ పోటీలు నిర్వహిస్తున్నామని ఈ అవకాశాన్ని 18 నుంచి 35 ఏళ్ల యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నియోజకవర్గాల వారీగా యువశక్తిని మేల్కొలిపే దిశగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఆన్‌లైన్‌లో 7661899899 నంబర్‌కు మిస్‌కాల్ ఇచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ ప్రక్రియ ఉచితంగానే ఉంటుందన్నారు. ఆన్‌లైన్ పరీక్షలో విజేతలకు మొదటి బహుమతి ల్యాప్‌ట్యాప్, రెండోబహుమతి స్మార్ట్‌ఫోన్, మూడో బహుమతి ట్యాబ్, ప్రోత్సాహ బహుమతులుగా స్మార్ట్‌వాచ్‌లు, ఇయర్ ప్యాడ్‌లు, పవర్ బ్యాంక్‌లు అందిస్తామన్నారు. వీటితో పాటు ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలోని మహిళా టాపర్‌లకు ఎలక్ట్రిక్ స్కూటర్ బహుమతిగా ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని కరీంనగర్ నియోజకవర్గంలోని యువతి, యువకులు, విద్యార్థులు వినియోగించుకొని అధిక సంఖ్యలో పాల్గొని ప్రతిభతో పాటు విలువైన బహుమతులు గెలుచుకోవాలన్నారు. సమావేశంలో కుర్ర పోచయ్య, కొరివి అరుణ్‌కుమార్, ఎండీ. చాంద్, జీడీ రమేశ్, షబానా మహమ్మద్, షేహెన్ష, అష్రఫ్ ఖురేషి, హనీఫ్, కమల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడాపోటీలు



సర్టిఫికెట్లు అందిస్తున్న ఎంపీపీ, మున్సిపల్ చైర్మన్

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్–2023 మండల స్థాయి క్రీడాపోటీలు బుధవారం ముగిశాయి. ఈనెల 15 నుంచి ప్రారంభమైన పోటీలు 17వరకు కొనసాగాయి. యువతీ యువకులకు మండలస్థాయి క్రీడా పోటీల్లో భాగంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభచూపిన క్రీడాకారులను జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేశారు. మండల స్థాయి క్రీడాపోటీల ముగింపు కార్యక్రమానికి ఎంపీపీ పిల్లి శ్రీలత, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు హాజరై విజేతలకు సర్టిఫికెట్లు అందించారు. జిల్లాస్థాయికి ఎంపికై క్రీడాకారులకు వారి సొంత ఖర్చులతో టీ షర్ట్‌లు అందించి అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు రాష్ట్రవ్యాప్తంగా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారని, క్రీడా పోటీలకు స్పందన లభించిందన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని జిల్లాస్థాయి పోటీల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయికి ఎంపికై విజేతలుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీఓ శ్రీనివాస్, సర్పంచులు మొగిలి, మంజుల, సమ్మయ్య, నాయిని ప్రసాద్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జాస్మిన్ థెరీసా, పీఈటీలు గిన్నె లక్ష్మణ్, శ్రీనివాస్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



మట్లాడుతున్న జెడ్పీటీసీ గీకురు రవీందర్

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జెడ్పీటీసీ గీకురు రవీందర్ అన్నారు. బుధవారం మండల మండలకేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోళ్లలో జాప్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయన వెంట సర్పంచ్ బెజ్జంకి లక్ష్మణ్, మాజీ సింగిల్‌విండో చైర్మన్ పన్యాల ప్రభాకర్‌రెడ్డి, పోటు మల్లారెడ్డి, ఐకేపీ సీసీ సత్యనారాయణ, తదితరులున్నారు.

పల్లె దవాఖాన నిర్మాణానికి స్థల పరిశీలన



ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న వైద్యసిబ్బంది

హుజూరాబాద్ రూరల్ : మండలంలోని సింగపూర్ పల్లె దవాఖానకు భవన నిర్మాణానికి బుధవారం తహసీల్దార్ కోమల్ రెడ్డి, రెవెన్యూ అధికారులు స్థలాన్ని పరిశీలించారు. మండలంలో సొంత భవనాలు లేని ఆరోగ్య ఉప కేంద్రాలకు స్థలాన్ని పరిశీలించి జిల్లా, వైద్య ఆరోగ్య శాఖకు అప్పగించారు. ఈ మేరకు వైద్య సిబ్బంది భూమిపూజ చేశారు. పోతిరెడ్డిపల్లిలో సర్పంచ్ తాటికొండ పుల్లాచారి ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు.

'ఆరోగ్య అభ్యాస'

రామడుగు: మండలకేంద్రంలోని బెరా కా చర్చిలో బుధవారం వ్యాలీ ఆఫ్ బెరాకా మినిస్ట్రీస్ అధ్యక్షుడు పట్టెం అబ్రహం ఆధ్వర్యంలో సేవాభారత్ సహకారంతో ఆరోగ్య అభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎంపీ మల్లేశం ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సేవా భారత్ కో ఆర్డినేటర్ ప్రదీప్, పాలు, వెంకటేశం, పలువురు పాల్గొన్నారు.



జొకోవిచ్‌కు చుక్కెదురు

రోమ్ మాస్టర్స్ సిరీస్-1000 టెన్నిస్ టోర్నీలో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ నొవాక్ జొకోవిచ్ (సెర్బియా) కథ ముగిసింది. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ జొకోవిచ్ 2-6, 6-4, 2-6తో ఏడో సీడ్ హోల్గర్ రూనె (డెన్మార్క్) చేతిలో ఓడిపోయాడు. 2004 తర్వాత రోమ్ మాస్టర్స్ టోర్నీలో జొకోవిచ్, నాదల్‌లలో ఒక్కరు కూడా లేకుండా తొలిసారి ఫైనల్ జరగనుంది.



అర్జున్ శుభారంభం

పార్లా మాస్టర్స్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ శుభారంభం చేశాడు. బుధవారం మొదలైన ఈ టోర్నీలో పోలాండ్ గ్రాండ్‌మాస్టర్ కాస్పెర్ పియోరన్‌తో జరిగిన తొలి రౌండ్ గేమ్‌లో తెల్లపావులతో ఆడిన అర్జున్ 32 ఎత్తుల్లో గెలుపొందాడు. భారత్‌కే చెందిన మరో యువ గ్రాండ్‌మాస్టర్, తమిళనాడుకు చెందిన దొమ్మరాజు గుకేశ్ కూడా తొలి రౌండ్‌లో గెలిచాడు. వెస్కొవి (బ్రెజిల్)తో జరిగిన గేమ్‌లో గుకేశ్ 33 ఎత్తుల్లో విజయం సాధించాడు.

జ్యోతి 'పసిడి' పరుగు

100 మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణం



రాంచీ: జాతీయ ఫెడరేషన్ కప్ సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి యర్రాజీ స్వర్ణ పతకంతో మెరిసింది. బుధవారం జరిగిన మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో విశాఖపట్నం జిల్లాకు చెందిన జ్యోతి విజేతగా నిలిచింది. జ్యోతి అందరికంటే వేగంగా 12.89 సెకన్లలో గమ్యానికి చేరి అగ్రస్థానాన్ని దక్కించుకుంది. నిత్య రామరాజ్ (తమిళనాడు; 13.44 సెకన్లు) రజతం... సప్న కుమారి (జార్ఖండ్; 13.58 సెకన్లు) కాంస్యం గెలిచారు. తెలంగాణ అథ్లెట్ అగసార నందిని 13.65 సెకన్లతో ఐదో స్థానంలో నిలిచింది. పురుషుల 110 మీటర్ల హర్డిల్స్ ఫైనల్లో ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ లావేటి యశ్వంత్ కుమార్ 14.62 సెకన్లలో గమ్యానికి చేరి చివరిదైన ఎనిమిదో స్థానంలో నిలిచాడు.


భారత ఆర్చరీ జట్లకు నిరాశ



షాంఘై: ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-2 టోర్నీలో కాంపౌండ్ టీమ్ విభాగంలో భారత పురుషుల, మహిళల జట్లకు నిరాశ ఎదురైంది. రెండు విభాగాల్లో భారత జట్లు క్వార్టర్ ఫైనల్ దాటలేకపోయాయి. మహిళల టీమ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ, అదితి, అవ్‌నీత్ కౌర్‌లతో కూడిన భారత జట్టు 228-231 (57-58, 57-58, 57-59, 57-56)తో హజల్ బురున్, ఇపెక్ తొమ్రుక్, ఇర్మక్ యుక్సెల్‌లతో కూడిన తుర్కియే జట్టు చేతిలో ఓడిపోయింది. ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలె, రిషభ్ యాదవ్, ప్రథమేశ్‌లతో కూడిన భారత పురుషుల జట్టుకు తొలి రౌండ్‌లో 'బై' లభించగా... రెండో రౌండ్‌లో 236-228తో ఇండోనేసియా జట్టును ఓడించింది. అనంతరం క్వార్టర్ ఫైనల్లో టీమిండియా 231-234తో మెక్సికో జట్టు చేతిలో పరాజయం పాలైంది. పురుషుల రికర్వ్ క్వాలిఫయింగ్ రౌండ్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ ధీరజ్ బొమ్మదేవర 656 పాయింట్లు స్కోరు చేసి 13వ ర్యాంక్‌లో నిలిచాడు.

ఢిల్లీ గెలిచెన్...

- 15 పరుగులతో పంజాబ్ పరాజయం
- మెరిసిన రోసో, పృథ్వీ షా
- లివింగ్‌స్టోన్ పోరాటం వృథా



రోసో

ధర్మశాల: 'ప్లే ఆఫ్స్' రేసు నుంచి నిష్క్రమించిన తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్ ఇతర జట్ల సమీకరణాలను దెబ్బ తీసే పనిలో పడింది. పదునైన బ్యాటింగ్‌తో తొలిసారి సీజన్‌లో 200 పరుగుల స్కోరు చేసిన ఆ జట్టు పంజాబ్ కింగ్స్‌ను దెబ్బ కొట్టింది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఢిల్లీ 15 పరుగుల తేడాతో పంజాబ్‌పై గెలిచింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రిలీ రోసో (37 బంతుల్లో 82 నాటౌట్; 6 ఫోర్లు, 6 సిక్స్‌లు), పృథ్వీ షా (38 బంతుల్లో 54; 7 ఫోర్లు, 1 సిక్స్), వార్నర్ (31 బంతుల్లో 46; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) జట్టు భారీ స్కోరులో కీలకపాత్ర పోషించారు. అనంతరం పంజాబ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 198 పరుగులు చేసింది. లివింగ్‌స్టోన్ (48 బంతుల్లో 94; 5 ఫోర్లు, 9 సిక్స్‌లు) చెలరేగగా, అథర్వ తైడే (42 బంతుల్లో 55; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. ఈ ఓటమితో పంజాబ్ ప్లే ఆఫ్ అవకాశాలు దాదాపుగా కోల్పోయింది!

మూడు అర్ధసెంచరీ భాగస్వామ్యాలు...

వార్నర్ ఎప్పటిలాగే శుభారంభం అందించగా... చాలా రోజుల తర్వాత మళ్లీ మ్యాచ్ ఆడే అవకాశం దక్కించుకున్న పృథ్వీ షా దానిని సమర్థంగా వాడుకున్నాడు. రబడ ఓవర్లో వార్నర్ 2 సిక్స్‌లు కొట్టగా, అర్ష్‌దీప్ ఓవర్లో వరుస బంతుల్లో పృథ్వీ 2 ఫోర్లు, సిక్స్ బాదాడు. పవర్‌ప్లే ముగిసేసరికి స్కోరు 61 పరుగులకు చేరింది. తొలి వికెట్‌కు 62 బంతుల్లోనే 94 పరుగులు జోడించిన తర్వాత వార్నర్ వెనుదిరగ్గా, మూడో స్థానంలో వచ్చిన రోసో మరింత జోరుగా బ్యాటింగ్ చేశాడు. రబడ ఓవర్లో అతను 2 భారీ సిక్స్‌లతో పాటు ఫోర్ కొట్టాడు. ఆ తర్వాత 36 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న పృథ్వీ ఆ వెంటనే వెనుదిరిగాడు. రోసో, సాల్ట్ (14 బంతుల్లో 26 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపులతో ఆఖరి 2 ఓవర్లలోనే ఢిల్లీ 41 పరుగులు రాబట్టింది. హర్‌ప్రీత్ వేసిన చివరి ఓవర్లో రోసో 2 సిక్స్‌లు, ఫోర్ కొట్టగా, అంతకుముందు ఎలిస్ వేసిన 19వ ఓవర్లో సాల్ట్ కూడా 2 సిక్స్‌లు, ఫోర్ బాదాడు. 25 బంతుల్లోనే రోసో హాఫ్ సెంచరీ చేయడం విశేషం.

లివింగ్‌స్టోన్ మెరుపులు...

శిఖర్ ధావన్ (0) డకౌట్ కావడంతో ఛేదనలో పంజాబ్‌కు సరైన ఆరంభం లభించలేదు. అయితే తైడే, ప్రభ్‌సిమ్రన్ (22) రెండో వికెట్‌కు 33 బంతుల్లో 50 పరుగులు జోడించి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. అయితే వేగంగా ఆడలేకపోవడంతో సాధించాల్సిన రన్‌రేట్ పెరుగుతూ పోయింది. 38 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న తైడే 'రిటైర్డ్ అవుట్'గా తప్పుకోగా, జితేశ్ శర్మ (0) విఫలమయ్యాడు. మరోవైపు 3 పరుగుల వద్ద నోర్జే క్యాచ్ వదిలేయడంతో బతికిపోయిన లివింగ్‌స్టోన్ సిక్సర్లతో చెలరేగిపోయాడు. 30 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించిన అతని ఆటతోనే పంజాబ్ గెలుపుపై ఆశలు పెంచుకుంది. చివరి 4 ఓవర్లలో 79 పరుగులు చేయాల్సిన దశలో లివింగ్‌స్టోన్... ఖలీల్ ఓవర్లో రెండు, ముకేశ్ ఓవర్లో మూడు సిక్స్‌లు బాదాడు. 19వ ఓవర్లో అతనికి ఒక బంతే ఆడే అవకాశం రాగా... ఇషాంత్ వేసిన చివరి ఓవర్లో 2 సిక్స్‌లు, ఫోర్ కొట్టినా అప్పటికే ఆలస్యమైపోయింది.



లివింగ్‌స్టోన్

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: వార్నర్ (సి) ధావన్ (బి) స్యామ్ కరన్ 46; పృథ్వీ షా (సి) తైడే (బి) స్యామ్ కరన్ 54; రోసో (నాటౌట్) 82; సాల్ట్ (నాటౌట్) 26; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం** (20 ఓవర్లలో 2 వికెట్లకు) 213. **వికెట్ల పతనం:** 1-94, 2-148. **బౌలింగ్:** స్యామ్ కరన్ 4-0-36-2, రబడ 3-0-36-0, అర్ష్‌దీప్ 2-0-21-0, ఎలిస్ 4-0-46-0, చహర్ 4-0-35-0, హర్‌ప్రీత్ బ్రార్ 3-0-39-0.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రభ్‌సిమ్రన్ (సి) దుల్ (బి) అక్షర్ 22; ధావన్ (సి) అమన్ (బి) ఇషాంత్ 0; అథర్వ తైడే (రిటైర్డ్ అవుట్) 55; లివింగ్‌స్టోన్ (సి) అక్షర్ (బి) ఇషాంత్ 94; జితేశ్ (సి) ఖలీల్ (బి) నోర్జే 0; షారుఖ్ (సి) అక్షర్ (బి) ఖలీల్ 6; స్యామ్ కరన్ (బి) నోర్జే 11; బ్రార్ (రనౌట్) 0; చహర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం** (20 ఓవర్లలో 8 వికెట్లకు) 198. **వికెట్ల పతనం:** 1-0, 2-50, 3-128, 4-129, 5-147, 6-180, 7-180, 8-198. **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 3-1-20-1, ఇషాంత్ శర్మ 3-0-36-2, నోర్జే 4-0-36-2, ముకేశ్ 4-0-52-0, అక్షర్ పటేల్ 3-0-27-1, కుల్దీప్ యాదవ్ 3-0-21-0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	13	9	4	0	18	0.835
చెన్నై	13	7	5	1	15	0.381
లక్నో	13	7	5	1	15	0.304
ముంబై	13	7	6	0	14	-0.128
బెంగళూరు	12	6	6	0	12	0.166
రాజస్తాన్	13	6	7	0	12	0.140
కోల్‌కతా	13	6	7	0	12	-0.256
పంజాబ్	13	6	7	0	12	-0.308
ఢిల్లీ	13	5	8	0	10	-0.572
హైదరాబాద్	12	4	8	0	8	-0.575

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

హైదరాబాద్ × బెంగళూరు (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

'ఐపీఎల్'తో రిటైలింగ్‌లోకి...

నవభారత్ లిమిటెడ్ ప్రణాళికలు



సాక్షి, హైదరాబాద్: పామాయిల్ ఉత్పత్తుల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన నవభారత్ లిమిటెడ్ (ఎన్‌బీఎల్) కంపెనీ ఇకపై మరింత విస్తరణకు సిద్ధమైంది. ఇప్పటి వరకు దాదాపు పూర్తిగా హోల్‌సేల్ అమ్మకాలకే పరిమితమైన ఎన్‌బీఎల్ ముందు రిటెయిలింగ్ ద్వారా ప్రజలకు చేరువయ్యేందుకు ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే ఈ ఏడాది ఐపీఎల్‌లో హైదరాబాద్ టీమ్ 'సన్‌రైజర్స్'తో ఎన్‌బీఎల్ జత కట్టి తమ ప్రచార కార్యక్రమాలను వేదికగా మార్చుకుంది. తాజా సీజన్‌లో రైజర్స్‌కు 'సింప్లిఫై పార్ట్‌నర్'గా ఎన్‌బీఎల్ వ్యవహరించింది. బుధవారం ఎన్‌బీఎల్ బృందంతో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో రైజర్స్ బ్యాటర్ హ్యారీ బ్రూక్‌తో పాటు కోచ్‌లు డేల్ స్టెయిన్, ముత్తయ్య మురళీధరన్, హేమంగ్ బదానీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌బీఎల్ సంస్థ పురోగతి గురించి సీఈఓ శ్రీనివాస ప్రసాద్ వెల్లడించారు. 'రూ. 40 కోట్లతో మొదలైన మా టర్నోవర్ ప్రస్తుతం రూ. 1700 కోట్లకు చేరింది. ఎక్కువగా పామాయిల్ ఉత్పత్తులపైనే దృష్టి పెట్టాం. సూపర్‌మతి ఆయిల్‌కు మంచి గుర్తింపు ఉంది. రిఫైనరీ ద్వారా రోజుకు సుమారు 850 మెట్రిక్ టన్నుల ఉత్పత్తులు తయారు చేస్తున్నాం. అయితే ఇప్పుడు ఆయిల్ రంగంలో ఇతర సంస్థలకు పోటీగా సన్‌ఫ్లవర్, రైస్‌బ్రాన్ ఆయిల్‌ల రంగంలో కూడా అడుగు పెడుతున్నాం. రిటైల్‌పై ఇక ముందు ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. అందుకే రెండు తెలుగు రాష్ట్రాల్లో జనం ఆసక్తి చూపించే ఐపీఎల్ ఫ్రాంచైజీతో జత కట్టి ప్రచారం చేశాం' అని వివరించారు.

'ఎమిలియా' ఎఫ్1 రేసు రద్దు



ఇమోలా (ఇటలీ): ఫార్ములావన్ (ఎఫ్1) సీజన్‌లో భాగంగా ఈనెల 21న ఇటలీలో జరగాల్సిన ఎమిలియా రొమాన్యా గ్రాండ్‌ప్రి రేసు రద్దయింది. ఈ రేసుకు వేదికగా నిలవాల్సిన ఇమోలా ప్రాంతాన్ని భారీవర్షాలు, వరదలు ముంచెత్తాయి. ఇలాంటి ప్రతికూల వాతావరణంలో రేసును నిర్వహించి అందరినీ ఇబ్బంది పెట్టే యోచన లేదని ఎఫ్1 నిర్వాహకులు తెలిపారు. సీజన్‌లోని తదుపరి రేసు మొనాకో గ్రాండ్‌ప్రి ఈనెల 28న జరుగుతుంది.

హారిక గేమ్ 'డ్రా'



నికోసియా (సైప్రస్): మహిళల గ్రాండ్‌ప్రి చెస్ టోర్నమెంట్‌లో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక తొలి 'డ్రా' నమోదు చేసింది. జర్మనీ ప్లేయర్ దినారా వాగ్నర్‌తో బుధవారం జరిగిన రెండో రౌండ్ గేమ్‌ను తెల్ల పావులతో ఆడిన హారిక 32 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది.

విజయంతో ముగింపు



ప్రణయ్

సుజౌ (చైనా): సుదిర్మన్ కప్ బ్యాడ్మింటన్ టోర్నీని భారత జట్టు విజయంతో ముగించింది. గ్రూప్ 'సి'లో భాగంగా ఆస్ట్రేలియా జట్టుతో బుధవారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 4-1తో గెలుపొందింది. చైనీస్ తైపీ, మలేసియా జట్లతో జరిగిన తొలి రెండు లీగ్ మ్యాచ్‌ల్లో భారత్ ఓడిపోవడంతో నాకౌట్ దశకు అర్హత పొందలేకపోయింది. తొలి మ్యాచ్‌లో సాయిప్రతీక్-తనీషా క్రాస్టో 21-17, 14-21, 18-21తో కెనెత్ చూ-గ్రోన్యా సోమర్‌విలె చేతిలో ఓడిపోయారు. అనంతరం రెండో మ్యాచ్‌లో ప్రణయ్ 21-8, 21-8తో జాక్ యుపై నెగ్గడంతో స్కోరు 1-1తో సమమైంది. మూడో మ్యాచ్‌లో అనుపమ 21-16, 21-18తో టిఫానీ హోపై, నాలుగో మ్యాచ్‌లో అర్జున్-ధ్రువ్ 21-11, 21-12తో టాంగ్-రేన్ వాంగ్‌లపై, ఐదో మ్యాచ్‌లో తనీషా క్రాస్టో-అశ్విని పొన్నప్ప 21-19, 21-13తో కైట్లిన్-ఎంజెలా యులపై విజయం సాధించారు.

సినిమా

అట్టహాసంగా ఆరంభమైన కాన్స్ చిత్రోత్సవాలు

76వ కాన్స్ చిత్రోత్సవాలు అట్టహాసంగా ఆరంభమయ్యాయి. ఫ్రాన్స్‌లో ఈ నెల 16న మొదలైన ఈ చిత్రోత్సవాలు 27 వరకు కొనసాగుతాయి. ఎనిమిది మంది జ్యూరీ సభ్యులకు స్వీడన్‌కు చెందిన రూబెన్ ఓస్ట్‌లాండ్ సారథ్యం వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ సమాచార, ప్రసార శాఖ డిప్యూటీ మినిస్టర్ ఎల్. మురుగన్ ఈ చిత్రోత్సవాల్లో ఇండియన్ టీమ్‌ను లీడ్ చేస్తున్నారు. 12 రోజుల పాటు జరగనున్న ఈ వేడుకల్లో పలువురు దేశ, విదేశీ తారలు రెడ్ కార్పెట్‌పై మెరవనున్నారు. ఇక తొలి రోజు వేడుక విశేషాల్లోకి వెళదాం.



జాన్ డ్యు బెర్రీలో ఓ దృశ్యం

ఏడు నిమిషాల స్టాండింగ్ ఒవేషన్

తొలి రోజు బయోగ్రాఫికల్ డ్రామా 'జాన్ డ్యు బెర్రీ' ప్రదర్శనతో ప్రారంభమై, చివరి రోజు ఉత్సవాలు 'ఎలిమెంటల్' సినిమా ప్రదర్శనతో ముగుస్తాయి. 'జాన్ డ్యు బెర్రీ' సినిమాలో ఓ లీడ్ రోల్ చేసిన జానీ డెప్ ఈ చిత్రోత్సవాలకు హాజరయ్యారు. ఈ చిత్ర ప్రదర్శన ముగిసిన తర్వాత వీక్షకులు ఏడు నిమిషాల పాటు స్టాండింగ్ ఒవేషన్ ఇవ్వడం విశేషం. తమ చిత్రానికి ఇంత అద్భుత స్పందన లభించిన నేపథ్యంలో జానీ డెప్ కళ్లు చెమర్చాయి. ఈ వీడియో వైరల్ అవుతోంది. మైవెన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం త్వరలో నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది.

కాన్స్‌లో భారతీయం

ప్రతి ఏడాదీ కాన్స్ చిత్రోత్సవాల్లో భారతీయ తారలు మెరుస్తుంటారు.

- రెడ్ కార్పెట్‌పై మెరిసిన ఇండియన్ తారలు
- 'జాన్ డ్యు బెర్రీ' సినిమాకు ఏడు నిమిషాల స్టాండింగ్ ఒవేషన్



సారా అలీఖాన్



ఈషా గుప్తా



మానుషీ చిల్లర్



ఊర్వశీ రౌతేలా

ఈ ఏడాది తొలి రోజు హిందీ తారలు సారా అలీఖాన్, ఈషా గుప్తా, మానుషీ చిల్లర్, ఊర్వశీ రౌతేలా రెడ్ కార్పెట్‌పై మెరిశారు. కాగా సారా, ఈషా, మానుషీలు తొలిసారి కాన్స్ చిత్రోత్సవాల్లో పాల్గొంటున్నారు. ఈ ముగ్గురితో పాటు ఊర్వశి కూడా రెడ్ కార్పెట్‌పై సందడి చేశారు. దేశీ లుక్‌లో అగుపించిన సారాకి ప్రశంసలు లభించాయి. వీరు మాత్రమే కాదు.. ఇంకా హీరోయిన్లు అనుష్కా శర్మ, మృణాల్ ఠాకూర్, సన్నీ లియోన్, నాగాల్యాండ్ యాక్ట్రస్ ఆండ్రియా కెవిచుసాలు తొలిసారిగా ఈ కాన్స్ చలన చిత్రోత్సవాల్లో పాల్గొంటారు. ఇంకా ఆస్కార్ అవార్డు విన్నింగ్ ప్రొడ్యూసర్ గునీత్ మోంగా, దర్శకుడు మధుర్ భండార్కర్, హీరోయిన్ అదితీరావ్ హైదరీ, నటుడు విజయ్‌వర్మ, దర్శకుడు విఘ్నేష్ శివన్ వంటి వారు పాల్గొననున్నట్లు సమాచారం. అలాగే దర్శకుడు అనురాగ్ కశ్యప్ తెరకెక్కించిన 'కెన్నెడీ', దర్శకుడు కను బెహ్ల్ తీసిన 'ఆగ్రా', మణిపూర్ దర్శకుడు అరిబామ్ శ్యామ్ శర్మ తెరకెక్కించిన 'ఇషానౌ', యుధాజిత్ బసు 'నెహెమిచ్' వంటి భారత చిత్రాలు కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితం కానున్నాయి. 'కెన్నెడీ' చిత్రంలోని ప్రధాన పాత్రల్లో ఒకరిగా నటించిన సన్నీ లియోన్ ఈ చిత్రం ప్రదర్శనలో భాగంగానే ఉత్సవాలకు హాజరవుతున్నారు.

రెండు దశాబ్దాలుగా...

కాన్స్ చిత్రోత్సవాలంటే చాలామంది ఐశ్వర్యా రాయ్ కోసం ఎదురు చూస్తారు. ఎందుకంటే దాదాపు రెండు దశాబ్దాలుగా కాన్స్ రెడ్ కార్పెట్‌పై ఐష్ మెరుస్తున్నారు. షారుక్ ఖాన్, ఐశ్వర్యా రాయ్, మాధురీ దీక్షిత్ ప్రధాన పాత్రల్లో సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో రూపొందిన 'దేవదాస్' (2002) చిత్రం 55వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమైంది. అప్పట్నుంచి ఐశ్వర్యా రాయ్ క్రమం తప్పకుండా కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు హాజరవుతున్నారు. ఈ ఏడాది చిత్రోత్సవాల్లో సందడి చేసేందుకు తన కూతురు ఆరాధ్యతో కలిసి ఐశ్వర్యా రాయ్ బుధవారం ముంబై నుంచి బయలుదేరారు.

ఇక స్పీడ్‌గా సినిమాలు చేస్తాను

- నందినీ రెడ్డి

"డైరెక్టర్ పూరి జగన్నాథ్‌గారిలా నేను సినిమా కథని స్పీడ్‌గా రాయలేను. నాకు రచయితల టీమ్ లేదు. ఒక్కదాన్నే స్క్రిప్ట్‌ని రాసుకుంటాను.. ఇందుకు 7 నుంచి 9 నెలలు టైమ్ పడుతుంది. ఇప్పుడు రచయితల టీమ్‌ను పెట్టుకున్నాను. 'అన్నీ మంచి శకునములే' విడుదలకి నాకు మంచి స్లాట్ దొరికింది. కుటుంబమంతా కలిసి థియేటర్స్‌లో హాయిగా ఎంజాయ్ చేసేలా మా సినిమా ఉంటుంది" అని డైరెక్టర్ నందినీ రెడ్డి అన్నారు. సంతోష్ శోభన్, మాళవికా నాయర్ జంటగా నటించిన చిత్రం 'అన్నీ మంచి శకునములే'. మిత్రవిందా మూవీస్‌తో కలిసి ప్రియాంకా దత్ నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా బుధవారం చిత్ర దర్శకురాలు నందినీ రెడ్డి చెప్పిన విశేషాలు.



- 'అన్నీ మంచి శకునములే' కథ ఆంధ్ర, తమిళనాడు సరిహద్దులోని విక్టోరియాపురం అనే ఊరిలో సాగుతుంది. సంతోష్, మాళవికతో పాటు మిగిలిన ఐదు పాత్రలకూ ప్రాధాన్యత ఉంటుంది. ఆ ఊరికి, ఈ పాత్రలకు, హీరో హీరోయిన్ల మధ్య ప్రేమకథకి సంబంధం ఏంటి? వంటి అంశాలన్నీ ఒకదానితో ఒకటి లింక్ అయి ఉంటాయి. 'హమ్ ఆప్‌కే హై కౌన్' సినిమాలో ప్రతి పాత్రతో ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు.. అలా మా సినిమాలోనూ ప్రతి పాత్రకి స్పేస్ ఇవ్వాలని చూసుకున్నాం.. అదే నాకు పెద్ద సవాల్‌గా అనిపించింది.

- 'అన్నీ మంచి శకునములే' కథ చాలా సింపుల్‌గా ఉంటుంది. 'పెళ్ళిచూపులు' సమయంలో విజయ్ దేవరకొండకి 'అన్నీ మంచి శకునములే' కథ సరిపోతుందనుకున్నాను. అయితే ఆ తర్వాత తన స్టార్‌డమ్ మారిపోవడంతో ఈ కథ సెట్ కాదనుకున్నాను. హీరో పాత్ర చాలా కూల్‌గా ఉంటుంది.. అందుకే ఆ పాత్రకి సంతోష్ న్యాయం చేయగలడని తీసుకున్నాం. ఈ కథకి హీరోను మార్చి పెద్ద రేంజ్‌లో తీయాలంటే కుదరదు.. కథకు గౌరవం ఇవ్వాలి.. లేదంటే దేనికీ న్యాయం చేయలేం. సంతోష్, మాళవిక తమ పాత్రలకు వంద శాతం న్యాయం చేశారు.. ఎమోషన్స్ అద్భుతంగా పండించారు. ఇప్పటివరకు నేను చేసిన సినిమాల్లో బెస్ట్ క్లయిమాక్స్ ఈ సినిమాకు రాశాననుకుంటున్నాను.
- కథ డిమాండ్ మేరకే చాలా విరామం తర్వాత షావుకారు జానకి, గౌతమి, వాసుకి వంటివారిని తీసుకున్నాను. రచయిత లక్ష్మీభూపాల్ నా బ్రదర్ లాంటివాడు.. నా సినిమాకు ప్రేమతో రాస్తాడు. 'ఓ బేబీ' తర్వాత మిక్కీ జె. మేయర్ 'అన్నీ మంచి శకునములే'కి అద్భుతమైన పాటలు, క్లయిమాక్స్ ఫీల్‌కు అనుగుణంగా నేపథ్య సంగీతం ఇచ్చాడు. మేకింగ్‌లో అశ్వినీదత్‌గారు, స్వప్న, ప్రియాంక, నాగ్ అశ్విన్.. ఎవరూ కల్పించుకోలేదు. ఇప్పటివరకూ నాకు ఒక్కో సినిమాకి యావరేజ్‌గా రెండేళ్లు పట్టింది.. ఇకపై వేగంగా సినిమాలు చేస్తాను. నా తర్వాతి సినిమా సిద్ధు జొన్నలగడ్డతో ఉంటుంది. అందులో సమంత నటిస్తారా? లేదా అనేది ఇప్పుడే చెప్పలేను. ఈ సినిమా కథ ఎవరూ ఊహించలేని విధంగా సరికొత్తగా ఉంటుంది.

పెళ్లికి తేదీ కుదిరింది



నిశ్చితార్థ వేడుకలో శర్వానంద్, రక్షిత

హీరో శర్వానంద్ వివాహానికి ముహూర్తం ఖరారైంది. జైపూర్‌లోని లీలా ప్యాలెస్‌లో జూన్ 3న శర్వానంద్, రక్షితల వివాహం జరగనుంది. జూన్ 2న మెహందీ ఫంక్షన్ జరుగుతుంది. మరుసటి రోజు శర్వానంద్‌ని పెళ్లి కొడుకుని చేస్తారు. అదే రోజు అంటే జూన్ 3న రాత్రి 11గంటల సమయంలో శర్వానంద్, రక్షితల వివాహ వేడుక ప్రారంభం అవుతుంది. ఈ పెళ్లికి పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరు కానున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది జనవరిలో శర్వానంద్, రక్షితల నిశ్చితార్థం జరిగిన విషయం గుర్తుండే ఉంటుంది.

నేను కూడా యూత్ అనిపించింది

- హీరో నాని



బుచ్చిబాబు, శ్రీకాంత్, నాని, సుమంత్ ప్రభాస్

''మేమంతా యూత్ అని గర్వంగా చెప్పుకునే టీమ్ నన్ను ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి పిలిచారంటే నేనూ యూత్ అనే ఎగ్జైట్‌మెంట్ కలిగింది'' అన్నారు హీరో నాని. సుమంత్ ప్రభాస్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'మేమ్ ఫేమస్'. అనురాగ్ రెడ్డి, శరత్, చంద్రు మనోహరన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు ఓ ముఖ్య అతిథిగా హాజరైన నాని మాట్లాడుతూ– ''సుమంత్ ప్రభాస్ తీసిన షార్ట్ ఫిల్మ్స్ చూసి తనలో మంచి ఛార్మ్ ఉందనుకున్నాను. ఇప్పుడు తనే హీరోగా, దర్శకుడిగా 'మేమ్ ఫేమస్' చేయడం హ్యాపీగా ఉంది'' అన్నారు నాని. ''వల్గారిటీ లేని సినిమా ఇది'' అన్నారు సుమంత్ ప్రభాస్. ''యూత్ అనుకున్నది సాధిస్తారని చెప్పే కథే ఈ సినిమా'' అన్నారు నిర్మాతలు.

బిచ్చగాడు 2 కోసం ప్రాణం పెట్టారు

- అడివి శేష్



కావ్యా థాపర్, ఫాతిమా, విజయ్, అడివి శేష్, పూరి ఆకాశ్

''సినిమా కోసం ప్రాణం పెట్టి చేశామని అందరూ చెబుతుంటారు. కానీ, 'బిచ్చగాడు 2' కోసం విజయ్, ఫాతిమాగార్లు నిజంగా ప్రాణం పెట్టి పనిచేశారు. వారికోసమైనా 'బిచ్చగాడు 2' హిట్టవ్వాలి'' అన్నారు హీరో అడివి శేష్. విజయ్ ఆంటోని హీరోగా నటించి, దర్శకత్వం వహించడంతో పాటు సంగీతమందించిన చిత్రం 'బిచ్చగాడు 2'. కావ్యా థాపర్ హీరోయిన్. ఫాతిమా విజయ్ ఆంటోని నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో రేపు (శుక్రవారం) విడుదలవుతోంది. కాగా తెలుగులో ఈ చిత్రాన్ని ఉషా పిక్చర్స్‌పై విజయ్ కుమార్, వీరనాయుడు రిలీజ్ చేస్తున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి హీరోలు అడివి శేష్, ఆకాశ్ పూరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆకాశ్ పూరి మాట్లాడుతూ– ''విజయ్ ఆంటోనిగారిని ఇంతవరకు ప్రేమిస్తూ వచ్చాను.. కానీ ఆయన్ను కలిశాక గౌరవం మొదలైంది. 'బిచ్చగాడు 2' పెద్ద హిట్టవ్వాలి'' అన్నారు. విజయ్ ఆంటోని మాట్లాడుతూ– ''బిచ్చగాడు' తొలి భాగం నచ్చినవారికి రెండో భాగం కూడా నచ్చుతుంది'' అన్నారు. ''నేనీ సినిమాకు కేవలం నిర్మాతను మాత్రమే. అన్నీ మా ఆయన (విజయ్ ఆంటోని) చూసుకున్నారు. ఆయన ప్రమాదానికి గురైనా.. అభిమానుల ప్రేమ వల్లే కోలుకున్నారు'' అన్నారు ఫాతిమా విజయ్ ఆంటోని.

సాక్షి బిజినెస్
గురువారం
18-5-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	372	61,561
నిఫ్టీ ▽	105	18,182

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	12,480	△	137
డోజోన్స్	33,398	△	386
ఎఫ్‌టీఎస్ఈ 100	7,723	▽	28
డాక్స్	15,951	△	54
షాంఘై	3,284	▽	7
నికాయ్	30,094	△	251

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	60,550
బంగారం (22 క్యారట్)	57,180
వెండి (కిలో)	74,600

మరోసారి చర్చలకు టెస్లా



న్యూఢిల్లీ: ప్రభుత్వంతో మరోసారి చర్చలకు టెస్లా సిద్ధమైంది. 'సమావేశం కోసం టెస్లా ప్రతినిధులు సంప్రదించారు. దిగుమతి సుంకంలో తగ్గింపు ఇవ్వాలని కంపెనీ గతంలో ప్రతిపాదించింది. దేశీయ తయారీని ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నందున కంపెనీ చేసిన ప్రతిపాదన ఆమోదించలేదు. ఇప్పుడు వారు అదే ప్రతిపాదనతో వస్తున్నారా లేదా మరొక ప్రతిపాదనను తీసుకువస్తున్నారా అనేది మాకు తెలియదు' అని ఒక అధికారి తెలిపారు. కాగా, భారత్‌లో తమ కార్లను మొదట విక్రయించడానికి, సర్వీస్ చేయడానికి అనుమతిస్తే తప్ప.. కంపెనీ దేశీయంగా తమ ఉత్పత్తులను తయారు చేయదని టెస్లా చీఫ్ ఎలాన్ మస్క్ గతేడాది స్పష్టం చేశారు. దిగుమతి చేసుకున్న వాహనాలతో మొదట విజయం సాధిస్తే, భారత్‌లో తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయవచ్చని ఆయన చెప్పారు. టెస్లా తన వాహనాలను ఇక్కడి మార్కెట్లో విడుదల చేయాలని భావిస్తోందని, అయితే దిగుమతి సుంకాలు ప్రపంచంలోనే ఇక్కడ అత్యధికం అని మస్క్ అన్నారు. 'టెస్లా తన ఎలక్ట్రిక్ వాహనాలను భారత్‌లో తయారు చేయడానికి సిద్ధంగా ఉంటే అప్పుడు ఏమీ సమస్య లేదు. కానీ కంపెనీ ఎట్టిపరిస్థితుల్లో చైనా నుండి కార్లను దిగుమతి చేసుకోవడానికి వీల్లేదు' అని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అంతకు ముందు తెలిపారు.

సోనాలికా ట్రాక్టర్స్ స్పీడ్

హైదరాబాద్: ట్రాక్టర్ బ్రాండ్‌లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న సోనాలికా, 2023–24 ఆర్థిక సంవత్సరంలో కూడా పటిష్ట వృద్ధి రేటుతో తన ప్రయాణాన్ని కొనసాగించింది. ఈ మేరకు విడుదలైన సంస్థ ప్రకటన ప్రకారం, ఏప్రిల్‌లో సంస్థ 12,590 ట్రాక్టర్లను విక్రయించింది.



తద్వారా మార్కెట్ షేర్‌లో దాదాపు 1.9 శాతాన్ని సొంతం చేసుకుంది. రైతుల అవసరాలు తీర్చడంలో అత్యాధునిక సాంకేతిక విలువలతో బ్రాండ్ పెంచిన విశ్వసనీయతే సోనాలికా అమ్మకాలు పెరగడానికి కారణమని ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ రామన్ మిట్టల్ ప్రకటనలో పేర్కొన్నారు.

భారత్‌లో అత్యంత సంపన్నులు తగ్గారు!

- 30 మిలియన్ డాలర్ల సంపద పైబడిన వారిపై నైట్ ఫ్రాంక్ నివేదిక
- గత ఏడాది 7.5 శాతం డౌన్
- అయితే వచ్చే ఐదేళ్లలో భారీ పెరుగుదల అంచనాలు

న్యూఢిల్లీ: భారతదేశంలో 30 మిలియన్ డాలర్ల (రూ.246 కోట్లు) పైన నెట్‌వర్త్ ఉన్న అల్ట్రా–హై–నెట్–వర్త్ వ్యక్తుల సంఖ్య గత ఏడాది 7.5 శాతం తగ్గి 12,069కి చేరినట్లు నైట్ ఫ్రాంక్ తాజా నివేదిక పేర్కొంది. అయితే రాబోయే ఐదేళ్లలో ఈ సంఖ్య 19,119 పెరుగుతుందని నైట్ ఫ్రాంక్ తెలిపారు. ఇదే జరిగితే పెరుగుదల పరిమాణం 58.4 శాతమన్నమాట. ''ది వెల్త్ రిపోర్ట్ 2023'' శీర్షికన ఆయా అంశాలకు రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సంస్థ తాజా నివేదిక తెలిపిన ఆసక్తికరమైన అంశాలను పరిశీలిస్తే...

- భారత్ బిలియనీర్లు 2021లో 145 ఉంటే, 2022నాటికి 161కి పెరిగింది. 2027 నాటికి 195 మందికి ఈ సంఖ్య పెరుగుతుందని అంచనా.



- దేశంలో మిలియన్ డాలర్లు లేదా అంతకంటే ఎక్కువ ఆస్తి విలువ కలిగిన సంపన్నుల జనాభా 2021లో 7,63,674 ఉంటే, 2022లో 7,97,714కి పెరిగింది. 2027 నాటికి ఈ జనాభా 16,57,272కు చేరుతుందని అంచనా...
- భారత్‌లోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా కూడా 2022లో అల్ట్రా–హై–నెట్–వర్త్ వ్యక్తుల సంఖ్య 3.8 శాతం తగ్గింది. 2021లో మాత్రం 9.3 శాతం పెరిగింది.
- ఆర్థిక మందగమనాలు, తరచుగా రుణ రేట్ల పెంపుదల, పెరుగుతున్న భౌగోళిక రాజకీయ అనిశ్చితి, స్టాక్ మార్కెట్ ఒడిదుడుకుల కారణంగా అత్యంత సంపన్నుల సంపద, పెట్టుబడి పోర్ట్‌ఫోలియో ప్రభావితమవుతోంది.
- భారత్ విషయానికి వస్తే, వడ్డీరేట్ల పెరుగుదల, రూపాయిపై డాలర్ బలోపేతం వంటి అంశాలు వ్యక్తుల నెట్‌వర్త్ పెరుగుదలపై ప్రభావితం చూపిస్తోంది.

వృద్ధి బాట...



పారిశ్రామిక, పారిశ్రామికేతర రంగాలలో భారత్ ఇటీవల చక్కటి అభివృద్ధిని నమోదుచేసుకుంటోంది. ఆయా కార్యకలాపాలు ఇటీవలి కాలంలో దేశంలో ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడంలో దోహదపడ్డాయి. కొత్త సంపదను సృష్టించే గ్లోబల్ స్టార్టప్ హబ్‌గా భారతదేశం కీలక స్థానంలో ఉంది. దేశంలో గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్, టెక్నాలజీ స్టార్టప్‌లు మొదలైన రంగాల నుండి వెలువడుతున్న కొత్త అవకాశాలు ఆర్థిక ఊపును ప్రోత్సహిస్తున్నాయి. సంపద సృష్టికి దోహదపడతాయి, ఇవన్నీ భారత్‌లో అత్యంత సంపన్నుల సంఖ్య పెరగడానికి తమ వంతు పాత్ర పోషిస్తున్నాయి

– శిశిర్ బైజల్, నైట్ ఫ్రాంక్ ఇండియా సీఎండీ

హ్యుందాయ్, షెల్ జోడీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ హ్యుందాయ్ మోటా ర్ ఇండియా తాజాగా ఎనర్జీ రంగంలో ఉన్న షెల్ ఇండియాతో ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా హ్యుందాయ్‌కి చెందిన 36 డీలర్‌షిప్ కేంద్రాల వద్ద 60 కిలోవాట్ ఫాస్ట్ చార్జర్లను షెల్ ఏర్పాటు చేస్తుంది. దేశంలో బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాల కోసం చార్జింగ్ మౌలిక సదుపాయాల విస్తరణను పెంచడం ఈ వ్యూహాత్మక భాగస్వామ్య లక్ష్యం అని కంపెనీ తెలిపింది.



'కర్బన ఉద్గారాలను తగ్గించాలన్న జాతీయ లక్ష్యాన్ని సాధించడానికి వినియోగదారులు ఎలక్ట్రిక్ వాహనాలను స్వీకరించడాన్ని వేగవంతం చేయడంలో ఇటువంటి వ్యూహాత్మక భాగస్వామ్యాలు ప్రాథమికమైనవి' అని హ్యుందాయ్ మోటార్ ఇండియా ఎండీ, సీఈవో ఉన్సూ కిమ్ తెలిపారు. హ్యుందాయ్ ప్రస్తుతం ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాల కోసం దేశవ్యాప్తంగా 45 నగరాల్లో 72 కేంద్రాలను నిర్వహిస్తోంది.


ఎస్‌పీ హిందుజా ఇక లేరు

87 ఏళ్ల వయసులో లండన్‌లో మృతి

న్యూఢిల్లీ: హిందుజా గ్రూప్ చైర్మన్, హిందుజా సోదరుల్లో అందరి కంటే పెద్ద అయిన శ్రీచంద్ పరమానంద్ హిందుజా (ఎస్‌పీ హిందుజా) 87 ఏళ్ల వయసులో, అనారోగ్యంతో బుధవారం లండన్‌లో తుది శ్వాస విడిచారు. తమ కుటుంబ పెద్ద, హిందుజా గ్రూప్ చైర్మన్ ఎస్‌పీ హిందుజా మృతి పట్ల సోదరులు గోపీచంద్, ప్రకాశ్, అశోక్, కుటుంబ సభ్యులు విచారం వ్యక్తం చేశారు. ఎస్‌పీ హిందుజా భార్య మధు సైతం 82 ఏళ్ల వయసులో ఈ ఏడాది జనవరిలోనే కన్నుమూశారు. వీరికి కుమార్తెలు షను, వినూ ఉన్నారు. దేశ విభజనకు ముందు భారత్‌లో భాగంగా ఉన్న కరాచీలో, వ్యాపార కుటుంబంలో ఎస్‌పీ హిందుజా జన్మించారు. భారత్ నుంచి బోఫోర్స్ సంస్థ కాంట్రాక్టు పొందే విషయంలో ఎస్‌పీ హిందుజా, ఆయన సోదరులు గోపీచంద్, ప్రకాశ్ కమీషన్లు తీసుకున్నట్టు అప్పట్లో ఆరోపణలు ఎదుర్కొన్నారు. 2005లో ఢిల్లీ హైకోర్టు వీరిని నిర్దోషులుగా ప్రకటించింది.

వ్యాపార నేపథ్యం..

హిందుజా వ్యాపారాలను పరమానంద్ దీప్‌చంద్ హిందుజా ప్రారంభించారు. ప్రస్తుతం పాకిస్తాన్



ఆధీనంలోని సింధ్ ప్రాంతంలో వస్తు వాణిజ్యం నిర్వహించే వారు. 1919లో ఇరాన్‌కు వీరి కుటుంబం తరలిపోయింది. 1964లో రాజ్ కపూర్ నటించిన 'సంగం' సినిమాని మిడిల్‌ఈస్ట్ ప్రాంతంలో ఎస్‌పీ హిందుజా పంపిణీ చేసి, భారీ లాభాలు ఆర్జించారు. 1980లో అశోక్ లేలాండ్‌ను కొనుగోలు చేశారు. అనంతరం గల్ఫ్ ఆయిల్ ఇంటర్నేషనల్ నియంత్రణను షెవ్రాన్ నుంచి దక్కించుకున్నారు. 1993లో ఎస్‌పీ హిందుజా ఇండస్‌ఇండ్ బ్యాంక్ ద్వారా బ్యాంకింగ్‌లోకి ప్రవేశించారు. వీరి కుటుంబం బ్రిటన్‌లో స్థిరపడింది. బ్రిటన్, భారత్ మధ్య సంబంధాల బలోపేతంలోనూ వీరి పాత్ర ఉంది.

మహిళా సమ్మాన్ డిపాజిట్‌పై టీడీఎస్ లేదు



న్యూఢిల్లీ: కేంద్ర సర్కారు 2023–24 బడ్జెట్‌లో మహిళా సమ్మాన్ పేరుతో ప్రత్యేక డిపాజిట్ పథకాన్ని ప్రకటించింది. గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. వార్షిక వడ్డీ 7.5 శాతం. రెండేళ్లకు గడువు ముగుస్తుంది. మహిళల కోసమే ఈ డిపాజిట్‌ను తీసుకొచ్చింది. అయితే ఇందులో పెట్టుబడిపై వచ్చే వడ్డీ ఆదాయం పన్ను పరిధిలోకి వస్తుందని ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి (సీబీడీటీ) తాజాగా స్పష్టం చేసింది. అదే సమయంలో రాబడిపై టీడీఎస్ (మూలం వద్ద పన్ను కోత) అమలు చేయరని పేర్కొంది. సీబీడీటీ ఆదేశాల ప్రకారం మహిళా సమ్మాన్ సర్టిఫికెట్‌లో వచ్చే వడ్డీ ఆదాయం రూ.40వేలు మించకపోతే టీడీఎస్ వర్తించదని స్పష్టమవుతోందని నాంజియా అండర్సన్ ఇండియా పార్ట్‌నర్ నీరజ్ అగర్వాల్ తెలిపారు. ఈ పథకంలో గరిష్ఠ పెట్టుబడిపై ఒక ఏడాదిలో 7.5 శాతం మేరకు రాబడి రూ.15,000గానే ఉంటుందని, కనుక టీడీఎస్ వర్తించదన్నారు.

మార్కెట్‌కు రెండో రోజూ నష్టాలు..

ఐటీ షేర్లలో అమ్మకాలు

ముంబై: ఐటీ, బ్యాంకింగ్, టెక్నాలజీ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తడంతో దేశీయంగా కీలక సూచీలు వరుసగా రెండో రోజూ నష్టపోయాయి. సెన్సెక్స్ 372 పాయింట్లు క్షీణించి 61,561 వద్ద, నిఫ్టీ 105 పాయింట్లు తగ్గి 18,182 వద్ద ముగిశాయి. అంతర్జాతీయంగా సెంటిమెంట్ బలహీనంగా ఉండటం, అమెరికా మార్కెట్లు మందగమన భయాలను ఎదుర్కొనే ప్రయత్నాల్లో ఉండటం తదితర అంశాల నేపథ్యంలో దేశీ ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. ఏప్రిల్‌లో అమెరికాలో అమ్మకాలు క్షీణించడం, రుణ పరిమితులపై చర్చలు కొనసాగుతూ ఉండటం వంటివి మార్కెట్ సెంటిమెంటును దెబ్బతీసినట్లు ఆయన పేర్కొన్నారు. సెన్సెక్స్‌లో కోటక్ మహీంద్రా బ్యాంక్, టీసీఎస్, హెచ్‌సీఎల్, ఇన్ఫీ, ఏషియన్ పెయింట్స్, విప్రో మొదలైనవి క్షీణించాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఐటీసీ, మారుతీ సుజుకీ, ఎస్‌బీఐ తదితర స్టాక్స్ లాభపడ్డాయి. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 0.25 శాతం పెరగ్గా మిడ్‌క్యాప్ సూచీ 0.16 శాతం క్షీణించింది. కీలక సూచీల్లో రియల్టీ 1.29 శాతం, టెక్ 0.89 శాతం, యుటిలిటీస్ 0.82 శాతం, ఐటీ 0.79 శాతం, టెలికం 0.57 శాతం క్షీణించాయి. ఎఫ్ఎంసీజీ, ఇండస్ట్రియల్స్, ఆటో సూచీలు లాభపడ్డాయి.



ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్ మార్కెట్లు లాభాల్లో చైనా, హాంకాంగ్ నష్టాల్లో ముగిశాయి. యూరప్ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడయ్యాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) నికరంగా రూ. 149 కోట్లు కొనుగోళ్లు జరపగా, దేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (డీఐఐ) రూ. 204 కోట్ల మేర విక్రయించాయి.

విద్య, ఉద్యోగ సమాచారం

జేఎన్ఏఎఫ్ఏయూ యూనివర్శిటీలో బీఎఫ్ఏ, బీడిజైన్ కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ.. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి జేఎన్ఏఎఫ్ఏయూ, అనుబంధ కళాశాలల్లో బీఎఫ్ఏ, బీడిజైన్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందుకోసం ఫైన్ ఆర్ట్స్ అండ్ డిజైన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(ఎఫ్ఏడీఈఈ)ని నిర్వహిస్తోంది.

» **కోర్సులు, సీట్ల వివరాలు:** బీఎఫ్ఏ(అప్లైడ్ ఆర్ట్)–50 సీట్లు, బీఎఫ్ఏ(పెయింటింగ్) –35 సీట్లు, బీఎఫ్ఏ(స్కల్ప్చర్)–20 సీట్లు, బీఎఫ్ఏ(యానిమేషన్)–60 సీట్లు, బీఎఫ్ఏ(ఫోటోగ్రఫీ)–50 సీట్లు, బీడిజైన్(ఇంటీరియర్ డిజైన్)–60 సీట్లు.
» **అర్హత:** ఇంటర్మీడియట్ లేదా తత్సమానం ఉత్తీర్ణులై ఉండాలి. » **ప్రోగ్రామ్ వ్యవధి:** నాలుగేళ్లు.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ఫీజు చెల్లింపు చివరితేది:** 05.06.2023.
» **రూ.2000 ఆలస్య రుసుముతో దరఖాస్తులకు చివరితేది:** 12.06.2023.
» **ప్రవేశ పరీక్ష తేదీలు:**17.06.2023, 18.06.2023.
» **వెబ్‌సైట్:** www.jnafauadmissions.com

తెలంగాణ హైకోర్టులో 96 స్టెనోగ్రాఫర్ పోస్టులు

తెలంగాణ హైకోర్టు రాష్ట్రంలోని వివిధ కోర్టుల్లో స్టెనోగ్రాఫర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 96
» **అర్హత:** గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులవ్వాలి. ఇంగ్లిష్ టైప్‌రైటింగ్‌లో అర్హత సాధించాలి. ఇంగ్లిష్‌లో నిమిషానికి 45 పదాలు టైప్ చేసే సామర్థ్యం ఉండాలి. **వయసు:** 18 నుంచి 34 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.32,810 నుంచి రూ.96,890 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఇంగ్లిష్ షార్ట్‌హ్యాండ్ టెస్ట్‌లో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 25.05.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.06.2023.
» **వెబ్‌సైట్:** www.tshc.gov.in

తెలంగాణ హైకోర్టులో 84 కాపీస్ట్ పోస్టులు

తెలంగాణ హైకోర్టు రాష్ట్రంలోని వివిధ కోర్టుల్లో పనిచేసేందుకు కాపీస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 84
» **అర్హత:** 12వ తరగతి/ఇంటర్మీడియట్/తత్సమాన ఉత్తీర్ణులవ్వాలి. ఇంగ్లిష్ టైప్‌రైటింగ్‌లో అర్హత సాధించాలి. ఇంగ్లిష్‌లో నిమిషానికి 45 పదాలు టైప్ చేసే సామర్థ్యం ఉండాలి. **వయసు:** 18 నుంచి 34 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.22,900 నుంచి రూ.69,150 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఇంగ్లిష్ టైప్‌రైటింగ్ టెస్ట్(స్కిల్ టెస్ట్) ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 25.05.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.06.2023.
» **స్కిల్ టెస్ట్ తేది:** జూలై 2023.
» **వెబ్‌సైట్:** www.tshc.gov.in

తెలంగాణ హైకోర్టులో 144 టైపిస్ట్ పోస్టులు

తెలంగాణ హైకోర్టు రాష్ట్రంలోని వివిధ కోర్టుల్లో టైపిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 144
» **అర్హత:** బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ఇంగ్లిష్ టైప్‌రైటింగ్‌లో అర్హత సాధించాలి. ఇంగ్లిష్‌లో నిమిషానికి 45 పదాలు టైప్ చేసే సామర్థ్యం ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 34 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.24,280 నుంచి రూ.72,850 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఇంగ్లిష్ టైప్‌రైటింగ్ టెస్ట్(స్కిల్‌టెస్ట్) ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 25.05.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.06.2023.
» **స్కిల్ టెస్ట్ తేది:** జూలై 2023.
» **వెబ్‌సైట్:** www.tshc.gov.in

ఏపీ డీఈఈసెట్-2023

ఏపీ ప్రభుత్వ పాఠశాల విద్యా విభాగం.. 2023–25 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండేళ్ల డీఈఎల్ఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు డీఈఈసెట్–2023 నోటిఫికేషన్‌ను విడుదలచేసింది. డీఈఈసెట్ ర్యాంక్ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ డైట్‌లు/ప్రైవేట్ ఎలిమెంటరీ టీచర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో ప్రవేశాలు కల్పిస్తారు.

» **పరీక్ష:** ఏపీ డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (డీఈఈసెట్)–2023
» **కోర్సు:** డీఈఎల్ఈడీ(డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్).
» **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్మీడియట్ లేదా దానికి సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:**01.09.2023 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి లేదు.
» **ఎంపిక విధానం:** డీఈఈసెట్‌లో సాధించిన ర్యాంకు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 28.05.2023.
» **హాల్ టిక్కెట్ల జారీ తేది:** 05.06.2023.
» **ప్రవేశ పరీక్ష తేదీలు:** 12.06.2023 నుంచి 13.06.2023.
» **వెబ్‌సైట్:** www.apdeecet.apcfss.in

విడుదలైన యూపీఎస్సీ జాబ్ క్యాలెండర్

దేశంలో అత్యున్నత నియామక సంస్థ.. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ). జాతీయ స్థాయిలో ఏటా సివిల్స్‌తో పాటు పలు కేంద్ర సర్వీసులకు నియామక పరీక్షలను కమిషన్ నిర్వహిస్తోంది. ఈ పరీక్షలకు దేశవ్యాప్తంగా లక్షలాది మంది అభ్యర్థులు పోటీపడుతుంటారు. యూపీఎస్సీ తాజాగా 2024 సంవత్సరానికి సంబంధించి వార్షిక క్యాలెండర్‌ను విడుదల చేసింది. నోటిఫికేషన్ విడుదల తేదీ, దరఖాస్తులకు చివరి తేదీలతోపాటు పరీక్ష తేదీలను సైతం ప్రకటించింది. ఈ నేపథ్యంలో.. యూపీఎస్సీ ఎగ్జామ్ క్యాలెండర్-2024లో పేర్కొన్న పరీక్షల వివరాలు..

సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2024

దేశంలోని సివిల్స్ వంటి ఉన్నత సర్వీసుల్లో చేరాలని కలలు కనే అభ్యర్థుల సంఖ్య లక్షల్లో ఉంటుంది. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి అత్యున్నత సర్వీసులకు అభ్యర్థులను ఎంపిక చేసే మూడంచెల పరీక్ష.. సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్! ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులైనవారు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **నోటిఫికేషన్ తేదీ:** 2024 ఫిబ్రవరి 14
- **దరఖాస్తుకు చివరితేదీ:** 2024 మార్చి 5
- **ప్రిలిమినరీ పరీక్ష తేదీ:** 2024 మే 26
- **మెయిన్ ఎగ్జామినేషన్ తేదీ:** 2024 సెప్టెంబర్ 20

ఎన్‌డీఏ,ఎన్ఏ ఎగ్జామినేషన్- 2024

త్రివిధ దళాల్లో ఎంట్రీ లెవల్ పోస్టుల భర్తీకి నిర్వహించే పరీక్ష.. నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ), నేవల్ అకాడమీ(ఎన్ఏ) ఎగ్జామినేషన్. ఈ పరీక్ష ద్వారా ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీల్లోకి చురుకైన యువతను ఎంపిక చేసి.. శిక్షణనిచ్చి.. దేశ రక్షణలో భాగస్వాములను చేస్తారు. త్రివిధ దళాల్లో లెఫ్టినెంట్ హోదా మొదలు.. జనరల్, అడ్మిరల్, ఎయిర్ చీఫ్ మార్షల్ వరకూ.. ఇలా.. వివిధ ఉన్నత స్థానాల్లో ఉన్న వారంతా.. ఎన్‌డీఏ, ఎన్ఏలో శిక్షణ పొందిన వారే. ఇంటర్మీడియెట్ అర్హతతోనే ఎన్‌డీఏ, ఎన్ఏలలో అడుగు పెట్టొచ్చు. ప్రతి ఏటా రెండుసార్లు ఈ పరీక్షను నిర్వహిస్తారు.

ఎన్‌డీఏ,ఎన్ఏ ఎగ్జామినేషన్(1)–2024 తేదీలు:

- **నోటిఫికేషన్ తేదీ:** 2023 డిసెంబర్ 20
- **దరఖాస్తుకు చివరితేదీ:** 2024 జనవరి 9
- **పరీక్ష తేదీ:** 2024 ఏప్రిల్ 21

ఎన్‌డీఏ,ఎన్ఏ ఎగ్జామినేషన్(2)–2024 తేదీలు:

» సివిల్స్ నుంచి సీడీఎస్ వరకూ వివిధ పరీక్షల తేదీలు వెల్లడి

» పరీక్షల నిర్వహణలో నిర్దిష్ట షెడ్యూల్‌ను అనుసరిస్తున్న యూపీఎస్సీ

- **నోటిఫికేషన్ తేదీ:** 2024 మే 15
- **దరఖాస్తుకు చివరి తేదీ:** 2024 జూన్ 4
- **పరీక్ష తేదీ:** 2024 సెప్టెంబర్ 1.

ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఎగ్జామినేషన్-2024

డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్‌గా కెరీర్ ప్రారంభించి.. కన్జర్వేటర్ వంటి ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు మార్గం.. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్(ఐఎఫ్ఎస్). ఐఎఫ్ఎస్‌ను కూడా ఆల్ ఇండియా సర్వీస్‌గానే పేర్కొంటారు. బీఎస్సీ, బీటెక్, అగ్రికల్చరల్ బీఎస్సీ తదితర సైన్స్, ఇంజనీరింగ్ డిగ్రీ అర్హతలతో ఈ పరీక్షకు పోటీపడొచ్చు.

- **నోటిఫికేషన్ తేదీ:** 2024 ఫిబ్రవరి 14
- **దరఖాస్తుకు చివరి తేదీ:** 2024 మార్చి 5
- **ప్రిలిమినరీ పరీక్ష తేదీ:** 2024 మే 26
- **మెయిన్ పరీక్ష తేదీ:** 2024 నవంబర్ 24

ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2024

ఉన్నత స్థాయి ప్రభుత్వ ఉద్యోగం కోరుకునే ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లకు చక్కటి అవకాశం.. ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(ఈఎస్ఈ). ఇందులో విజయం సాధిస్తే కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఉన్నత కొలువు సొంతం చేసుకోవచ్చు. సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ తదితర విభాగాల్లో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులైన వారు ఈఎస్ఈకి అర్హులు.

- **నోటిఫికేషన్ తేదీ:** 2023 సెప్టెంబర్ 6
- **దరఖాస్తుకు చివరి తేదీ:** 2023 సెప్టెంబర్ 26
- **ప్రిలిమినరీ పరీక్ష తేదీ:** 2024 ఫిబ్రవరి 18
- **మెయిన్ పరీక్ష తేదీ:** 2024 జూన్ 23

సీడీఎస్ ఎగ్జామినేషన్-2024

త్రివిధ దళాల్లో పర్మనెంట్ కమిషన్ ర్యాంకులో..ఆఫీసర్ పోస్టుల భర్తీకి నిర్వహించే పరీక్ష.. కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్(సీడీఎస్) ఎగ్జామినేషన్. ఇందులో విజయం సాధిస్తే..కొలువు ఖరారు కావడమే కాకుండా.. శిక్షణ సమయంలోనే ప్రతి నెలా స్టయిఫండ్ సైతం పొందొచ్చు. బ్యాచిలర్ డిగ్రీ అర్హతతో సీడీఎస్‌కు పోటీపడొచ్చు. ప్రతి ఏటా రెండుసార్లు ఈ పరీక్షను నిర్వహిస్తారు.

సీడీఎస్ ఎగ్జామినేషన్(1)–2024 తేదీలు:

- **నోటిఫికేషన్ తేదీ:** 2023 డిసెంబర్ 20
- **దరఖాస్తుకు చివరితేదీ:** 2024 జనవరి 9
- **పరీక్ష తేదీ:** 2024 ఏప్రిల్ 21



సీడీఎస్ ఎగ్జామినేషన్(2)–2024 తేదీలు:

- **నోటిఫికేషన్ తేదీ:** 2024 మే 15
- **దరఖాస్తుకు చివరి తేదీ:** 2024 జూన్ 4
- **పరీక్ష తేదీ:** 2024 సెప్టెంబర్ 1

కంబైన్డ్ జియో సైంటిస్ట్ ఎగ్జామినేషన్-2024

కేంద్ర జలవనరులు, గనుల మంత్రిత్వ శాఖల్లోని ఉన్నతస్థాయి ఉద్యోగాలు సొంతం చేసుకునేందుకు మార్గం.. కంబైన్డ్ జియో సైంటిస్ట్ ఎగ్జామినేషన్. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో జియాలజిస్ట్, జియో ఫిజిసిస్ట్, కెమిస్ట్ హైడ్రోజియాలజిస్ట్ తదితర పోస్టులను ఈ పరీక్ష ద్వారా భర్తీ చేస్తారు. జియలాజికల్ సైన్స్, జియాలజీ, అప్లయిడ్ జియాలజీ తదితర విభాగాల్లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసిన వారు ఈ పరీక్షకు అర్హులు.

- **నోటిఫికేషన్ తేదీ:** 2023 సెప్టెంబర్ 20
- **దరఖాస్తుకు చివరి తేదీ:** 2023 అక్టోబర్ 10
- **ప్రిలిమినరీ పరీక్ష తేదీ:** 2024 ఫిబ్రవరి 18
- **మెయిన్ పరీక్ష తేదీ:** 2024 జూన్ 22

ఐఈఎస్/ఐఎస్ఎస్ ఎగ్జామినేషన్ 2024

ఐఈఎస్/ఐఎస్ఎస్ ఎగ్జామినేషన్ 2024 ద్వారా.. ఇండియన్ ఎకనామిక్ సర్వీస్(ఐఈఎస్), ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్(ఐఎస్ఎస్)ల్లో చేరొచ్చు. ఎకనామిక్స్/అప్లైడ్ ఎకనామిక్స్/బిజినెస్ ఎకనామిక్స్/ఎకనోమెట్రిక్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివిన వారు ఐఈఎస్‌కు; స్టాటిస్టిక్స్/మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్/ అప్లైడ్ స్టాటిస్టిక్స్‌లో ఏదైనా ఒక సబ్జెక్టుతో బ్యాచిలర్ డిగ్రీ(లేదా) ఇవే సబ్జెక్టుల్లో మాస్టర్స్ డిగ్రీ చదివిన వారు ఐఎస్ఎస్ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **నోటిఫికేషన్ తేదీ:** 2024 ఏప్రిల్ 10
- **దరఖాస్తుకు చివరి తేదీ:** 2024 ఏప్రిల్ 30
- **పరీక్ష తేదీ:** 2024 జూన్ 21.

కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్-2024

కేంద్ర వైద్యారోగ్య సర్వీసుల్లో 'డాక్టర్లు'గా చేరేందుకు వీలుకల్పించే పరీక్ష.. కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(సీఎంఎస్ఈ). దీని ద్వారా ఇండియన్ రైల్వే, ఇండియన్ ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలు, సెంట్రల్ హెల్త్ సర్వీస్ విభాగాల్లో.. 'మెడికల్ ఆఫీసర్' పోస్టులు భర్తీ చేస్తారు. ఎంబీబీఎస్ పూర్తిచేసిన వారు సీఎంఎస్ఈకి దరఖాస్తు చేసుకోవచ్చు.

- **నోటిఫికేషన్ తేదీ:** 2024 ఏప్రిల్ 10
- **దరఖాస్తుకు చివరితేదీ:** 2024 ఏప్రిల్ 30
- **పరీక్ష తేదీ:** 2024 జూలై 14.

సీఏపీఎఫ్ (అసిస్టెంట్ కమాండెంట్స్) ఎగ్జామినేషన్-2024

బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, సీఐఎస్ఎఫ్ తదితర కేంద్ర సాయుధ బలగాల్లో ఆఫీసర్ కేడర్ పోస్టుల్లో చేరేందుకు మార్గం..సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్(సీఏపీఎఫ్) (అసిస్టెంట్ కమాండెంట్స్) ఎగ్జామినేషన్. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ పూర్తిచేసిన వారు ఈ పరీక్షకు అర్హులు.

- **నోటిఫికేషన్ తేదీ:** 2024 ఏప్రిల్ 24
- **దరఖాస్తుకు చివరితేదీ:** 2024 మే 14
- **పరీక్ష తేదీ:** 2024 ఆగస్టు 4

- వీటితోపాటు సీఐఎస్ఎఫ్ ఏసీ(ఈఎక్సీఈ) ఎల్‌డీసీఈ–2024 నోటిఫికేషన్ 2023 నవంబర్ 29న వెలువడనుంది. దరఖాస్తుకు చివరితేదీ 2023 డిసెంబర్ 19. పరీక్ష తేదీ 2024 మార్చి 10. అదేవిధంగా ఎస్.ఒ./స్టెనో(జీడీ–బి/జీడీ–1) ఎల్‌డీసీఈ–2024 నోటిఫికేషన్ 2024 సెప్టెంబర్ 11న వెలువడనుంది. దరఖాస్తులకు చివరి తేది 2024 అక్టోబర్ 1. పరీక్ష తేది 2024 డిసెంబర్ 07. అంతేకాకుండా యూపీఎస్సీ రిక్రూట్‌మెంట్ టెస్ట్(ఆర్‌టీ)ల కోసం 2024 జనవరి 13, ఫిబ్రవరి 24, మార్చి 9, జూలై 6, ఆగస్టు 10, అక్టోబర్ 19, డిసెంబర్ 21 తేదీలను రిజర్వ్ చేశారు.
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.upsc.gov.in

క్లుప్తంగా...



బాసర, యాదాద్రిలో హిమాన్షు పూజలు

సీఎం కేసీఆర్ మనవడు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ తనయుడు కల్వకుంట్ల హిమాన్షు బుధవారం బాసర సరస్వతి, యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.

– భైంసా/యాదగిరిగుట్ట

నెలాఖరులో పాలిసెట్ ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్, నాన్-ఇంజనీరింగ్, అగ్రికల్చర్, వెటర్నరీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పాలిసెట్-2023 బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 296 కేంద్రాల్లో ప్రశాంతంగా ముగిసింది. పరీక్షకు 1,05,742 మంది దరఖాస్తు చేసుకోగా, 98,273 (92.94 శాతం) మంది పరీక్షకు హాజరయ్యారు. పాలిసెట్ ఫలితాలు ఈ నెలాఖరులో వెల్లడించనున్నట్లు ఉన్నత విద్యామండలి కార్యదర్శి డాక్టర్ సి.శ్రీనాథ్ తెలిపారు.

లైబ్రేరియన్ అర్హత పరీక్షకు 55% హాజరు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా కమిషనరేట్ పరిధిలోని 71 లైబ్రేరియన్ ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన అర్హత పరీక్షకు 55శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 17 కేంద్రాల్లో పరీక్షను నిర్వహించారు. 4,790 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, 3,924 మంది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఉదయం జరిగిన పేపర్-1కు 2,663 మంది, మధ్యాహ్నం జరిగిన పేపర్-2 పరీక్షకు 2,650 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

ఇంటర్ విద్య ఉద్యోగుల బదిలీలకు వినతి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న జూనియర్ అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు, లైబ్రేరియన్లు, ఫిజికల్ డైరెక్టర్లు, ఇతర సిబ్బందికి బదిలీలు చేపట్టాలని తెలంగాణ ఇంటర్ విద్య పరిరక్షణ సమితి కన్వీనర్ మాచర్ల రామకృష్ణగౌడ్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అయిదేళ్లుగా బదిలీలు లేకపోవడం వల్ల ఉద్యోగులు అనేక రకాలుగా నష్టపోతున్నారని తెలిపారు. బదిలీలు చేపడితే ఇంటర్ విద్య మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు.

49 పరీక్ష కేంద్రాల్లో నేడు ఎడ్‌సెట్

సాక్షి, హైదరాబాద్/ఎంజీయూ(నల్లగొండ రూరల్): రెండేళ్ల బీఈడీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఎడ్‌సెట్ పరీక్ష గురువారం జరగనుంది. పరీక్ష కోసం 31,725 మంది దరఖాస్తు చేసుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మొత్తం 49 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్, ఎడ్‌సెట్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, కన్వీనర్ ప్రొఫెసర్ ఎ.రామకృష్ణ తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఒక సెషన్, మధ్యాహ్నం 12.30 నుంచి 2.30 వరకు రెండో సెషన్, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకూ మూడో సెషన్ జరగనుందన్నారు. మొదటిసారి కంప్యూటర్ బేస్డ్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం ఉదయం 9గంటలకు ఎంజీయూలో ప్రశ్నపత్రం కోడ్ విడుదల చేస్తామన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి 90 నిమిషాల ముందు రావాలని, కోవిడ్ ప్రొటోకాల్ ప్రకారం థర్మల్ స్క్రీనింగ్ చేస్తారని ఆయన తెలిపారు.

జూన్ 12 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 12 నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షల టైమ్‌టేబుల్‌ను బుధవారం ఇంటర్ బోర్డ్ విడుదల చేసింది. ఫస్టియర్, సెకండ్ ఇయర్ పరీక్షలు ఒకేరోజు నిర్వహించనున్నట్లు తెలిపింది. జూన్ 5 నుంచి 9 వరకు సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఉంటాయని పేర్కొంది. ఎథిక్స్, హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్ష 21న, ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పేపర్ జూన్ 22న నిర్వహించనున్నట్లు వెల్లడించింది.

తేదీ	పరీక్ష
12.6.23	సెకండ్ లాంగ్వేజ్
13.6.23	ఇంగ్లిష్
14.6.23	మేథ్స్-ఏ, బాటనీ, పొలిటికల్ సైన్స్
15.6.23	మేథ్స్-బీ, జువాలజీ, హిస్టరీ
16.6.23	ఫిజిక్స్, ఎకనామిక్స్
17.6.23	కెమిస్ట్రీ, కామర్స్
19.6.23	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, బ్రిడ్జికోర్సు మేథ్స్
20.6.23	మోడ్రన్ లాంగ్వేజ్, జాగ్రఫీ

మానసిక ఆరోగ్యం కుదేల్

చేతికి మొబైల్..

- స్మార్ట్‌ఫోన్‌ను మొదట చేతబట్టిన వయసే కీలకమంటున్న నిపుణులు
- చిన్న వయసులోనే చేతికిస్తే పెద్దయ్యాక మానసిక సమస్యలు
- ఆరేళ్లకే ఫోన్ వాడటం మొదలుపెట్టినవారిలో 74 శాతం మందికి.. 10 ఏళ్లకు మొదలుపెట్టినవారిలో 61%, 15 ఏళ్లకు చేతపట్టినవారిలో 52% మందికి ఇబ్బందులు
- యుక్త వయసు వచ్చాకే పూర్తిస్థాయిలో స్మార్ట్‌ఫోన్ ఇవ్వడం మేలని సూచనలు
- సేపియన్ ల్యాబ్స్ సంస్థ అధ్యయనంలో వెల్లడి



➤ పిల్లలకు చిన్న వయసులోనే స్మార్ట్‌ఫోన్/ట్యాబ్లెట్ చేతికి ఇచ్చి మురిసిపోతున్న తల్లిదండ్రులు.. వారు భవిష్యత్తులో మానసిక సమస్యల బారిన పడేందుకు కారణమవుతున్నారని ఓ అధ్యయనం స్పష్టం చేసింది. ఎంత చిన్న వయసులో స్మార్ట్‌ఫోన్/ట్యాబ్లెట్ ఇస్తే.. వారు యుక్త వయసులోకి వచ్చాక అంత ఎక్కువగా మానసిక సమస్యల బారినపడే ప్రమాదం ఉంటుందని హెచ్చరించింది. చిన్నవయసులో స్మార్ట్‌ఫోన్ ఇవ్వడమంటే చేజేతులా వారి భవిష్యత్తును నాశనం చేసినట్టేనని పేర్కొంది.

సాక్షి, హైదరాబాద్: పిల్లలకు డిజిటల్ పరిజ్ఞానం పెరుగుతుందని, ఆన్‌లైన్‌లో నేర్చుకుంటారని స్మార్ట్‌ఫోన్లుగానీ, ట్యాబ్లెట్‌గానీ ఇస్తే.. భవిష్యత్తులో మానసిక సమస్యల బారినపడటం ఖాయమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎంత చిన్న వయసులో పిల్లలకు స్మార్ట్‌ఫోన్ ఇస్తే.. పెద్దయ్యాక మానసిక ఇబ్బందులతో బాధపడే అవకాశాలు అంత ఎక్కువగా ఉంటాయని స్పష్టం చేస్తున్నారు. అమెరికాకు చెందిన స్వచ్ఛంద సంస్థ సేపియన్ ల్యాబ్స్ ఇటీవల భారత్ సహా 40 దేశాల్లో నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. బాల్యంలోనే స్మార్ట్‌ఫోన్లను అందుకున్నవారు.. యుక్త వయసుకు వచ్చాక ఆత్మహత్య ఆలోచనలు పెరగడం, ఇతరుల పట్ల దూకుడుగా వ్యవహరించడం, వాస్తవికత నుంచి దూరంగా పలు రకాల భ్రాంతులకు గురికావడం వంటివి ఎదుర్కొంటున్నట్టు తేలింది. ఈ అధ్యయనం కోసం పలు దేశాల్లో 18 నుంచి 24 ఏళ్ల మధ్య వయసున్న 27,969 మంది నుంచి డేటా సేకరించారు. అందులో మన దేశానికి చెందినవారు 4,000 మంది ఉండటం గమనార్హం.

అధ్యయనంలో వెల్లడైన అంశాలివీ..

➤ మహిళలకు సంబంధించి.. పెద్దగా ఊహ తెలియని అంటే ఆరేళ్ల వయసులోనే స్మార్ట్‌ఫోన్‌ను వినియోగించడం ప్రారంభించిన 74% మంది తీవ్రమైన మానసిక ఆరోగ్య సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఇక 10 ఏళ్ల వయసులో మొదటి స్మార్ట్‌ఫోన్ అందుకున్నవారిలో 61% మంది.. 15 ఏళ్లకే వాడటం మొదలుపెట్టినవారిలో 52% మంది.. 18 ఏళ్లకు వాడటం ప్రారంభించిన వారిలో 46% మంది మానసిక దుష్ప్రభావాలకు లోనయ్యారు.

➤ పురుషులకు సంబంధించి ఈ ప్రభావం కాస్త తక్కువగా ఉన్నట్టు తేలింది. ఆరేళ్ల వయసులో స్మార్ట్‌ఫోన్‌ను వాడటం మొదలుపెట్టిన వారిలో 42% మంది మానసిక సమస్యలకు గురైతే.. 18 ఏళ్లలో స్మార్ట్‌ఫోన్ చేతపట్టిన వారిలో ఇది 36 శాతమే.

అంతర్జాతీయ సగటు కంటే మనమే ఎక్కువ..

గత ఏడాది విడుదలైన మెకాఫే గ్లోబల్ కనెక్టెడ్ ఫ్యామిలీ సర్వే ప్రకారం.. 10–14 ఏళ్ల వయసున్న భారతీయుల్లో స్మార్ట్‌ఫోన్ వినియో గం 83% ఉండటం గమనార్హం. అంతర్జాతీయ సగటు 76% కంటే ఇది 7% ఎక్కువ. అంటే మన దగ్గర మిగతా అన్ని వయసుల వారికన్నా.. పిల్లలు ఎక్కువగా స్మార్ట్ ఫోన్ వాడుతున్నారు. వారు సగటున రోజుకు 5–8 గంటల పాటు.. అంటే సంవత్సరానికి 2,950 గంటల వరకు ఆన్‌లైన్‌లోనే గడుపుతు న్నారని వినియోగ గణాంకాలు చూపిస్తున్నాయి.

తోటి వారితో కలవక ప్రవర్తన దెబ్బతింటోంది

స్మార్ట్‌ఫోన్ విప్లవానికి ముందు పిల్లలు చాలా సమయం కుటుంబంతో, స్నేహితులతో గడిపేవారు. ఇప్పుడీ పరిస్థితి లేదు. సమాజంలో తమ భాగస్వామ్యానికి తగినట్టుగా సాధన లేకపోవడం, తోటివారితో కలవకపోవడంతో ప్రవర్తన తీరు సంక్లిష్టంగా మారుతోంది. స్మార్ట్‌ఫోన్‌కు చిరు ప్రాయంలోనే అలవాటు పడటం అంటే పెద్దవారిగా ఎక్కువ మానసిక సమస్యలు ఎదుర్కోవడానికి దారితీసుకోవడమే. ముఖ్యంగా ఆత్మహత్య ఆలోచనలు, ఇతరుల పట్ల దూకుడు భావాలు, వాస్తవికతకు దూరమైన ఆలోచనలు, సమాజం నుంచి వేరుగా ఉన్నామన్న భావన వంటివి చుట్టుముట్టే అవకాశాలు ఎక్కువ. యుక్త వయసు వచ్చాకే పూర్తిస్థాయిలో స్మార్ట్‌ఫోన్ వినియోగానికి అవకాశం ఇవ్వడం మంచిది.

– సేపియన్ ల్యాబ్స్ వ్యవస్థాపకులు, న్యూరో సైంటిస్ట్ తారా త్యాగరాజన్

8,9,10 తేదీల్లో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్

- మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



సాక్షి, హైదరాబాద్ : మృగశిరకార్తె సందర్భంగా వచ్చే నెల 8,9,10 తేదీల్లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించాలని అధికారులకు మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదేశించారు. ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌కు అనువైన ప్రాంతాలను గుర్తించి ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌పై బుధవారం సచివాలయంలో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అధర్ సిన్హా, మత్స్యశాఖ కమిషనర్ లచ్చిరాం భూక్యాలతో కలిసి మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఫెస్టివల్‌లో 20 నుంచి 30 వరకు వివిధ రకాల చేప వంటకాల స్టాల్స్, విజయ డెయిరీ ఉత్పత్తులతో కూడిన స్టాల్ ఉండే విధంగా చూడాలని ఆదేశించారు. ఫెస్టివల్ మూడు రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. సమీక్ష సందర్భంగా మత్స్య సహకార సంఘాల సొసైటీ నూతన చైర్మన్‌గా నియమితులైన పిట్టల రవీందర్ మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. అంతకుముందు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ (వీఏఎస్) అసోసియేషన్ ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. వీఏఎస్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ కొత్త జిల్లాలు, డివిజన్లు, మండలాల వారీగా పశుసంవర్ధక శాఖ ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరారు. దీనికి మంత్రి స్పందిస్తూ పశువైద్యుల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు.

రాజధాని చార్జీకే ఏసీ గరుడ ప్రయాణం

అఫ్జల్ గంజ్:తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికుల సౌకర్యార్థం కాలుష్య రహిత ఎలక్ట్రికల్ బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ సందర్భంగా ప్రయాణికులకు ప్రారంభోత్సవ ఆఫర్‌ను ప్రకటించింది. ఈ ఆఫర్ ఒక నెల రోజుల పాటు అందుబాటులో ఉండనున్నట్లు రంగారెడ్డి రీజనల్ మేనేజర్ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాజధాని చార్జీలతో ఈ గరుడ ఏసీ బస్సులో ప్రయాణించవచ్చని తెలిపారు. మియాపూర్ నుంచి విజయవాడకు రూ 750, ఎంజీబీఎస్ నుంచి విజయవాడకు రూ 710లుగా చార్జీలు ఉంటాయన్నారు. మియాపూర్ నుంచి ఉదయం 6.25, 8.25, 10.25 సాయంత్రం 6.05, రాత్రి 7.45, రాత్రి 9.45 గంటలకు బస్సులు ఉందుబాటులో ఉంటాయన్నారు. అలాగే ఎంజీబీఎస్ నుంచి ఉదయం 8.10, 10.10, మధ్యాహ్నం 12.10, రాత్రి 7.50, రాత్రి 9.30, 11.30 గంటలకు బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

రూ.21 వేల కోట్లతో సీతారామ–సీతమ్మసాగర్!

- సీడబ్ల్యూసీకి రెండో సవరణ డీపీఆర్ సమర్పణ
- ఉమ్మడి ప్రాజెక్టు విస్తరణలో భాగంగా రూ.2,200 కోట్లతో ఇల్లందు కాల్వ
- కొత్తగా 1.13 లక్షల ఎకరాల ఆయకట్టుకు ప్రతిపాదనలు
- మొత్తం 7.84 లక్షల ఎకరాలకు పెరిగిన ఆయకట్టు



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నిర్మిస్తున్న సీతారామ ఎత్తిపోతల- సీతమ్మసాగర్ ఉమ్మడి ప్రాజెక్టు విస్తరణలో భాగంగా కొత్తగా ఇల్లందు కాల్వను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సవరించిన సవివర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను అనుమతుల కోసం తాజాగా ఢిల్లీలో కేంద్ర జల సంఘాని (సీడబ్ల్యూసీ)కి సమర్పించింది. రూ.13,700 కోట్ల అంచనాలతో సీతారామ ఎత్తిపోతల పథకం, రూ.5,200 కోట్ల అంచనాలతో సీతమ్మసాగర్ బ్యారేజీ, రూ.2,200 కోట్ల అంచనా వ్యయంతో ఇల్లందు కాల్వ కలిపి మొత్తం రూ.21,100 కోట్లతో ఈ ప్రాజెక్టును నిర్మించనున్నట్టు డీపీఆర్‌లో ప్రభుత్వం ప్రతిపాదించింది.

1.13 లక్షల కొత్త ఆయకట్టు

సీతారామ ఎత్తిపోతల ద్వారా సాగునీరు అందని ఎగువ ప్రాంతాల్లోని 1.13 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందించడానికి ఇల్లందు కాల్వను నిర్మించనున్నారు. ఇల్లందు నియోజకవర్గానికి అధిక ప్రయోజనం కలగనుండగా, మధిర, డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గాలకు సైతం ప్రయోజనం చేకూరనుంది. 6.74 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో సీతారామ ఎత్తిపోతలను నిర్మిస్తుండగా, కొత్తగా ప్రతిపాదించిన ఇల్లందు కాల్వతో సీతారామ ప్రాజెక్టు కింద మొత్తం ఆయకట్టు 7.84 లక్షల ఎకరాలకు పెరగనుంది.

సీడబ్ల్యూసీకి రెండో సవరణ డీపీఆర్

విద్యుదుత్పత్తి అవసరాలకు 37 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో చేపట్టిన సీతమ్మ బ్యారేజీ పనులు 70 శాతం పూర్తయ్యాయి. 70.4 టీఎంసీల గోదావరి జలాల తరలింపునకు చేపట్టిన సీతారామ ఎత్తిపోతల పనులు సైతం 55 శాతం వరకు పూర్తయ్యాయి. దీనికి దాదాపుగా అన్ని రకాల అనుమతులను ఇప్పటికే సీడబ్ల్యూసీ ఇచ్చేయగా, అపెక్స్ కౌన్సిల్ తుది అనుమతులు ఇవ్వాల్సి ఉంది. సీతమ్మసాగర్ బ్యారేజీ నుంచే సీతారామ ఎత్తిపోతలకు నీళ్లను తరలిస్తున్న నేపథ్యంలో బ్యారేజీని సైతం సీతారామ ఎత్తిపోతల పథకంలో కలిపేసి ఒకే ప్రాజెక్టుగా అనుమతులు పొందాలని గతంలో సీడబ్ల్యూసీ సూచించింది. పర్యావరణ అనుమతుల కోసం రెండు ప్రాజెక్టులను కలిపేసి ఒకే ప్రాజెక్టుగా కేంద్ర పర్యావరణ శాఖకు ప్రతిపాదనలు సమర్పించిన రాష్ట్ర ప్రభుత్వం.. సీడబ్ల్యూసీకి వేర్వేరు ప్రాజెక్టులుగా ప్రతిపాదించడం పట్ల అప్పట్లో అభ్యంతరం వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో రెండు ప్రాజెక్టులను కలిపేసి ఒకే ప్రాజెక్టుగా ప్రతిపాదిస్తూ మళ్లీ సీడబ్ల్యూసీకి నాలుగు నెలల కింద రాష్ట్ర ప్రభుత్వం కొత్త డీపీఆర్‌ను సమర్పించింది. తాజాగా ఇల్లందు కాల్వ నిర్మాణం పనులను సైతం డీపీఆర్‌లో చేర్చి సవరించిన డీపీఆర్‌ను మరోసారి సీడబ్ల్యూసీకి ఇచ్చింది. ప్రాజెక్టుకు అనుమతుల ప్రక్రియ చివరి దశలో ఉందని, మరో నెల రోజుల్లో సీడబ్ల్యూసీ ఆధ్వర్యంలోని టెక్నికల్ అడ్వైజరీ కమిటీ (టీఏసీ) ముందుకు డీపీఆర్ వెళ్లే అవకాశం ఉందని నీటిపారుదల శాఖ వర్గాలు ఆశాభావంతో ఉన్నాయి. గోదావరిలో సీతారామ-సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు నీటి లభ్యతతోపాటు పలు సందేహాలను వ్యక్తం చేస్తూ ఇటీవల గోదావరి బోర్డు సీడబ్ల్యూసీకి లేఖ రాసింది. సీతారామ ప్రాజెక్టుకు ఇప్పటికే సీడబ్ల్యూసీ నుంచి హైడ్రాలజీ అనుమతులు లభించిన నేపథ్యంలో గోదావరి బోర్డు లేఖతో ఇబ్బందులు ఉండవని అధికారవర్గాలు చెబుతున్నాయి.

పూర్ణాహుతితో పరిపూర్ణం

- విజయవాడలో ముగిసిన శ్రీలక్ష్మీ మహాయజ్ఞం
- మంత్రోచ్ఛారణల మధ్య ఏపీ సీఎం జగన్ శాస్త్రోక్తంగా పూజలు

సాక్షి, అమరావతి: దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అష్టోత్తర శత కుండాత్మక, చండీ, రుద్ర, రాజ శ్యామల సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం బుధవారంతో ముగిసింది. వేద మంత్రోచ్ఛారణల నడుమ పీఠాధిపతులు ముందుండి నడిపించగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా మహాయజ్ఞ అఖండ పూర్ణాహుతి కార్యక్రమం వైభవంగా పూర్తైంది. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, శాంతి సౌభాగ్యాలు, పాడిపంటలు, సిరి సంపదలు, ఆయురారోగ్యాలతో ప్రజలంతా వర్ధిల్లాలని కాంక్షిస్తూ, ప్రకృతి అనుగ్రహం ఎల్లప్పుడూ కొనసాగాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్ ఈనెల 12వ తేదీన మహాయజ్ఞ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఆరు రోజులపాటు నిత్య పారాయణాలు, వైదిక క్రతువులు, వివిధ క్షేత్రాల కల్యాణోత్సవాలు, పీఠాధిపతుల అనుగ్రహ భాషణలు, ప్రవచనాలు, పూర్తి ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించిన మహాయజ్ఞ క్రతువులో 600 మందికి పైగా రుత్వికులు, వేద పండితులు పాలుపంచుకున్నారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, దేవాదాయశాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ దంపతులు దీక్షాధారణ చేపట్టి రోజువారీ యజ్ఞ కార్యక్రమాలలో పాల్గొన్నారు.



అఖండ పూర్ణాహుతి కార్యక్రమంలో సీఎం జగన్, విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి

రూ.5 వేల కోట్లకు చేరిన రుణఖాతా

ఈ నెల చివరికల్లా మరో రూ.3 వేల కోట్ల సేకరణ

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోరాష్ట్ర ప్రభుత్వ రుణఖాతా రూ.5 వేల కోట్లకు చేరింది. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిర్వహించే రాష్ట్ర ప్రభుత్వాల సెక్యూరిటీల వేలం ప్రక్రియ ద్వారా గత రెండు నెలల్లో ఈ మేరకు ప్రభుత్వం రుణాలను సమకూర్చుకుంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను తొలి త్రైమాసికంలో రూ.8 వేల కోట్ల రుణాలను బహిరంగ మార్కెట్ ద్వారా సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు ఆర్‌బీఐ షెడ్యూల్‌లోనూ పొందుపరిచింది. ఈ షెడ్యూల్ మేరకు ఏప్రిల్ నెలలో రెండు దఫాలుగా రూ.2 వేల కోట్లు, మే నెలలో రెండు దఫాలుగా రూ.3 వేల కోట్లను ప్రభుత్వం సమీకరించింది. జూన్ నెల ముగిసే నాటికి మరో రూ.3 వేల కోట్లను వేలం ప్రక్రియ ద్వారా ప్రభుత్వం సమకూర్చుకోవాల్సి ఉంది.

రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన రుణం వివరాలివి..

తేదీ	రుణ మొత్తం (రూ.కోట్లలో)
మే 16	2,000
మే 2	1,000
ఏప్రిల్ 25	1,000
ఏప్రిల్ 18	1,000

అక్కగా.. అండగా ఉంటా!

భద్రాచలం, ఖమ్మం పర్యటనలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

- విలీన గ్రామాల సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్తానని హామీ



భద్రాచలంలో ఆదివాసీ మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

భద్రాచలం/సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'రాజ్‌భవన్ ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తోంది. సాధారణంగా రాజ్‌భవన్‌ల ద్వారాలు మూసి ఉంటాయి. కానీ ఈ రాజ్‌భవన్ ద్వారాలు ప్రతి ఒక్కరి కోసం తెరిచే ఉంటాయి. ఇది నిజంగా ఒక ప్రజాభవన్. మీరు ఎప్పుడైనా హైదరాబాద్ వస్తే రాజ్‌భవన్‌ను సందర్శించండి. అక్కడ ఈ అక్క మీకు అండగా ఉంటుంది. నేను తమిళనాడు ఆడపడుచునైనా తెలంగాణ అక్కనే..' అని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. బుధవారం కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో, ఖమ్మం రూరల్ మండలంలో గవర్నర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆదివాసీలు, విద్యార్థులతో సమావేశమయ్యారు.

సీతారాములను దర్శించుకుని..

గవర్నర్ ముందుగా భద్రాచలంలో సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. క్యూలైన్లలో ఉన్న భక్తులతో కాసేపు ముచ్చటించారు. తర్వాత భద్రాచలంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివాసీలతో ముఖాముఖి కార్యక్రమంలో గవర్నర్ పాల్గొన్నారు. 'ప్రియాతి ప్రియమైన నా ఆదివాసీ బంధువులారా..' అంటూ తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించారు. ఆదివాసీల సమస్యలు తన హృదయాన్ని కలచివేస్తున్నాయని.. నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సదుపాయాలు అందకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజికంగా, ఆర్థికంగా, విద్య, వైద్యపరంగా ఆదివాసీలు అభివృద్ధి చెందడానికి కలసి పనిచేద్దామన్నారు.

జనంలోకి వెళితేనే సమస్యలు తెలుస్తాయి

ప్రజలను నేరుగా కలిస్తేనే సమస్యలపై మరింత అవగాహన కలుగుతుందని, రాజ్‌భవన్‌లో కూర్చుంటే సమస్యలు మాత్రమే వినగలుగుతానని గవర్నర్ తమిళిసై అన్నారు. ప్రజల సమస్యలను, బాధలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకే వచ్చానని, వీలైనంత వరకు సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రాలో కలిసిన ఐదు గ్రామ పంచాయతీలను తిరిగి భద్రాచలంలో విలీనం చేయాలనే డిమాండ్‌ను.. ఈ ప్రాంత ప్రజలు, ఆదివాసీల తరఫున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేస్తానని చెప్పారు.

పరిశోధనలపై దృష్టి పెట్టాలి

దేశ ఆర్థికాభివృద్ధి, ఉద్యోగాల కల్పన కోసం .. ఇన్నోవేషన్ (ఆవిష్కరణ), ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ (వ్యవస్థాపన) కీలకమని.. కళాశాలలు తమ క్యాంపస్‌లను ఆవిష్కరణలకు వేదికగా మార్చుకోవాలని గవర్నర్ తమిళిసై పిలుపునిచ్చారు. విద్యార్థులు కూడా ఆవిష్కరణలు, పరిశోధనలపై దృష్టిపెట్టాలని సూచించారు. బుధవారం ఖమ్మంరూరల్ మండలంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో వై20 ఇండియా ఉత్సవంలో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థికి ఒక ప్రత్యేకమైన సామర్థ్యం ఉంటుందని, తమ అభిరుచికి అనుగుణంగా రాణించడానికి కృషిచేయాలని సూచించారు. విద్యార్థులు రాజకీయాల్లో కూడా రాణించాలని.. చదువుకున్న రాజకీయ నాయకులు దేశానికి ఉపయోగపడతారని పేర్కొన్నారు.

సాంకేతిక సమస్య.. 'గురుకుల' దరఖాస్తుకు పలువురు దూరం

- గడువు పెంచాలని అభ్యర్థుల వినతి
- నిర్ణయం తీసుకోని నియామకాల బోర్డు

సాక్షి, హైదరాబాద్: సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లోని జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీల్లో లెక్చరర్, ఫిజికల్ డైరెక్టర్ (పీడీ), లైబ్రేరియన్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తు గడువు బుధవారంతో ముగిసింది. ఏప్రిల్ 17 నుంచి దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించిన గురుకుల విద్యాసంస్థల నియామకాల బోర్డు (టీఆర్‌ఈఐఆర్‌బీ).. అభ్యర్థులకు నెలపాటు అవకాశం కల్పించింది. అయితే, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియపై అభ్యర్థుల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. గురుకుల పోస్టుల దరఖాస్తుల సమర్పణకు ఓటీఆర్ తప్పనిసరి చేశారు. అయితే, ఓటీఆర్ నమోదు పేజీని తెరిచి ఆధార్ వివరాలు నమోదుచేసి క్లిక్‌చేసిన వెంటనే పేజీ ఎర్రర్ అని వస్తోందని, ఒకవేళ పేజీ తెరుచుకున్నా.. వివరాల నమోదు సమయంలో ఎర్రర్ వస్తున్నట్లు తెలిపారు. సమస్యపై గురుకుల బోర్డుకు ఫిర్యాదులు చేసినా, దరఖాస్తు తేదీని పొడిగించాలని కోరినా అధికారుల నుంచి స్పందన లేదని అభ్యర్థులు వాపోతున్నారు. సాంకేతిక సమస్యతో అనేకమంది దరఖాస్తు చేసుకోలేకపోయారని వారంటున్నారు. కాగా, 17వ తేదీ (బుధవారం) సాయంత్రం 5 వరకు గడువును నిర్దేశించినప్పటికీ రాత్రి 11.59 వరకు కూడా ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించినట్లు బోర్డు అధికారులు చెప్పారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.